ఆంధ్ర ప్రదేశ్

డిసెంబర్ 1970, 50 పైసలు



ఆంధ్రప్రదేశ్ గురించి

* ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 8 శాతానికీ, ఆంధ్ర ప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికీ సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 275109 చ.కి.మీటర్లు.

* 1961 లో సేకరించిన లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా 3,59,83,447 మంది.

* 1961 లెక్కల ప్రకారం, అక్షరాస్యుల శాతాన్నిబట్టి, ఆంధ్రప్రదేశ్ భారతదేశ రాష్ట్రాలలో పదవ స్థానం ఆక్రమించింది.

* 1961 లెక్కల ప్రకారం, జనాభాలో అక్షరాస్యులు 21.2శాతం మంది వున్నారు. కాగా భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 24.0.

* 1961 లో, హైదరాబాదు, కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలలో అక్షరాస్యులు, అఖిల భారత స్థాయికంటే ఎక్కువ మంది వున్నారు.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటున ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నులబొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారత దేశంలో, బారైట్స్ వుత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో వుత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95శాతం వరకు రాష్ట్రంలో వుత్పత్తి అవుతున్నది.

* అభ్రకం వుత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.


ఆంధ్ర ప్రదేశ్

డిసెంబరు, 1970
మార్గశిరం - పుష్యం, 1892 శా. శ

సంపుటి: 15 సంచిక: 2

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంచికలో



మూడో అట్ట : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లైబ్రరీ భవనం

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

పేజీ

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పని సరిగా ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించనక్కరలేదు.

ప్రకాశవంతమైన భవిష్యత్తు కోసం

ఈ ఏడాది దీపావళి పండుగ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంతో కలిసి వచ్చి 1956 నవంబరు 1వ తేదీన శ్రీ జవహర్లాల్ నెహ్రూ ప్రారంభోత్సవంచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణాన్ని గుర్తుకు తెచ్చింది. నాలుగుకోట్ల తెలుగు ప్రజలను ఒకే పరిపాలన క్రిందకు తెస్తూ విశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించి పద్నాలు గేండ్లు గడిచాయి. వెనుకటి హైదరాబాదు రాష్ట్రంలోని అయిదు మరాఠీ జిల్లాలు మహారాష్ట్రతోనూ, మూడు కర్నాటక జిల్లాలు మైసూరు రాష్ట్రంతోనూ కలవగా మిగిలిన తొమ్మిది తెలంగాణా జిల్లాలు ఆంధ్ర రాష్ట్రంలో విలీనమయ్యాయి. భారత భూఖండంలో సువిశాలమైన, సుస్థిరమైన ఏకభాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించడం, దేశ రాజకీయ చరిత్రలో అత్యంత ముఖ్యమైన సంఘటన.

భౌగోళికంగానూ, చారిత్రకంగానూ ఒకదానికొకటి అనుబంధంగా, పరస్పర పూర్వకంగా వుంటూవున్న సర్కారు, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలు మూడు ఆంధ్రప్రదేశ్‌గా రూపొందాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్యగారు ప్రసంగిస్తూ, తెలుగు ప్రజలు ఏకమైవున్న కాలంలో వారికీర్తి ప్రతిష్ఠలు మిన్నుముట్టాయనీ, వారు వేరై వున్నప్పుడు కష్టాలను ఎదుర్కొన్నారనీ, దీనికి మన చరిత్రే ఋజువనీ పేర్కొన్నారు. గడచిన పద్నాలుగేండ్లకాలంలోను ఆంధ్రప్రదేశ్ సాధించిన విశేషమైన ప్రగతి పెద్ద రాష్ట్రాల నిర్మాణంలోని వివేకాన్ని, లక్ష్యాన్ని స్పష్టంగా ఋజువుపరచింది. అభిప్రాయ భేదాలు, కష్టనిష్ఠురాలు, ఉద్రిక్తలు వుండడం కేవలం పెద్ద రాష్ట్రాలకు పరిమితమైన విషయం. కాదు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా తెలంగాణా ప్రాంతం సముచితమైన స్థానాన్ని పొంది వుండడమేగాక, యీ ప్రాంతపు వెనుకబడిన తనం, ఇతర ప్రత్యేకాంశాలదృష్ట్యా అంతకు మించిన ప్రధానమైన స్థానాన్నే ఆక్రమించి వుంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాదు రాజధానిగా కావడమే తెలంగాణాకు ఒక విధంగా లాభదాయకం అయింది. పారిశ్రామికంగానూ, తదితర రంగాలలోనూ హైదరాబాదులో జరిగిన అభివృద్ధి యీ విషయాన్ని నిరూపిస్తూన్నది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఒక సందేశాన్ని యిస్తూ, సార్వజనీన - మిశ్రమ సంస్కృతికి సంగమ స్థానమైన ఆంధ్రప్రదేశ్ ఉత్తర, దక్షిణ భారతాల మధ్య వంతెన వంటిదనీ, జాతీయ సమైక్యతను సాధించడానికై మనం చేస్తున్న బృహత్తర కృషిలో యీ రాష్ట్రం అత్యంత కీలకమైన పాత్ర వహించవలసి వున్నదనీ అన్నారు. ఇంతవరకు సాధించిన అభివృద్ధిని ప్రజలు అంచనా వేసుకుని రాష్ట్రం యింకా ఎక్కువగా అభ్యుదయాన్నీ, అభివృద్ధినీ సాధించడానికి పెద్ద ఎత్తున కృషిచేయాలని ఆయన ఉద్బోధించారు. తెలంగాణా ప్రాంతీయ సంఘం అధికారాలను విస్తృత పరుస్తూ తెలంగాణా ప్రాంతీయ సంఘం ఉత్తర్వుకుచేసిన సవరణవల్లా, ప్రధాని అష్టసూత్ర ప్రణాళికను సమర్థవంతంగా అమలు పరచడంవల్లా తెలంగాణా పరిస్థితి మెరుగు పడింది. తెలంగాణా అభివృద్ధికి సంబంధించి ఒక దశాబ్ది దీర్ఘకాలిక ప్రణాళిక నొకదానిని రూపొందించే నిమిత్తం నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయడం కూడా యీ ప్రాంతపు ఆర్థిక పాటవాన్ని మెరుగు పరచడానికి తీసుకున్న మరో ముఖ్యమైన చర్య.

జవహర్లాల్ నెహ్రూకు ఆంధ్రప్రదేశ్ అంటే అపరిమితమైన అభిమానం వుంది. ఈ విషయం మనకు, ఆయన 1953 అక్టోబరు 1న కర్నూలులో ఆంధ్ర రాష్ట్రానికి జరిపిన ప్రారంభోత్సవాన్నిబట్టి, ఆతర్వాత మూడేళ్ళకు నవంబరు 1న హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్‌కు జరిపిన ప్రారంభోత్సవాన్నిబట్టి తెలుస్తుంది. ఈ నవంబర్ నెలలోనే నెహ్రూ, ఆయన కుమార్తె భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ కూడా జన్మించడంవల్ల యీ నెల దేశానికంతకూ ప్రధానమైనట్టిదే. నెహ్రూజీ అధిక ప్రాధాన్యమిచ్చిన జాతీయ సమైక్యత సాధించబడకపోతే ఆయన జన్మ దినం నాడు ఎన్ని నివాళుల్ని అర్పించినా అవి అన్నీ వృథాయే. ఈ విషయాన్నే ముఖ్యమంత్రి కూడా తమ ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందేశంలో స్పష్టంగా పేర్కొన్నారు.

—పి. వి. ఆర్.



గ్రామసీమల్లోని విద్యావంతులకు

ఇతోధిక వృత్తి సౌకర్యాలు

1970 అక్టోబరు 2వ తేదీన రామగుండంవద్ద రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీ శంకుస్థాపనోత్సవ సందర్భమున ఏర్పాటైన సభకు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. ఆ సందర్భంలో ఆయన ఇచ్చిన అధ్యక్షోపన్యాసం యొక్క పూర్తిపాఠం.



గాంధీ జయంతి భారతీయులకు చాల పవిత్రమైన దినం. జాతీయ సమైక్యతకు, మత సామరస్యానికి, లక్ష్యసాధనకు అనుసరించ వలసిన సన్మార్గములలో మనకుగల విశ్వాసాన్ని పునశ్చరణ చేసుకోవలసిన పవిత్రమైన దినమిది. సమైక్యతా సందేశమిచ్చిన మహనీయుడు గాంధీజీ. దరిద్ర నారాయణుల శ్రేయస్సుకై శ్రమించవలసినదని హెచ్చరిక చేసిన మహాత్ముడాయన. ఇంకో విధంగా చెప్పాలంటే, గాంధీజీ వాస్తవంగా ఒక గొప్పసోషలిస్టు. సోషలిస్టు ప్రజాస్వామ్య సమాజస్థాపనకై, బ్యాంకుల జాతీయకరణ. రాజభరణాలరద్దు మున్నగు చర్యల ద్వారా గత ఒకటిన్నర సంవత్సర కాలంలో మన కృషిని ద్విగుణీకృతం చేశాము. బీదప్రజల అభ్యుదయానికై తలపెట్టిన చర్యలను అమలు పరచే విషయంలో సహాయ సహకారాలు అందజేయడం దేశభక్తిగల ప్రతి పౌరుని కర్తవ్యం.

అందరికీ ఉద్యోగాలు

వ్యవసాయరంగంలో లక్షలాది ప్రజలు అందరికీ వృత్తి ఉద్యోగాలు కల్పించడం సాధ్యంకాని విషయం. అందుకోరకుగాను మన ఆర్థిక పరిస్థితిని అభివృద్ధి పరచడానికి పరిశ్రమలను ముందుగా తప్పనిసరిగా అభివృద్ధి పరచాలి. గత కొన్నేండ్లల్లో మన రాష్ట్రంలో అనేకపరిశ్రమలను ఆరంభించే విషయంలో కృతకృత్యులమైనాము. పరిశ్రమలలో తెలంగాణా ప్రాంతంలో మాత్రమే కేంద్ర ప్రాజెక్టులు కలుపుకొని మొత్తం సుమారు రూ. 150కోట్లు పెట్టుబడిపెట్టడం జరిగింది. ఇది ఘన విజయమని చెప్పవచ్చు. రామగుండంవద్ద రసాయనిక ఎరువుల కర్మాగారం, విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ మన రాష్ట్రానికి గర్వకారణాలు. ఈ ఫ్యాక్టరీలలో భారీ యెత్తున పెటుబడి పెట్టడమే ఇందుకు కారణం కాదు. అనేక మందికి ఈ ఫ్యాక్టరీలలో ఉద్యోగాలు లభించే అవకాశంవుండడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం చాల వుంటుంది.

రూ. 71 కోట్లు పెట్టుబడిగల రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీ పోచంపాడు ప్రాజెక్టు కలిసి గ్రామీణ తెలంగాణా రూపు రేఖలనే మార్చివేయగలవు. సత్వరాభివృద్ధికి ఇవి దోహదకారి అవుతాయి.

మన "మాంచెస్టర్"

కొత్తగూడెం–రామగుండం ప్రాంతంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి విశేషావకాశాలున్నాయి. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి ప్రాజెక్టు సహాయంతో రూ 2.6 కోట్ల ఖర్చుతో దుక్క ఇనుము ఫ్యాక్టరీ ఒకటి ఏర్పాటు అయ్యే అవకాశం వుంది. ఈ ప్రాంతాన్ని ప్రాచ్యదేశ మాంచెస్టరుగా రూపొందించాలని మాజీ నిజాము ప్రభుత్వం ఆశయంగా వుండేది. అయితే తరువాత తగిన చర్యలు ఏవీ తీసుకోవడం జరగలేదు. రామగుండంలో థర్మల్ ప్లాంటు, ఇక్కడ లభించే సహజ సంపదలవల్ల ఈ ప్రాంతం

తప్పకుండా పారిశ్రామికంగా అభివృద్ధిచెందగలదు. ప్రాచ్యదేశానికి కాకిపోయినా, కనీసం, ఈ ప్రాంతానికైనా ఇది మాంచెస్టర్‌గా రూపొందుతుంది.

ఈ ప్రాజెక్టు బొగ్గుపైన ఆధారపడివుంది. 42.3 ఎకరాల ప్రాంతంలో ఇది నెలకొనివుంది. కావలసిన ముడి సరకులు ఇతర పదార్థాలు సులభంగా అందుబాటులో వున్నాయి. విద్యుచ్ఛక్తి, బొగ్గు, జలాలు సమృద్ధిగా లభిస్తాయి. ఈఫ్యాక్టరీకి రోజు 1 కి 700 లక్షల లీటర్ల నీరు, 34 మి.వా. విద్యుచ్ఛక్తి అవసరమవుతుంది. కన్వేయరు బెల్టు పద్ధతిద్వారా బొగ్గుగనుల నుంచి ఫ్యాక్టరీ స్థలానికి బొగ్గు సరఫరా అవుతుంది. టన్ను 1 కి రూ. 38.38 పైసల చొప్పున సరసమైన ధరకు బొగ్గు సరఫరా అవుతుంది.

ఈ ఎరువుల ఫ్యాక్టరీ సాలీనా దాదాపు ఒక మిలియన్ టన్నుల తక్కువ రకంబొగ్గును వినియోగిసుంది. అందువల్ల సింగరేణి కాలరీలు తమ బొగ్గుగనులను ఇతోధికంగా అభివృద్ధి పరచడానికి ఇది దోహదకారి అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నాన్-కోకింగ్ బొగ్గు రిజర్వులు విస్తారంగా వున్నాయి. వీటిని ఉపయోగించడానికి కొత్త పద్ధతులు తలపెట్టాలి. నాన్-కోకింగ్ బొగ్గును పెట్రోలియం వస్తువుగా మార్చేందుకు సింగరేణి కాలరీ యజమానులు ఒక పైలట్ ప్రాజెక్టును స్థాపించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు.

రాష్ట్రంలోని రామగుండం ప్రాజెక్టు ఇతర రసాయనిక ఫ్యాక్టరీలు కలిసి రాష్ట్రానికి అవసరమైన నత్రజని, ఇతర రసాయనిక ఎరువులను ఉత్పత్తి చేయగలవని ఆశింపబడుతున్నది. ఈ ఫ్యాక్టరీవల్ల సాలీనా రూ. 38 కోట్ల విలువగల ఎరువుల దిగుమతిని తగ్గించడం సాధ్యపడుతుంది. అంతే కాకుండా, ఆహార ధాన్యాల దిగుమతి విషయంలో కూడ సాలీనా రూ. 120 లు విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఈ ఫ్యాక్టరీ 10.2 లక్షల టన్నుల ఎరువులను ఉత్పత్తి చేయగలదు. వీటి విలువ రూ. 28.7 కోట్లు వుంటుంది. ఈ ఫ్యాక్టరీలో సుమారు 1200 మంది నిపుణులకు ఉద్యోగావకాశం లభిస్తుంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయం రూ. 1 కోటి పెరుగుతుంది.

స్వయం సమృద్ధి

వ్యవసాయ రంగంలో అగ్రగామియైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ఆహారకొరతనుతీర్చడానికి సదా కృషిచేస్తున్నది భవిష్యత్తులో ఆహారధాన్యాలు, ఇతర వస్తువుల విషయంలో కూడా స్వయం సమృద్ధిని సాధించే భాగ్యం ఆంధ్రప్రదేశ్‌కు కలుగుతుంది. చతుర్థ ప్రణాళికా కాలంలో అదనంగా 21 91 లక్షల ఎకరాలు సాగు కాగలవని ఆశించ బడుతున్నది. అప్పుడు మన రాష్ట్రంలో మొత్తం 107.37 లక్షల ఎకరాలు సాగు అవుతాయి. చతుర్థ ప్రణాళికాంతం నాటికి రాష్ట్రంలో 16 లక్షల టన్నుల అమ్మోనియం సల్ఫేటు అవసరం పడుతుంది. వ్యవసాయాభివృద్ధికి రసాయనిక ఎరువుల వినియోగం చాల సత్ఫలితాలు ఇస్తుంది. తెలంగాణా ఆర్థిక పరిస్థితి చాల మెరుగ్గా వుండగలదు.

నాగార్జున సాగరు, పోచంపాడు ప్రాజెక్టుల క్రింద కొత్తగా కొన్ని వేల ఎకరాల భూమి సాగు అవుతుంది. ఇకనుక రామగుండంవద్ద సకాలంలోనే రసాయనిక ఎరువుల ప్రాజెక్టు స్థాపించబడుతున్నది. స్వయం అభివృద్ధి సాధనకు రాష్ట్ర ప్రజలు చేసిన కృషి విషయంలో ఇది చరిత్రాత్మకమైన ఘట్టం. దీనివల్ల ఈ ప్రాంతంలో వ్యవసాయం అపారంగా అభివృద్ధి చెందడమే కాకుండా ఈ ప్రాంతపు వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ, ఆధునిక ఆర్థిక స్థాయికి పురోగమించడానికి ఈ ఫ్యాక్టరీ మూల కారణమవుతుంది. నీటి వనరులు బాగా అభివృద్ధి చెందడంతో తెలంగాణాలో వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాల దుష్ఫలితాలకు లోను కానవసరం ఏర్పడదు. అయితే గ్రామీణ పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడానికి వ్యవసాయం మాత్రమే అభివృద్ధిచెందితే సరిపోదు.

నూతన విధానం

విద్యావంతులైన యువకుల సంఖ్య పెరుగుతున్నది. జిల్లాలో ఉద్యోగావకాశాలు పరిమితంగా వున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలంటే వ్యవసాయంలో ఉపాధి లభించని యువకులకు కొత్త ఆర్థికావకాశాలను కల్పించి నూతన విధానాన్ని అనుసరించటం ఉత్తమమని నేను భావిస్తున్నాను. పట్టణాలు, గ్రామాలలో నూతన పరిశ్రమలను భారీఎత్తున నెలకొల్పి వ్యవసాయేతర రంగాలలో ఆర్థికావకాశాలను ఎక్కువగా కల్పించడంవల్ల ఇది సాధ్య పడుతుంది.

దేశ పారిశ్రామిక అభివృద్ధి ప్రభావం మన రాష్ట్రంపై బాగా వున్నప్పటికీ, వీటి ఫలితాలు ఒక్క హైదరాబాదు, విశాఖపట్నంలో తప్ప ఇతర ప్రాంతాలలో కనిపించడంలేదు. 1951 లో ప్రణాళికల అమలు ప్రారంభించి నప్పటినుండి లభించిన పారిశ్రామికీకరణ ఫలితాలను అనేకమంది—ముఖ్యంగా విద్యావంతులైన యువకులు—అనుభవించడానికి అవకాశాలు కల్పించే సమస్యను మనం ఎదుర్కొంటున్నాము.

అనుబంధ పరిశ్రమలు

అందువల్ల అనుబంధ పరిశ్రమలు,వినియోగ వస్తువుల పరిశ్రమలు, సర్వీసు పరిశ్రమలు విస్తరింప జేయడానికి యీ ఎరువుల ఫ్యాక్టరీ ముఖ్యప్రాతిపదికగా తయారు కావడం చాలా అవసరం. భారీ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలతో ముడిపడి ఉండాలి. దీర్ఘకాలిక ప్రాతిపదికపై యీ ఎరువుల ఫ్యాక్టరీ, కొత్తగావెలిసే యితర పరిశ్రమలు పరస్పర సహకారంతో సంయుక్తంగా వ్యవహరిస్తూ సత్ఫలితాలను అందించే విధంగా చేయడానికి ఎరువుల కార్పొరేషన్, రాష్ట్ర పరిశ్రమలశాఖ సమిష్టిగా ఒక పథకాన్ని రూపొందించాలి. ఎరువుల ఫ్యాక్టరీకి అవసరమైన అన్ని పరికరాలను అందించే విధంగా విస్తృత ప్రాతిపదికపై పెద్ద వర్కు-

షాపును రూపొందించి నెలకొల్పడమో, లేదా భారీ అవసరాలను మాత్రమే తీర్చేవిధంగా వర్కుషాపును నెలకొల్పి ఎరువుల ఫ్యాక్టరీకి అవసరమైన యితర స్వల్ప అంశాలను తీర్చడానికి సంబంధించిన అనుబంధ పరిశ్రమలను లఘు పరిశ్రమదారులు నెలకొల్పేవిధంగా చేయడమో జరగాలని నేను భావిస్తున్నాను.

నగరాలలోనే గాక పట్టణాలు, గ్రామాలలో కూడ పరిశ్రమలను నెలకొల్పే విధంగా నూతన సంస్థాగత విధానాలను మనం రూపొందించాలి. తద్వారా మాత్రమే విద్యావంతులైన యువతీ యువకులకు తగిన ఆర్థిక అవకాశాలను కల్పించడానికి వీలు కలుగుతుంది. పశ్చిమ బెంగాలులో జరిగినట్లు, కొన్ని ప్రదేశాలలో మాత్రమే భారీ పరిశ్రమల స్థాపన కేంద్రీకృతమైనప్పుడు వాటి వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యి గ్రామీణ, పట్టణ ప్రాంతాలమధ్య అగాతం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ విధంగా జరగనివ్వకూడదు.

ఉపాధి కల్పనకు-ముఖ్యంగా విద్యావంతులైన యువకుల ఉపాధికల్పనకు-పారిశ్రామికీకరణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ సమాజంలోని బలహీన వర్గాల పరిస్థితులను మెరుగుపర్చడానికి కూడ చర్యలు తీసుకోవాలని నేను ఎల్లప్పుడూ కేంద్రానికి నొక్కి చెప్పుతున్నాను. సమాజంలో అధిక సంఖ్యాకులుగా ఉన్న నేత పనివారు, మత్స్య పారిశ్రామికులు, చర్మ కారీ పని వారల ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరంఉంది.

మహబూబ్ నగర్ జిల్లా స్వయం ఉపాధి పథకం

ఇతర జిల్లాల మాదిరిగానే మహబూబునగర్ జిల్లా కూడా నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నది. నిరుద్యోగులైన విద్యావంతులకు ఉపాధిసౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఉపాధి, శిక్షణశాఖ రూపొందించిన స్వయంఉపాధి పథకాన్ని అమలు జరపడానికి మహబూబునగర్ జిల్లాను ఎన్నుకున్నారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలో శిక్షణ పొందినవారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు ఆర్థిక సహాయంతో చిన్నపాటి పారిశ్రామిక యూనిట్లను నెలకొల్పచేయడమే యీ పథకం ముఖ్య ఉద్దేశం. తగిన యంత్ర పరికరాలను సెలక్టు చేయడంలోను, వారు నెలకొల్పిన పరిశ్రమలను పెంపొందించడంలోను ఉపాధి, శిక్షణశాఖ అవసరమైన సహాయం అందజేస్తుంది. పారిశ్రామిక శిక్షణ సంస్థలో శిక్షణపొందిన నిరుద్యోగులకు ఉపాధి సౌకర్యాలు కల్పించడంలో యీ పథకం దోహదం కలిగిస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలో 54 లఘు పరిశ్రమల యూనిట్లను నమోదు చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు వారు 7 యూనిట్లకు రు. 14865 ల మేరకు ఋణాలు మంజూరుచేశారు. దీనికితోడు పరిశ్రమల శాఖ రెండు పారిశ్రామిక సంస్థలకు రు. 1600 ల మొత్తాన్ని మంజూరు చేసింది.

విద్య

మహబూబునగర్ జిల్లాలో 1969_70 సంవత్సరంలో విద్యారంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించారు. కొల్లాపూర్, షాద్‌నగర్, నారాయణపేట, కల్వకుర్తి, వనపర్తి, కొడంగల్, ఆత్మకూరు, కోస్గీ, అచ్చంపేట, నాగర్ కర్నూలు, మహబూబునగర్‌లలో 11 జూనియరు కళాశాలలను ఏర్పాటుచేశారు, మహబూబునగర్‌లో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. 490 మంది షెడ్యూలు కులాలు, ఆర్థికంగా వెనుకబడిన కులాల విద్యార్థుల నిమిత్తం 6 కళాశాలలు, 6 ఉన్నత పాఠశాలల హాస్టళ్ళను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ పథకానికి రు. 1.21 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా.

ఉత్పత్తి ఋణాలు


జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులను పెంపుచేయడానికి రైతులకు సకాలంలో తగిన ఋణాలు అందజేయడం చాలా అవసరం. అందువల్ల ప్రస్తుత సంవత్సరంలో యీ జిల్లాలోని రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాల రూపంలో రు. 1.90 కోట్ల మొత్తాన్ని మంజూరుచేయాలని ప్రతిపాదించారు. 1970_71 వ సంవత్సరంలో స్వల్పకాలిక ఋణాలక్రింద రు. 80 లక్షలు మంజూరు చేయాలని నిర్దేశించబడగా 1970 జూలై నాటికి రు. 23.56 లక్షలు పంపిణీచేశారు. ఈ సంవత్సరం దీర్ఘకాలిక ఋణాలక్రింద రు. 110 లక్షలు మంజూరుచేయాలని ఉద్దేశించారు. అందులో కొత్తబావుల త్రవ్వకం, ఆయిల్ ఇంజనులు, విద్యుచ్ఛక్తి మోటార్లు, ట్రాక్టర్ల కొనుగోలుకు 1970 జూలై నాటికి రు.21.45 లక్షలు భూమితనఖా బ్యాంకులద్వారా పంపిణీచేశారు. ఈ ఋణాల ద్వారా జిల్లాలోని రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు దోహదం కలుగుతుంది.


నీటి లోతట్టులో చేపలు పట్టడం

జిల్లాలోఅనేక చెరువులు ఉన్నాయి. వాటిలో చేపల్ని పెంచడానికి మంచి అవకాశాలు కూడా ఉన్నాయి. చెరువులలో చేపల పెంపకం కార్యక్రమం క్రింద కోయిలసాగర్ రిజర్వాయరులో చేపలు పట్టడానికి 4 మత్స్య పారిశ్రామికులతో, ఒకపడవా, నైలాన్ వలలతో నీటి లోతట్టులో చేపలు పట్టే యూనిటును ఏర్పాటుచేశారు. ఇక్కడి చేపలను ప్రతిరోజు మహబూబునగర్ మార్కెటుకు పంపడం జరుగుతున్నది. కోయిలసాగర్‌లో రు. 20,000 ల ఖర్చుతో హేచింగ్ షడ్ నిర్మించాలని ప్రతిపాదించారు.



ఎరువుల పరిశ్రమలో నూతన శకం







1. కేంద్ర పెట్రోలియం, రసాయనాల మంత్రి డా... త్రిగుణ సేన్ అక్టోబరు 2న ఎరువుల కర్మాగారానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం


2 గాంధీజీ పటానికి పూలమాలవేస్తున్న డా. త్రిగుణ సేన్


3, 4. ముఖ్యమంత్రి ఆవిష్కరించిన పైలాన్

5, 6, 7. సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, శ్రీ చొక్కారావు


8, 9, 10, ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజలు



5


6


7


8





సర్ ఆర్థర్ కాటన్ జీవిత విశేషాలు

ఒక సామాన్య కుటుంబంలోని సభ్యులు ఒక రోజున రోడ్డు పై వెడుతూ వుండగా, ఆ రోడ్డు ప్రక్కనే వున్న మురికి కాలువలో ఎర్రని నీళ్ళు ప్రవహించడం చూసి ఆ కుటుంబంలోని కుర్ర వాడు పరుగెత్తుకువెళ్ళాడు. కాల్వ చివరి దాకా వెళ్ళి ఆ ఎర్రని నీళ్ల ప్రవహించడం కొంత దూరములో అద్దంపు పనివారు పనిచేసుకొనుట చేతనే అని తెలిసికొని యింటికి చేరాడు అంతటి కార్యదీక్ష, పట్టుదల గల బాలుడే గోదావరి నదీ తీరమున నివసించి, ఆనకట్టలు నిర్మించి కృష్ణానదిపై ఆనకట్టలు కాల్వలు త్రవ్వుటకు కారణ భూతుడైన మహనీయ వ్యక్తి సర్ ఆర్థర్ కాటన్.

సర్ ఆర్థర్ కాటన్ 15 మే 1803 సంవత్సరంలో హెన్రికాల్ వెలీ కాటన్ దంపతులకు పదవ కుమారుడుగా జన్మించాడు. కాటన్ కుటుంబీకులలో సర్ ఆర్థర్ కాటన్ చిన్నతనం నుండీ. వున్నత భావములు కలిగి వుండేవాడు. కాటన్ తల్లి విశాలదృక్పథము, సునిశిత నిర్ణయ శక్తితో, చిన్నతనము నుండి ఆయన్ను ఎంతో తీర్చి దిద్ది ఒక ఆదర్శ పురుషుడుగా తయారుచేసింది. ఆయన 15 సం॥ వయస్సులో ఎడిస్కోంబేలో ఇంజనీరింగు విద్య అభ్యసించాడు. అఖండ ప్రతిభాశాలి గనుకనే పరీక్షకు వెళ్ళకుండానే Roya Engineer వుద్యోగము సంపాదించ గలిగాడు. 1821 మే నెలలో అనగా 18 సం॥ ప్రాయంలో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటులో నియమించగా ఆయన భారత దేశమునకు వచ్చాడు. అప్పటి నుండీ ఆయన మిలిటరీ భవనాల నిర్మాణపు పనిలో 1827 సం॥ వరకు వున్నాడు. ఆ తర్వాత కావేరి నీటిపారుదల పథకముల పైననూ, పాంబన్ పనుల పైననూ ఆయన నియమించ బడ్డాడు. ఆ సందర్భంలో కావేరినది నీళ్ల ఎంతవరకు వ్యవసాయపు పనులకు వుపయోగించ గలవని తీవ్రంగా పరిశోధన చేశాడు. అక్కడ ఆనకట్టలు నిర్మించుటకు 1830 సం॥ లో పని ప్రారంభింప చేశాడు. రాత్రింబవళ్లు పనిచేయుటవల్ల ఆరోగ్యంచెడి ఆయన టాస్మానియా వెళ్ళవలసి వచ్చింది.

రాజమండ్రిలో

అక్కడినుండి ఆరోగ్యం కుదుట పడివచ్చిన తర్వాత ఆయన్ను ఒక చర్చి నిర్మాణంకోసం రాజమండ్రి పంపారు. ఆ సందర్భంలో గోదావరి ఆనకట్టలు నిర్మించు ప్రాంతమును, ఆ నది యొక్క పరిస్థితిని పూర్తిగా పరిశీలించే అవకాశం ఆయనకు కలిగింది. ఈనాడు ఉభయ గోదావరి జిల్లాలలో 12 లక్షల ఎకరములు సాగులోకి వచ్చినవంటే కాటన్ మహాశయుని గణనీయమైన కృషి వల్లనే. కృష్ణాగోదావరి జిల్లాలను ఒక కలువతో కలుపుటకు ఆయన యోచించాడు. 1832–1833 సం॥ లో యావద్భారత దేశంలో క్షామదేవత విలయతాండవం చేసింది. జనాభా సగభాగంపైగా తగ్గిపోయింది. 1843 సం॥ లో యీ క్షామనివారణ పరిశీలనకు హెన్రీ మాంటు గోమరీ నాయకత్వాన ఒక కమిటీ ఏర్పడింది. దేశంలో నీటిపారుదల పథకములు అమలు జరుపక పోవుటయే యీక్షామ పరిస్థితులకు ముఖ్యకారణమని యీ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. తర్వాత హెన్రీమాంటు గోమరీ తంజావూరు కలెక్టరుగా వున్నపుడు ఆయన రాజమండ్రి జిల్లాలో కరువు కాటకములు పూర్తిగా నిర్మూలించుటకు అవసరమైన చర్యలు తీసుకొనవలెనని అందుకు సర్ ఆర్థర్ కాటన్ సేవలు ఎంతో అవసరమని గవర్నమెంటుకు సిఫారసు చేశాడు. అప్పటి మద్రాసు ప్రభుత్వం యీ శిఫారసు అంగీకరించిన తర్వాత 1844 సం॥ ఆగస్టు నెలలో కాటన్ దొర ఒక రిపోర్టు పంపాడు. తర్వాత కాటన్ నివేదికననుసరించి ఛీఫ్ యింజనీరు 1848 సం॥ లో పని ప్రారంభించుటకు ఏర్పాట్లు చేశాడు.

ఇంజనీరింగ్ సలహా దారుగా

రాత్రి అనక పగలనక చేసిన మానవాతీతమైన కాటన్ మహాశయుని మహత్తర కృషి ఫలితంగా 1852 సం॥ మార్చి నెలాఖరుకు గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్టలు వెలిసినవి. 1853 సం॥ లో కాటన్ దొర కాలువల త్రవ్వకపుపని ఆవశ్యకతను కూడా గవర్నమెంటు వారికి తెలియజేశాడు. అప్పటికి ఆయన ఆరోగ్యం బాగులేనందున విశ్రాంతి కొరకు ఇంగ్లాండు వెళ్ళాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత ఇంజనీరింగు విషయంలో ప్రభుత్వ సలహా దారుగా నియమించ బడ్డాడు. అప్పుడు ఆయన

రావిపాటి మహానంద

ఒరిస్సా రాష్ట్రములో ఒక నీటిపారుదల పథకమును యిరిగేషన్ అండ్ కెనాల్ కంపెనీ వారికి అప్పగించి సమర్థవంతముగా చేయించాడు.

కాటన్ మహాశయుని దూరదృష్టి

కాటన్ మహాశయుడు మన దేశంలో 40 సంవత్సరాలు అనన్యమైన కృషి చేసి తన జీవితమును భారత ప్రజల అభ్యుదయానికి అంకితంచేసి కరువు కాటకములు నిర్మూలించి స్వదేశమునకు తరలిపోయాడు. ఆయన 1881 సం॥లో యీ క్రింద నుదహరించిన మరికొన్ని ముఖ్యమైన పనులు అవసరమని తెలియజేశాడు.

1. తీరప్రాంతమున గోదావరినుండి మద్రాసు వరకు 380 మైళ్ళ గల కాలువ నిర్మాణము,

2. మిగిలిపోయిన కృష్ణా గోదావరి డెల్టాలో పనులు పూర్తి చేయుట.

3. ఎగువ గోదావరి (అప్పర్ గోదావరి ప్రాజెక్టు) పని పూర్తి చేయుట.

4. తుంగభద్ర కాల్వ నుంచి ఒక జంక్షను కాలువ కడప నుంచి నెల్లూరు వరకుగల వుత్తర తీర కాలువ వరకు 80 మైళ్ళ త్రవ్వకం.

5. తుంగభద్రనది మీద ముప్పయి కోట్ల ఘనపు గజముల నీరు నిలువ వుంచుటకు ఒక చెరువు నిర్మాణము.

6. ఇప్పుడు దేశములోవున్న అన్ని చెరువులను పూర్తిగా మరమ్మతు చేయుట.

7. మైసూరు రాష్ట్రమునగల అన్ని చెరువులను నింపుటకు ఒక కాలువ త్రవ్వకము.

8. నెల్లూరునకు 40 మైళ్ళ దూరములో (అనగా కొండల ప్రాంతంలో) పెన్నానదిపైన అడ్డకట్ట నిర్మాణం చేసి అక్కడి నుండి కృష్ణానదికి వుత్తరముగాను మైసూరునకు దక్షిణంగాను కాలువలు 400 మైళ్ళ త్రవ్వటము

9. దక్షిణ తీరకాలువ కన్యాకుమారి నుండి కర్వార్ వరకు పూర్తిచేయుట.

10. కృష్ణాహైలెవల్‌కాలువను 200 మైళ్ళ పెన్నానది వరకు పొడిగించుట.

11. నాగపూరుకు దక్షిణ ప్రాంతములో రెండు పెద్ద చెరువులను పన్‌హాయిర, కనహాన్ నదులపై నిర్మించుట.

ఈ విధంగా తన జీవితమంతా భారతదేశమునకే అంకితం చేసి, ఎన్నో విధాల దరిద్ర దేవతతో పోరాడి 1899 సం॥లో కాటన్ చనిపోయాడు. ఆయన అమరజీవి, మరువరాని మనిషి. గోదావరి బరాజ్ శంకు స్థాపన సందర్భంలో కేంద్ర నీటిపారుదల మంత్రి శ్రీ కె. యల్. రావుగారు చెప్పినట్టు ఆయన ఋషితుల్యుడు.


ఋషితుల్యుడు

గోదావరి ఆనకట్ట నిర్మించి దాదాపు వంద సంవత్సరాలు పై బడింది. అందువల్ల మన ప్రభుత్వం కూడా గుర్తించి, ప్రజల సహకారంతో బ్యారేజ్ నిర్మాణమునకు మన ముఖ్యమంత్రిగారు 11-4-1970 తేదీన శంకు స్థాపన చేశారు. యీ సందర్భంలో శ్రీ కె.యల్. రావుగారు చెప్పినట్లు తాటియాకుల పాకలో నివసించి, నిరాడంబరమైన జీవితము గడిపి గణనీయమైన కృషి చేసిన ఆయన నిజంగా ఋషితుల్యుడు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని యిప్పటి ఇంజనీర్లు నిరాడంబరతను అలవాటు చేసుకొని మనది పేద దేశమని గ్రహించి కృషిచేసి దేశ సౌభాగ్యానికి తోడ్పడవలెనని తెలిపినారు.

కాటన్ మహాశయుని ఆదర్శప్రాయమైన నిరాడంబర కృషి జ్ఞప్తికి తెచ్చుకుంటేనైనా యిప్పటి ప్రాజెక్టులలో జరుగు అవినీతి, దుర్వ్యయము, భోగలాలసత్వం కొంతైనా తగ్గి దేశానికి మేలు, కాటన్ మహాశయుని ఆత్మకు శాంతి కలుగునని ఆశిద్దాం.

ఆహార పదార్థాలను దుబారా చేయకండి

సీరియల్



ఆంధ్ర ప్రశస్తి

జంబూ ద్వీపంలో దండకారణ్య మొక భాగము. అందులోనే నేటి ఆంధ్ర దేశము ఆనాడు కనుమరుగై యుండినది.

గోదావరి, కృష్ణ, పినాకిని, తుంగభద్రాది జలాలచే పునీతమై సస్యశ్యామలమై భాసిస్తూ తేజోరాశిలా వెలుగొందుచున్నది ఆంధ్రభూమి.

గోదావరి తీర్థం సేవించి ఆదికవి నన్నయ భారత సాంస్కృతిక పరమోత్కృష్ట చిహ్నమయిన మహాభారతమును సంస్కృతము నుండి తెలుగు భాషలోకి అనువాదం ప్రారంభించి తెనుగు కవితకు నాందీగీత మాలాపించాడు.

ఆ తీర్థాన్ని స్వీకరించి హాలికుడు, మధురకవి బమ్మెర పోతరాజు మహాభాగవతాన్ని ముక్కోటి యాంధ్రుల కందించాడు.

కృష్ణ నీరు త్రాగి నాగార్జునుడు బుద్ధ భగవానుని సూక్తులను భారతావనికి నివేదన గావించినాడు.

పినాకిని జలాల స్వీకరించి కవి బ్రహ్మ తిక్కయజ్వ, ప్రబంధ పరమేశ్వరుడని గణుతికెక్కిన యెఱ్ఱనామాత్యుడు భారత, హరివంశాల నందించి పూజ నీయులైనారు.

తుంగ భద్ర మధుర జలాల కడుపార త్రావి, దేశభాష లందు తెలుగు లెస్సయని, అష్టదిగ్గజములకు సేవ జేసి చరితార్థుడై, అజరామరకీర్తి సంపాదించు కొన్నాడు శ్రీ కృష్ణ దేవరాయలు.

శ్రీరాముని చరిత్రను ఎందరు రచిస్తే నేమి స్వామి స్తుతి కంత మెక్కుడిదని కవయిత్రి మొల్ల ఆ రామాయణగాథనే తెలుగు ప్రజల కంద చేసి, కవి పండిత హృదయాల్లోనే గాక ప్రతి ఆంధ్రుని యింట తన పేరు నిలుపుకొన్నది.

శ్రీరాముని కీర్తించిన రామదాసు భక్త రామదాసుగా ఖ్యాతి గాంచి పండిత పామర హృదయాల్లో నిలిచిపోయాడు.

గుంటూరు తూము నరసింహదాసు, మువ్వ క్షేత్రయ్య, అన్నమాచార్యుల వంటి భక్తిగాయక శిఖామణులు యెందరో యీ ఆంధ్రావనిలో జన్మించి తెలుగు దేశానికి, సంస్కృతికి వెలుగు చేకూర్చారు.

అట్టి ఆంధ్రదేశంలోని కర్నూలు జిల్లా, కంభ తాలూకా, కాకర్లగ్రామంలో త్యాగరాజుని కన్న దంపతుల ప్రపితామహులు పంచనద బ్రహ్మంగారు నివసిస్తుండేవారు.

పూర్వ గాథ

ఆనాటి ద్విజులు నిత్య వేదాధ్యయన తత్పరులై ఉపనిషత్తులు, పురాణాలు బాగా పఠించి సామాన్యులకు యితిహాస గాథలను వాడుక భాషలో బోధిస్తూ వారిలోని యజ్ఞానాంధకారాన్ని పారద్రోలుతూ వుండేవారు. అట్టివారిలో దిట్ట బ్రహ్మశ్రీ పంచనదబ్రహ్మంగారు.

శ్రవణానందకరమయిన వారి పురాణ గాథలు శ్రోతల నానందపరచినా వారు మాత్రం తగిన ప్రతి ఫలం సంపాదించుకోలేక కొరవతోనే కాలం గడిపేవారు.

చదువుల తల్లి సాక్షాత్కారమున్నా ఆమె అత్తగారు మాత్రం కోడలి పైనేగాక, కోడలి భక్తుల పై కూడా కినుక వహించి యుండుటచే పంచనద బ్రహ్మంకూడా లేమితో బాధపడుతుండేవాడు.

ఒకనాడు నిత్య బాధలకు తట్టుకోలేక ప్రజాదరణతో రాజాశ్రయం లేనిదే జీవిత నావ సాగడం కష్టమని వలసపోతున్న వారిని జూచి తనూ స్థానం మార్పు జేయవలెనని నిర్ధారణ జేసుకొన్నాడు.

ఆంధ్రదేశం కవి గాయక శిఖామణుల కెంత ప్రసిద్ధమో అంతకన్న ఓ మెట్టు యెక్కువగానే దక్షిణ దేశం అలరారుతుండేది.

అందులో తంజావూరిది ప్రథమ స్థానం. నాయక రాజుల పాలనలో కావేరీ నదీ తట సీమయైన తంజావూరు మూడు పువ్వులు ఆరు కాయలుగా భాసిల్లుచుండినది.

పంచనద బ్రహ్మం అట్టి తంజావూరుకు వలస వచ్చాడు.

తంజావూరు దాక్షిణాత్యసీమ అయినా ఆంధ్రభాషకు నిలయం. ఎందరో పండితులు, గాయకులు తెలుగు భాషా ప్రావీణ్యతచే, గానమాధుర్యముచే రాజుల మన్ననల బొంది ఆశ్రయం సంపాదించారు. తెలుగు భాషలోని తియ్యదనాన్ని రుచి జూచిన నాయకరాజులు వారి నెంతో గౌరవించి తాము ధన్యుల మయ్యామని సంతసించెడివారు.

వలస వచ్చిన తెనుగు కవులకు, యితర పెద్దలకు స్వాగత మిస్తూ రాజాశ్రయం పొందేట్లు యేర్పాటు జేస్తుండిన వారిలో అదివరకే రాజాభిమాన గౌరవాలు పొందిన వారిలో బ్రహ్మశ్రీ వీణ కాళహస్తి అయ్యర్ ఒకరు. ప్రసిద్ధ వైణికులు, విద్వాంసులు పంచనద బ్రహ్మంగారికి అయ్యర్‌గారి తోడ్పాటు లభించింది.

పంచనద బ్రహ్మం స్వగ్రామం వదలి వచ్చినందుకు చింతించినా తలచిన కార్యం నెరవేరినందుకు సంతసించి నగర దైవం త్యాగరాజ స్వామిని దర్శించి అయ్యర్‌కు కృతజ్ఞత తెలుపుకొన్నాడు. రాజాస్థానంలో అనతికాలంలోనే పేరు సంపాదించుకొన్న పౌరాణికుల్లో ఒకడైనాడు.

పంచనద బ్రహ్మంగారికి ఏడు మంది కుమారులు. అందులో కడగొట్టి బిడ్డడు గిరిరాజ బ్రహ్మం. గిరిరాజ బ్రహ్మం చివరి కుమారుడు రామబ్రహం. గిరిరాజ బ్రహ్మం, రామబ్రహ్మం ఇరువురూ పంచనద బ్రహ్మం పేరు నిలిపినవారే. రామబ్రహ్మం. ఆనాటి పాలకుడు తులశింగుకు మరీ సన్నిహితుడు. రామబ్రహ్మం పురాణ పఠనము తులశింగునకు అత్యంత ప్రియము. అంతే కాదు, తులశింగు ప్రేమాభిమానములు పొందిన రామబ్రహ్మం తిరువారూర్‌లో ఒక యింటిని బహుమతిగా కూడా పొందినాడు.

రామబ్రహ్మం కేవలం పండితుడేగాదు. భక్త శిఖామణి. రామభక్తుడు. నిత్య దైవారాధన యితని దినచర్యలో మొదటిది.

రామబ్రహ్మం నియమనిష్టలు, దైవభక్తి, సాంస్కృతిక రంగంలోగల ప్రతిభను గుర్తించి పంచనద బ్రహ్మం యొక్క పవిత్ర స్నేహాన్ని పురస్కరించుకొని తన మనుమరాలు సీతమ్మను యిచ్చి వివాహం గావించాడు కాళహస్తి అయ్యర్. సీతమ్మ తాతగారి వద్ద చక్కగా సంగీతం అభ్యసించిన యువతి. రామ బ్రహ్మానికి తగిన జోడి.

కొంతకాలానికి పంచనద బ్రహ్మం విష్ణు సాయుజ్యమందాడు. తండ్రి గిరిరాజ బ్రహ్మం కూడా పంచనద బ్రహ్మం మరణించిన కొద్దికాలానికే కాలగర్భంలో కలిసి పోయాడు. తండ్రి చనిపోయినప్పటికి రామబ్రహ్మానికి ఒక శిశువు మాత్రమే జన్మించాడు. తాతతండ్రులు నివసించినయింటిలోనే నివసిస్తుండేవాడు.

ఇంటికి యజమాని రామబ్రహ్మం. సీతమ్మ గృహధర్మ నిర్వహణలో రామబ్రహ్మం సంతుష్టి జెందాడు. ఒడిదుడుకులు లేకుండా వారి సంసారం సాగుతూ వచ్చింది. ప్రథమంగా జన్మించిన శిశువుకు, తాము తాతగారి చలువతో సంసారం అభివృద్ధి చేసుకొన్నామనే దృక్పథంతో పంచాపకేశుడని నామకరణం జేసికొన్నారు. కాలం మరొక పుత్రుని ప్రసాదించింది. కులదైవం రాముని పేరుపెట్టారు. పూర్తి పేరు రామనాథం. బిడ్డలు యెదుగుచున్నారు. విద్యాభ్యాసం జరిగింది. చదువు సాగిస్తున్నారు. పుత్రులకు చదువుకన్న చిలిపిచేష్టలు యెక్కువ కాసాగినవి. వీధిలోని జగడాలు యింటికి వచ్చేవి. పండిత పుత్రుడు అనే నానుడుని సార్థకం చేస్తాడేమోననే భయం రామబ్రహ్మం, సీతమ్మలలో కల్గింది. పండిత వంశమనే పేరు కనుమరుగవుతుందేమోనని కలత జెందసాగారు. ఎవరు చేయగల్గినదే మున్నది. **విధికి** వినయ పూర్వకంగా నమస్కరించక తప్పదుకదా!

దినములు దొరలుచున్నవి. నెలలు గడచినవి. మరల సీతమ్మ గర్భవతైనది.

రామబ్రహ్మానికి యీ విషయం సంతోషాన్ని కలిగించలేదు. తనకు మంచిపేరు తెచ్చే పుత్రులు కలుగరనే నిరాశ ప్రబలం కాసాగింది. కేవలం పున్నామనరకంనుంచి తప్పించే వాడు పుత్రుడుగాడని, పితృమాతాది వంశీయులకు కీర్తినిదెచ్చే సద్వర్తనుడయిన పుత్రుడు లభించినపుడే తల్లిదండ్రులు సంతుష్టి జెందగలరని, అట్టిభాగ్యం తమకు లేదేమోనని దిగులు పట్టుకొంది రామనాధానికి.

సీతమ్మకు నవమాసాలు నిండాయి.

ఒకనాడు దంపతులిరువురు మామూలుగా రాత్రి శ్రీరామునికి ఆరగింపు సేవచేసి, తామూ భుజించి శయనించారు పుట్టబోయే శిశువుని గురించి ఆలోచిస్తూ.

తొలికోడి కూసింది. అంతలో యెవరోవచ్చి రామబ్రహ్మమును తట్టిలేపారు. ఎవరో తెలియలేదు రామబ్రహ్మానికి. "నాతో రా" అని ఆజ్ఞాపించారు రామబ్రహ్మాన్ని ఎవరో గొప్ప పండితు



నిలా వున్నారు. ఫాలభాగాన విభూతిరేఖలు, చెవులకు కుండలాలు కంఠసీమన రుద్రాక్షమాల, విభూతిరేఖల మధ్య గంధపుబొట్టు. బొట్టుపై సన్నని నామము. వర్ణించనలవిగాని ముఖకాంతి. పట్టు పీతాంబరములు ధరించి నిండైన విగ్రహంగల ఆ ఆగంతకుని అనుసరించాడు తనకు తెలియకుండానే రామబ్రహ్మం.

నగరదైవమైన శ్రీ త్యాగరాజస్వామి ఆలయములోనికి వెళ్ళారు. స్వామి విగ్రహమున కెదురుగా నిలిచాడు నూతనవ్యక్తి. ఒకవైపు ప్రక్కగా నిలబడ్డాడు. రామబ్రహ్మం. స్వామి సన్నిధిని గల చిరుదీపకాంతిలో మరలా ఆ వ్యక్తిని పరికించి చూచాడు రామబ్రహ్మం. తానెరిగిన వ్యక్తిగాదు. ఇంతకు ముందెన్నడు కలిసినట్టు గురుతులేదు. కనీసం ఒక్కచోటయినా చూడలేదు. కాని తనను తెలిసినట్లు ఆ వ్యక్తి ప్రవర్తించడం రామబ్రహ్మానికెంతో ఆశ్చర్యాన్ని గలుగజేసింది. ఎవరైతేనేం...... రామబ్రహ్మానికి ఆ వ్యక్తి మహాపండితుడు., దైవాంశ సంభూతుడిలా కనుపించాడు. శిరస్సువంచి కైమోడ్చాడు రామబ్రహ్మం. నూతన వ్యక్తి తన కరమెత్తి ఆశీర్వదిస్తూ మందస్మిత వదనంతో "రామబ్రహ్మం" అని పిలిచాడు.

ఆశ్చర్యమేసింది రామబ్రహ్మానికి. తన నెటులెరుగును ? స్వామీ అనడానికి సైతం నోరు పెగలలేదు.

"రామబ్రహ్మం ! నీవు, నీ భార్య మీకు పుట్టబోయే శిశువు గురించి ఖేదిస్తున్నారు గదా !''

రామబ్రహ్మానికి మరింత ఆశ్చర్యమయింది. అంతా అయోమయంగా తల యూచాడు.

"మీకు జన్మించబోయే బిడ్డను గురించి దిగులు పడనవసరం లేదని చెప్పుటకే నిన్ను నే నిక్కడికి తీసుక వచ్చాను రామబ్రహ్మం ! నేను యీ నగర దైవమును-త్యాగరాజును, మీ దంపతులకు సరస్వతి, నారద, వాల్మీకి, నా యొక్క ......అని చెప్పుచుండగనే మరొక నూతనవ్యక్తి వేగిరపాటుతో వారి సమీపానికి వచ్చి నిలిచినాడు.

త్యాగరాజస్వామికి భక్తితోశిరస్సువంచి నమస్కరించాడు.

త్యాగరాజ స్వామి నవ్వుతూ "మహర్షీ ! మీరువచ్చిన కార్యమవగతమయిందన్నట్లు చిరునవ్వు నవ్వగనే ఆమౌని మరల నమస్కరించి రామబ్రహ్మంకేసి చల్లగజూచి అంతర్ధాన మయ్యాడు.

రామబ్రహ్మాని కిదంతా అర్థం కాలేదు.

"రామబ్రహ్మం'' అని మరలాపిలిచాడు స్వామి, ఆ పిలుపు కన్నతల్లిదండ్రుల పిలుపుకన్న మధురాతి మధుర మనిపించింది.

"ఇప్పుడువచ్చిన మహర్షి మీగోత్ర కర్త భరద్వాజుడు. మీకు జన్మించబోయే శిశువులో తన యంశకూడా నిలుపమని కోర వచ్చాడు. అందువలన మా పంచాశములందు మీకు సుపుత్రుడుద్భవించి మీ వంశానికేగాక యీ జగతుకే కీర్తిని నిలుపగలడ"ని ఆశీర్వదిస్తూనే అంతర్ధాన మయ్యారు. రామబ్రహ్మం తెప్పరిల్లుకొని నమస్కరించుటకు కూడా వీలులేక పోయింది.

చుట్టూ పరికించాడు. ఎదురుగా స్వామి విగ్రహం దప్ప మరేమి కనిపించలేదు. నిరుత్తరుడై వున్న రామబ్రహ్మం స్వామికి నమస్కరించాడు. స్వామిసన్నిధిలో మరొక వెలుగు వెలిగించాడు.

అప్పుడే సీతమ్మ తనగర్భంలో యేదోకదలికను గమనించింది.

"ఏమండీ'' అంటూ ప్రక్కమంచముమీద పడుకొని వున్న భర్తను లేపబోయింది.

ఒక్క పిలుపులోనే ఆ అంటూ లేచాడు రామబ్రహ్మం. ఎదురుగ తన భార్య నిలబడివుంది. ఆశ్చర్యంతో చుట్టూజూచాడు. తన భార్యదప్ప మరెవరూలేరు. తానెక్కడున్నాడో అర్థంకాలేదు. సీతమ్మకు తనభర్త కలవరపాటు యేమిటో తెలియలేదు. వెంటనే రామబ్రహ్మం పూజ గదికి వెళ్ళాడు. శ్రీరామ విగ్రహం భాసిస్తున్నది. ఆ స్వామి మందహాసం చేస్తున్నట్లున్నది.

"స్వామీ'' అంటూ సాష్టాంగ పడినాడు, సీతమ్మ కిందతా అగమ్య గోచరంగా వుంది.

"సీతా" అంటూఅమితఆప్యాయంగా పిలిచాడురామబ్రహ్మంభార్యను.

ఎప్పుడో విన్న ఆ ప్రియాతి ప్రియమయిన పిలుపు మరల యీనాడు విన్నది.

"మన జన్మ తరించినది సీతా ! త్యాగరాజస్వామి దర్శనమిచ్చాడు. శ్రీరామ చంద్రుడు కరుణించాడు......" అని జరిగిన విషయమంతా వివరించాడు.

సీతమ్మ ఆనందాశ్రువులొలికించింది. భర్త పాదాలను తన సంతోషబిందువులతో కడిగింది. "స్వామీ మీ సహచర్యంతో నా జన్మ సార్థకమయింది. మిమ్ముల లేపుటకుముందే నా గర్భంలోని శిశువును యెవరో తాకినట్లనిపించినది. మీరు స్వామి సన్నిధిలో వెలిగించిన వెలుగు నా బిడ్డను స్పృశించిందేమో ! శ్రీ త్యాగరాజ స్వామి శిశువును ఆపాదామస్తకం తడిమి ఆశీర్వదించాడేమో. జగత్తుకు మహాపురుష నందించే భాగ్యం నాకు మీరు ప్రసాదించారు...."అంటూ భర్తకు సాష్టాంగ ప్రణామం చేసింది.

దంపతులు మహదానందంతో సీతారామ విగ్రహాలకు నమస్కరించారు. అప్పుడే కర్మసాక్షి జగత్తులోకి తొంగి జూడసాగాడు. స్వామికి మేలు కొలుపు పాడారు.

రామా నిన్ను నమ్మిన మాపై
కరుణ జూపితివా కారణజన్మ
కర్మసాక్షీ కులదీపికా
మేలు కోవయ్యా-మమ్మేలు కోవయ్యా శ్రీరామ॥

మరుదినమే సీతమ్మకు ప్రసవవేదన ప్రారంభమయింది. ప్రక్కయిండ్ల అమ్మలక్కలు యెంతో సహాయపడ్డారు.

శుభ ఘడియలో సీతమ్మ మహిమాన్వితుడయిన శిశువుకు జనని అయింది.

నగరదైవం శ్రీ త్యాగరాజస్వామి, కళలకాణాచిని, సంగీత సామ్రాట్టును, సామగాన సార్వభౌముని కళా జగత్తు కందించారు.

శిశువును చూడగనే సీతమ్మ "త్యాగరాజు" అని నోరార పిలిచింది.

(సశేషం)

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ.

కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం, రసాయనిక శాఖలమంత్రి డా. త్రిగుణ సేన్ 1970 అక్టోబరు 2 వతేదీన మధ్యాహ్నం 2 గం 30 ని. లకు రామగుండం ఫర్టిలైజరుప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ఉత్సవానికి ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షత వహించారు.

దేశంలో అధికాహారోత్పత్తికై అవసరమైన రసాయనిక ఎరువుల ఉత్పత్తి విషయంలో స్వయంసమృద్ధిని సాధించేందుకు తెలంగాణాలో గోదావరి నదీ తీరంలో రామ గుండం వద్ద రూ. 71 కోట్లు ఖర్చుకాగల రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీ నెలకొల్పబడుతున్నది. ఈఫ్యాక్టరీ ఫలితంగా ఆహారధాన్యాల దిగుబడి విషయంలో సాలీనా రూ. 120 కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా కాగలదని ఆశింపబడుతున్నది. ఈ ఫ్యాక్టరీ ప్రభుత్వరంగంలో నెలకొల్పబడుతుంది. తెలంగాణా ప్రాంతంలో భారీ పారిశ్రామిక ప్రాజెక్టులలో ఒకటిగా ఇది రూపొందుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయినతరువాత ఈ ఫ్యాక్టరీ పోచంపాడు ప్రాజెక్టూ, ఇతర నీటిపారుదల పారిశ్రామిక ప్రాజెక్టులు అన్నీకలిసి తెలంగాణా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా యావదాంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కూడా దోహదం కలిగిస్తాయి.

దేశంలోఇప్పుడున్న రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీలు నాఫ్తాను ఉపయోగిస్తున్నాయి. ప్రస్తుతం నాఫ్తా ఉత్పత్తి దేశ ఫ్యాక్టరీల అవసరాలకు సరిపోవడం లేదు. దిగుమతి అయ్యే నాఫ్తాపైన ఆధారపడవలసిన అవసరం లేకుండా పరిమితమైవున్న విదేశీమారక ద్రవ్యాన్ని లాభ సాటిగా ఉపయోగించే ఉద్దేశంతో దేశంలో బొగ్గు సహాయంతో నడిచే ఫర్టిలైజరు ఫ్యాక్టరీలను నెలకొల్పడం అవసరమని భావించబడింది. భారత ప్రభుత్వ రసాయనిక ఎరువుల సంస్థవారు రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీని నెల కొల్పే విషయంలో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. బొగ్గును ఉపయోగించి ఎరువులు తయారుచేసే విషయంలో పరిశీలనలు జరిపారు. రసాయనిక ఎరువులను తయారుచేయడానికి సింగరేణి బొగ్గుగనులు అను సెంట్రల్ ఇండియా బొగ్గుగనులు, తాల్చార్ బొగ్గుగనులు అనుకూలంగా వున్నాయని వారి పరిశోధనలవల్ల తెలిసింది.

వివిధ బొగ్గుగనుల నుంచి వచ్చిన ప్రాజెక్టు రిపోర్టులను పరిశీలించిన తరువాత రామగుండంవద్ద బొగ్గు ఆధారంగా రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీని స్థాపించడానికై చేసిన ప్రతిపాదనను భారత ప్రభుత్వం ఆమోదించింది. ఇక్కడ ఫ్యాక్టరీకి కావలసిన బొగ్గు, విద్యుచ్ఛక్తి, నీరు సమృద్ధిగా లభిస్తాయి.

రామగుండం–పారిశ్రామిక కీలక కేంద్రం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పారిశ్రామిక పట్టణాలలో ఒకటిగా రామగుండం శీఘ్రగతిన అభివృద్ధిచెందుతున్నది. ఇక్కడ పెద్దథర్మల్ విద్యుదుత్పాదక కేంద్రం నెల కొల్పబడడంతో పట్టణం అవతరించింది. రాష్ట్రంలోని విద్యుదుత్పాదక కేంద్రాలలోకెల్లా ఇది చాలపెద్దది. బొగ్గు గనులకు తోడుగా ఇక్కడ కేసోరాం సిమెంటు ఫ్యాక్టరీకూడా ఒకటి నిర్మించబడింది. ఈ ఫ్యాక్టరీలో ఇప్పుడు సిమెంటు ఉత్పత్తి జరుగుతున్నది. ఈప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లును కూడా ఏర్పాటు చేస్తున్నది. ఇది త్వరలో నూలు ఉత్పత్తి ఆరంభిస్తుంది.

ఫర్టిలైజరు ఫ్యాక్టరీ, రామగుండం ప్రాంతంలోని మారేడుపాక గ్రామంలో నెలకొల్పబడుతుంది. ఇక్కడ సింగరేణి కాలరీస్ గోదావరి ఖని బొగ్గుగనులను అభివృద్ధి పరచింది. ఈగనులలో ఉత్పత్తిఅయ్యే బొగ్గు కన్వేయరు బెల్టుల ద్వారా ఫర్టిలైజరు ఫ్యాక్టరీకి సరఫరా చేయబడుతుంది. దక్షిణగంగానదిగా పేరు వడిసిన గోదావరి నది, ఫ్యాక్టరీ స్థలానికి సుమారు 5 మైళ్ల దూరంలో వుంటుంది. ఈనది నుంచి కావలసిన జలాలు సరఫరా అవుతాయి. రామగుండంలో ఆరోగ్యకరమైన పొడివాతావరణం వుంటుంది. ఫ్యాక్టరీ స్థాపనకొరకు 423 ఎకరాల ప్రాంతం కేటాయించబడింది.

రామగుండం కరీంనగర్ జిల్లాలో హైదరాబాదుకు 148 మైళ్ల దూరంలో వుంది. హైదరాబాదు–రామగుండంల మధ్య చక్కని రోడుకూడావుంది. రామగుండానికి హైదరాబాదు నుంచి రోడ్డుద్వారాగానీ, లేక రైలుద్వారాగానీ వెళ్లవచ్చు. రైల్వే స్టేషను మద్రాసు–ఢిల్లీల మధ్య గ్రాండ్ ట్రంక్ రైలు లైనులోవుంది.

మూలధనం పెట్టుబడి

ఫ్యాక్టరీకి మొత్తం రూ. 71. 2 కోట్ల ఖర్చు అవుతుంది. ఈఫ్యాక్టరీ సాలీనా 2,97 100 టన్నులఅమ్మోనియా; 2, 28,000 టన్నుల నత్రజని; 4,95,000 టన్నుల యూరియా ఉత్పత్తి చేయ

కీ॥ శే॥ శ్రీ మాడపాటి హనుమంతరావు



ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు, 1970 నవంబరు 11 వ తేదీన దివంగతులు కావడంతో ఆంధ్ర ప్రదేశ్ ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయింది.

ఆయన 1885 జనవరి 2 వ తేదీన కృష్ణాజిల్లా, నందిగామ తాలూకాలోని పొక్కునూరు గ్రామంలో జన్మించారు. ప్రారంభ విద్యతర్వాత యీశకారంభంలో నిజాం ప్రభుత్వసర్వీసులోచేరారు.

కొంతకాలం తర్వాత ఉద్యోగానికి రాజీనామా యిచ్చి 1917 లో న్యాయవాద వృత్తి చేపట్టారు.

ఆ తర్వాత నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాలలో పాల్గొంటూ ముఖ్యంగా సాహిత్యం, గ్రంథాలయోద్యమాల వ్యాప్తికి తీవ్రంగా కృషిచేశారు.

ఆయన ప్రముఖ విద్యావేత్త, సంఘ సేవాపరాయణుడేకాక యితర సంస్థలతోపాటు ఆంధ్రమహాసభ, హైదరాబాదురాష్ట్ర కాంగ్రెసు, ఉస్మానియా విశ్వవిద్యాలయం సిండికేటు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, ఆంధ్రసారస్వత పరిషత్తు, కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం, ఆర్. బి. వి. ఆర్. ఆర్. మహిళా కళాశాలల వంటి అనేక సంస్థలలో వివిధహోదాలలో వాటి అభ్యున్నతికి కృషిచేశారు.

1951 లో హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్‌కు ప్రప్రథమమేయరుగా ఎన్నికైనారు. వరుసగా మూడుమార్లు ఆ పదవిని నిర్వహించారు.

1958 జూలైలో కొత్తగాఏర్పాటైన రాష్ట్రశాసనమండలి ప్రథమ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యి ఆరు సంవత్సరాలపాటు ఆపదవిలో ఉన్నారు.

1955 జనవరిలో రాష్ట్రపతి, ఆయనకు " పద్మభూషణ్ " బిరుదు యిచ్చి సత్కరించారు.

గలదు. మొత్తంమీద సాలీనా 10.2 లక్షల టన్నుల రసాయనిక ఎరువులు ఉత్పత్తి కాగలవు. ఉత్పత్తి అయ్యే ఎరువుల విలువ సుమారు రూ. 28. 7 కోట్లు వుంటుంది. ఇందులో నిపుణతగల 1200 మందికి ఉద్యోగాలులభించే అవకాశంవుంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయంలో ఒక కోటి రూపాయలు పెరుగుతుంది. ఈ ఫ్యాక్టరీవల్ల ఆహారధాన్యాల దిగుమతి తగ్గి, సాలీనా రూ. 120 కోట్లు విదేశీమారక ద్రవ్యం మిగులగలదని ఆశింపబడుతున్నది.

మార్కెటింగు


ఆంధ్రప్రదేశ్ వ్యవసాయమే ప్రధానవృత్తిగా గల రాష్ట్రం. దేశంలోభారీమెత్తున రసాయనికఎరువులు వినియోగించే రాష్ట్రంలో ఇది ఒకటి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో వర్షపాతం సరిపడు నంతగా వుంటుంది. నీటిపారుదల ప్రాజెక్టుల నుంచి పొలాలకు సమృద్ధిగా నీరు లభిస్తుంది కనుక భారీయెత్తున రసాయనిక ఎరువులు ఉపయోగించడం అవసరమవుతుంది. తద్వారా వ్యవసాయోత్పత్తి అధికంకావడానికి చక్కని అవకాశాలున్నాయి. రసాయనిక ఎరువు వాడకంవల్ల పంటలు తప్పకుండా యెక్కువ పండగలవని రైతులు గుర్తించారు. అందువల్ల రసాయనిక ఎరువుల గిరాకిపెరిగిపోతున్నది.

అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికావడంతో, అధికపంటల సాధనకై తీవ్ర వ్యవసాయోత్పత్తికి రైతులు పూనుకొంటున్నారు. కొత్తగా అదనపు ప్రాంతాలు సేద్యంక్రిందికి వస్తున్నాయి. ఈపరిస్థితుల ఫలితంగా రసాయనిక ఎరువుల సరఫరాను అధికం చేయవలసిన అవసరం ఏర్పడింది.

రాష్ట్రంలో 30 లక్షల టన్నుల అమ్మోనియా సల్ఫేటు, 20 లక్షల టన్నులు సూపర్ ఫాస్ఫేటు అవసరమవుతాయని అంచనా వేయబడింది. ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలు ఉపయోగించడంవల్ల ఎరువుల వాడకం—అమ్మోనియా సల్ఫేటు రూపంలో నత్రజని రసాయనిక ఎరువులు 50 లక్షల టన్నుల వరకు సూపర్ ఫాస్ఫేటు రూపంలో పొటాష్ ఎరువులు 20 లక్షల టన్నుల వరకు, ఎక్కువ కాగలదని అంచనా వేయబడింది, ఈవిధంగా రామగుండంలో ఉత్పత్తి అయ్యే ఎరువులకు రాష్ట్రంలోనే మంచి మార్కెటు వుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ విప్లవం తీసుకొని వచ్చేందుకు ఈప్రాజెక్టు అనేక విధాలుగా దోహదకారి కాగలదు. పరిశ్రమల స్థాపనకు మహదవకాశంగల రామగుండం ఈప్రాంతపు మాంచెస్టర్‌గా అవతరించగలదనిచెప్పడంలో అతిశయోక్తి వుండదు.

సమాజ వికాసోద్యమం

ముఖ్యమంత్రి రేడియో ప్రసంగం



పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ తోట రామస్వామి హైదరాబాదు జిల్లా పరిషత్తుహాలులో అక్టోబరు 8న సమాజ అభివృద్ధి వారోత్సవాల ముగింపు ఉత్సవంలో ప్రసంగిస్తున్న దృశ్యం

[అక్టోబరు 2వ తేదీన సమాజ అభివృద్ధి వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఆకాశవాణి ద్వారా చేసిన రేడియో ప్రసంగం పూర్తిపాఠం.]

"రేపు గాంధీజీ జన్మదినం, అక్టోబరు 2 వ తేదీన సమాజ అభివృద్ధి వారోత్సవాలు ఆరంభమవుతున్నాయి. పద్దెనిమిది సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదేరోజున స్వతంత్ర భారతంలోని ప్రజలూ, కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వాలూ కలిసి సామాజిక అభివృద్ధి జాతీయ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో అన్నిరంగాలలో త్వరితగతిలో ప్రగతి సాధించడం, గ్రామీణ ప్రజల్లో దారిద్ర్యాన్ని నిర్మూలించడం, అనారోగ్యం, అజ్ఞానాలను అంతమొందించడం, వారు ఆత్మవిశ్వాసంతో, స్వయం కృషితో నవభారత నిర్మాణ కార్యక్రమంలో స్వేచ్ఛగా, సమర్థవంతంగా, సగర్వంగా, చైతన్యవంతంగా పాల్గొనేటట్లు సత్పౌరులుగా వారిని తీర్చిదిద్దడం యీ మహోద్యమం యొక్క లక్ష్యం. గాంధీజీకి ఈలక్ష్యం ఎంత ప్రియమైనదో, గ్రామీణ ప్రజల శ్రేయస్సు ఆయనకు ఎంత అభిమాన పాత్రమైనదో మనందరికీ బాగా తెలుసు. సమాజాభివృద్ధి, జాతీయ విస్తరణ కార్యక్రమం అనే ఈ మహోద్యమాన్ని ప్రారంభించి దేశనాయకులు ఒక విద్యుక్తధర్మాన్ని నిర్వహించారు, గాంధీజీ ఋణం తీర్చుకొన్నారు.

సమాజాభివృద్ధి అనేది మనదేశ ప్రజలకు నిజానికి క్రొత్తదేమీకాదు. మన గ్రామీణ ప్రజల్లోనూ ప్రపంచమంతటాగల ప్రజానీకంలోనూ సామాజిక సంయుక్త కృషి కొంతవరకు జరుగుతూనేవుంది. మన గ్రామాల్లో ప్రజలు ఒక గుడికట్టుకున్నా, ఒక మసీదో, చర్చో నిర్మించుకొన్నా, లేదా ఒక పంటకాల్వ బాగుచేసుకొన్నా, మంచి నీటి చెరువు మరమ్మత్తు చేసుకొన్నా అందరూ కలిసికట్టుగా పనిచేసుకొంటూవుంటారు. కానీ ఇటువంటివన్నీ అప్పటి కప్పుడు అనుకొని హఠాత్తుగా ప్రారంభించి పూర్తి చేసుకొనే పనులు. వీటికి ముందుగా ఆలోచించుకొని ఏర్పాటు చేసుకొన్న పథకంగానీ, ఒక సంపూర్ణమైన లక్ష్యంగానీ వుండదు. సమాజాభివృద్ధి జాతీయ విస్తరణ కార్యక్రమం అలాంటిదికాదు. దీనికి సమగ్రమైన స్పష్టమైన లక్ష్యాలు వున్నాయి. గ్రామీణ ప్రజలు తమ న్యాయమైన అవసరాలు, ఆశయాలు తీర్చుకోడానికి వీలుగా–అంటే సరియైన తిండి, బట్ట, నివాసవసతి, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రమైన మంచినీరు, రోడ్లు, రవాణా, విశ్రాంతి, క్రీడలు, లాభదాయకమైన వృత్తి, వసతి మొదలగు వివిధ సౌకర్యాలు సమకూర్చుకోడానికి వీలుగా–వారు తగినంత ఆదాయం సమకూర్చుకోవడంలో వారికి తోడ్పడడమే సమాజాభివృద్ధి కార్యక్రమ ప్రధానలక్ష్యం ప్రతి గ్రామంలోనూ ఒక సమగ్రమైన, బహుముఖ ప్రగతిదాయకమైన పథకాన్ని అమలు పరచడం ద్వారానే యీ లక్ష్యాలు నెరవేరుతాయని మనందరికీ తెలిసిన విషయమే. అప్పుడే వ్యవసాయ ఉత్పత్తిలో క్రమబద్ధమైన ప్రగతి, గ్రామప్రాంతాల్లో ఇప్పటి చిన్న పరిశ్రమలను అభివృద్ధిపరచి ప్రజలకు అవసరవస్తువులను ఉత్పత్తిచేయడానికి క్రొత్తవాటిని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది. కనీస ఆరోగ్య సేవలు ఏర్పాటు చేయడం, వ్యక్తుల సామాజిక ఆరోగ్య పారిశుద్ధ్యపు అలవాట్లను మెరుగుపరచడం, మంచి మంచి చిన్న ఇండ్లను, కుటీరాలను నిర్మించడం, పిల్లలకూ పెద్దలకూ కనీస విద్యాభ్యాస అవకాశాలు కల్పించడం, విశ్రాంతికీ, క్రీడలకూ ఏర్పాట్లు చేయడం, మహిళలకు పిల్లలకు అవసరమైన కార్యక్రమాలు అమలుపరచడం, వ్యవసాయపు పనులు లేని తరుణంలో పనిచేయగలిగిన స్త్రీ పురుషులందరికీ వృత్తి వసతి కల్పించడం–ఇటువంటి సౌకర్యాలన్నీ సమగ్రమైన గ్రామ ప్రణాళికలను అమలుపరచడం ద్వారానే కల్పించుకోగలం.

సమగ్రమైన ఈ కార్యక్రమాలన్నీ అమలు పరచుకోవాలంటే గట్టి వ్యవస్థను ఏర్పాటుచేసుకోవడం అవసరం. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక నాయకులు, ప్రతినిధులు ద్వారా



మహిళా సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ అక్టోబరు 4న రాజేంద్రనగర్‌లోని గ్రామ సేవక శిక్షణ శిబిరంలో సమాజ అభివృద్ధి వారోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

గ్రామప్రాంతాల ప్రజలు అవిరళకృషి చేయవలసివుంటుంది. పైగా 20, 30 సంవత్సరాలపాటు కార్యక్రమాల అమలుకు తగినన్ని నిధులు కూడా కావాలి. స్వల్పకాలంలోనే మహా విజయాలు సాధించాలంటే ప్రభుత్వం కానీ, ప్రజలు కానీ సమకూర్చుకోగల వనరులు పరిమితంగా వున్నాయని మనకు తెలిసినవిషయమే. ప్రగతి పథం పూలబాటకాదనీ, ఈ ప్రయాణం దీర్ఘకాలం జరుగవలసినదీ, కష్టసాధ్యమైనదీ అనే విషయము. ప్రకృతివల్లనేమి, మనిషి చేసే వాటివల్లనేమి, అడ్డంకులు అవరోధాలు కలుగుతుంటాయనే విషయము మనం గ్రహించాలి. అవిరళమైన కృషి, పట్టుదల, త్యాగం ఏకైకలక్ష్యం, లక్ష్యసాధన, దీక్ష మొదలగు గుణాలవల్లనే ఏదేశమైనా ప్రగతి సాధించగలుగుతుంది. ఇంత విశాలమైన దేశాన్ని పెరుగుతున్న జనాభాతో, కోట్లాది ప్రజల భవిష్యత్తును వృద్ధిపరచడం ఒక్క ప్రభుత్వానికే, దానితరఫున పనిచేస్తున్న సంస్థలకు మాత్రమే సాధ్యంకాదనే విషయం కూడా మనం గ్రహించాలి. ప్రగతి పథంలో విజయవంతంగా పురోగమించాలంటే ఉన్నవారు ధనరూపంలో కానీ, లేనివారు శ్రమరూపంలో కానీ ఎల్లప్పుడూ సహకరిస్తూ ప్రభుత్వం చేసే కృషికి తోడ్పడడం అవసరం.

గ్రామీణాభివృద్ధికి గడచిన పద్దెనిమిదేళ్లుగా సమాజవికాస కార్య క్రమాలక్రింద, పంచవర్ష ప్రణాళికలక్రింద మనం సాధించిన విజయాలు చెప్పుకోదగినంతగానే వున్నాయి. అయితే, మనగ్రామాల్లోని ప్రజానీకానికి తినడానికి తిండీ, కట్టుకోడానికి బట్టా, వుండడానికి ఇల్లూ, వారి పిల్లలకు చదువులూ, ఆరోగ్య. రక్షణ, ఉపాధికల్పనవంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించడంలో ఇంకా ఎంతో కృషిజరగవలసివుంది. మన రాష్ట్రంలో నాలుగవ పంచవర్ష ప్రణాళికను రూపొందించుకొన్నాం. భవిష్యత్తులో మరికొన్ని పంచవర్ష ప్రణాలికల్ని రూపొందించుకొని అమలు జరుపుకుంటాం. త్వరతోనే మన గ్రామీణ ప్రజల జీవనాన్ని సుసంపన్నం చేయడంలో ఈసమాజవికాస కార్యక్రమాలు విజయవంతంకాగలవని నాదృఢవిశ్వాసం.

సమాజవికాస కార్యక్రమాలను అమలు పరచడంలో ప్రధానపాత్ర వహించే గ్రామపంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు వంటి పంచాయతీ రాజ్ సంస్థలకు ప్రజలు తమ జీవనస్థితి గతులను మెరుగుపరచుకొనే కృషిలో అత్యంత పవిత్రమైన, గురుతరమైన బాధ్యతవున్నది. ఒక వైపు ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యాంగాలుగా, మరొక వైపు ప్రజాప్రతినిధులు నాయకులుగా ఈపంచాయతీ రాజ్ సంస్థల సభ్యులు ప్రజల శక్తి యుక్తులను సమీకరించే కృషిలో గురుతర బాధ్యత కలిగివున్నారు. అందుకు వారికి తగిన అవకాశాలు వున్నాయి అదేవిధంగా తమ మీద అపారమైన విశ్వాసాన్ని వుంచి తమను ఈ సంస్థలకు ఎన్నుకొన్న ప్రజలకు ప్రయోజనాన్ని కల్పించేవిధంగా ప్రభుత్వం కల్పించిన వనరులనూ, ప్రజల ఉత్సాహాన్నీ సమీకరించడంలో వీరికి గురుతర బాధ్యత వున్నది గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ముఖ్యంగా అక్కడి బలహీన వర్గాలవారికి, బీద జనానికి ప్రయోజనకరంగా చేయవలసిన కృషి ఇంకా ఎంతో ఉన్నది.

గడచిన పద్దెనిమిదేండ్లుగా మనం చేస్తున్న కృషిని ఒకసారి సమీక్షించుకొని ఏ ఏ రంగాలలో అభ్యుదయాన్ని సాధించగలిగామో, ఏ ఏ రంగాలలో మనకృషి విఫలమైందో అర్థంచేసుకొని సమాజవికాస కార్యక్రమాలు, జాతీయ విస్తరణ కార్యక్రమాలు యిచ్చిన స్ఫూర్తితో మనం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అభ్యుదయ పథంలో, అభివృద్ధి మార్గంలో ప్రజలకు సంపద, సమృద్ధులను ఇతోధికంగా కల్పించడానికి మనం పునః ప్రతిజ్ఞచేద్దాం. రాష్ట్రమంతటా అక్టోబరు రెండో తేదీనుంచి జరుగుతున్న సమాజవికాస వారోత్సవాలు సందర్భంగా యీ ప్రతిజ్ఞ తీసుకుందాం. ఈబృహత్ కృషిలో మనం విజయం సాధించగలమని నా ప్రగాఢ విశ్వాసం."



ఉపముఖ్య మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు సమాజ అభివృద్ధి వారోత్సవాల సందర్భంగా అక్టోబరు 8న హాయత్ నగర్‌లో బహుమతులను పంపిణీచేస్తున్న దృశ్యం.

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్యం

"సమాజ వికాస పథకాలలో పంచాయతీ రాజ్యానికి ప్రముఖపాత్ర ఉంది. వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనడానికి అది ఒక సాధనం. స్థానిక స్వపరిపాలన బాధ్యతలను స్వీకరించడానికి ప్రజలకు శిక్షణ ఇస్తుంది పంచాయతీ రాజ్యం." అన్నారు డాక్టరు రాధాకృష్ణన్.

"గ్రామాల్లో ప్రజాసామర్థ్యాన్ని యినుమడింపజేయాలి. ప్రతి కార్యం ప్రజల్లో వేళ్ళ పాతుకుపోవాలి. ప్రజల హృదయాలను చూరగొనని ప్రయత్నం విఫలం కాగలదు. ప్రజలు పునాది వంటివారు. ప్రజలకు అధికారం ఇవ్వబడాలి. ప్రజలకు స్వేచ్ఛ అధికారం యివ్వకపోతే అది పంచాయతీరాజ్యం కాజాలదు" అన్నారు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ.

భారత దేశంలో ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానాన్ని పంచాయతీ రాజ్యం రూపంలో ప్రవేశపెట్టినది ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. సమాజవికాస, జాతీయ విస్తరణ కార్యక్రమాల భవిష్యత్తును గురించి బలవంతరాయ్ కమిటీవారి సిఫార్సు ననుసరించి పంచాయతీ రాజ్యం రూపొందినది. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 1958 జూలై మాసంలో జిల్లాకొక అడ్‌హాక్ పంచాయతీసమితి వంతున 20 సమితులు ఏర్పాటుచేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లాపరిషత్తుల చట్టం అమలులోనికి వచ్చిన తర్వాత 1959 సం|| నవంబరు ఒకటవ తేదీన చట్టబద్ధమైన పంచాయతీ సమితులు ఏర్పాటుచేసిరి. 1952 అక్టోబరు రెండు నుంచి సమాజవికాస కార్యక్రమం అమలులోనికి వచ్చినది. 1963 అక్టోబరు రెండు నాటికి ఆంధ్రప్రదేశ్ యావత్తూ సమాజ వికాస పునాదిసంస్థలు ఏర్పడినవి. 1964 జూలై ఒకటవ తేదీనాటికల్లా ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం గ్రామీణ ప్రాంతమంతా పంచాయతీ సమితులతో నిండిపోయినది. ఈ స్వల్ప కాలంలోనే మన రాష్ట్రంలో పంచాయతీ రాజ్యం అనల్పమైన అభివృద్ధిని సాధించింది. మన పంచాయతీ రాజ్యం సుస్థిరమైన వ్యవస్థగా రూపొందుతున్నది. అయినా ఇకముందు సాధించవలసింది ఎంతో వుంది.

పంచాయత్ సంస్థల బాధ్యత

ప్రధానంగా ఆహారధాన్యాల ఉత్పత్తిని అధికంచేసి స్వయం సమృద్ధిని సాధించడంలో మన పంచాయతీ రాజ్యం గణనీయమైన పాత్రను నిర్వహించవలసిఉన్నది. చతుర్థ పంచవర్ష ప్రణాళికా కాలంలో మన రాష్ట్రంలో దాదాపు 130 లక్షల ఎకరాల భూమిలో అధిక దిగుబడిని ఈయగల ధాన్యాలను ఉత్పత్తిచేయాలన్నది మన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పంచాయతీరాజ్ సంస్థలు నిరంతరమైన కృషి జరుపవలసి వున్నది.

దైనందిన జీవితంలో భాగాలు

గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ మానవశక్తి వినియోగానికి ప్రత్యేకమైన కార్యక్రమాలు, రోడ్డు సౌకర్యాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణవాలంటీరు దళాలు, చిన్నతరహా నీటి పారుదల పథకాలు మన రాష్ట్రంలోని పంచాయతీ రాజ్యంలో ప్రాధాన్యం వహిస్తున్నాయి. నూటికి నూరుపాళ్ళ పన్నులు వసూలు చేసుకొని తమ ఆర్థిక వనరులను పటిష్ఠంచేసుకొంటున్న పంచాయతీ సంస్థల సంఖ్య పెరుగుతుండడం హర్షణీయం.

ప్రజాస్వామ్యం-గ్రామాలు

"ప్రజాస్వామ్యమంటే కేవలం కేంద్రంలో పదిమంది కూర్చొని పనిచేసేదికాదు. గ్రామంలో ప్రజలచే పాలింపబడాలి." అంటూ గాంధీజీ విశదీకరించారు. గ్రామ సౌభాగ్యమే దేశ సౌభాగ్యమన్నారు. గాంధీజీ దృష్టిలో గ్రామం ఒక చిన్న వికేంద్రీకరించిన ప్రజాస్వామ్య వ్యవస్థ. దీనికి సర్వాధికారాలు, హక్కులు, విధులు ఉంటాయి. దానికి ఎన్నుకొనే వ్యక్తి పునాది. గ్రామ పరిపాలన ప్రజలచే ఎన్నుకొనబడిన ప్రజాప్రతినిధులచే కావింపబడుతుంది. ఈ వ్యవస్థే గ్రామపంచాయతీ. ఈ పంచాయతీ న్యాయాధికారి, కార్యనిర్వాహణ అధికారి శాసనాధికారి. గాంధీజీ పరిపాలనలో గ్రామాలనుంచే దేశాన్ని పరిపాలించమన్నారు. గ్రామం సర్వాధికారాలు కలిగి ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిగా ఉంటుంది. అందుకోసమే మన ప్రభుత్వం కృషి చేస్తున్నది.

పంచాయతీ కర్తవ్యాలు

ప్రధానంగా గ్రామంయొక్క అవసరాలను బట్టి ప్రణాళికలను తయారుచేయుట, అట్టి ఆమోదం పొందిన ప్రణాళికలను అమలు జరుపుట, గ్రామానికి గల సాధన సంపదలను సమాయత్త పరచుట, గ్రామాభివృద్ధికి జరిగిన కృషిని అప్పుడప్పుడు సమీక్షించి తగు సూచనల నిచ్చుట, క్రమంగా గ్రామపంచాయతీ పరిపాలన న్యాయ విధులను కూడా చేపట్టుట. పై కార్యక్రమాలను సక్రమంగా అమలు జరిపి, గ్రామీణాభివృద్ధి చేయుటకు పంచాయతీలు ఆదాయం లభించే వనరులను పెంచుకోవాలి.

గ్రామీణ జీవిత విధానంలో అభివృద్ధిని సాధించడం పంచాయతీరాజ్య ఆశయం. గ్రామీణ ప్రాంతాలలో పెంచవలసిన పరిశ్రమలను గురించి తగు శ్రద్ధ తీసుకొనబడలేదు. వ్యవసాయము పశుపోషణ, పాడిపంటల అభివృద్ధితోపాటు, పెంచవలసిన పరి

ఎన్. ఎన్. రావు

శ్రమలు చాలా ఉన్నాయి. వాటిని పంచాయతీలు చేపట్టాలి. పంచాయతీ రాజ్యము, సహకార వ్యవస్థ — ఈ రెండే ప్రజల నిత్యజీవితానికి ఉపకరించేవి. ప్రజలను స్వయం పరిపాలనలో తర్ఫీదు చేసేవి యీ రెండు వ్యవస్థలే. ఈ రెంటికి సన్నిహిత సంబంధాన్ని, అవినాభావ బాంధవ్యాన్ని కల్పించటం అవసరం.

పంచాయతీ రాజ్యం ద్వారా కలిగిన బహుముఖ ప్రయోజనాలలో అన్నిటికంటే ముఖ్యమైనది ప్రజలు చైతన్యవంతులైనారు. సామాన్యులకు అధికారం తమదే, తమ భవిష్యత్తుకు తామే కర్తలమన్న ధైర్యం, సంతృప్తి కలిగాయి. స్వయంకృషి, ఆత్మవిశ్వాసం, సహకారభావం, సమాజ శ్రేయస్సు సర్వతోముఖ వికాసం, నూతన జీవితం అనే లక్ష్యాలు ఏర్పడ్డాయి. పంచాయతీల మీద అనేక విమర్శలు కూడా వున్నాయి. కక్షలు, కార్పణ్యాలు, ఈర్ష్యాద్వేషాలు, కుల మత జాతి ముఠా ప్రాంతీయ తత్వాలు, స్వార్థ సంకుచిత తత్వాలు సమూలంగా రూపుమాపుకొని జాతి సంక్షేమమే, అభివృద్ధి వికాసాలే పవిత్ర కర్తవ్యంగా, జాతీయాదర్శంగా ప్రతి వ్యక్తి కృషి సాగించిననాడే నిజమైన పరిపూర్ణ ఆదర్శ ప్రజాస్వామిక సంక్షేమ రాజ్యము ప్రజల అనుభవంలోనికి రాగలదు.

గ్రామ సౌభాగ్యమే దేశ సౌభాగ్యమనీ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమనీ అహర్నిశలు గాంధీగారు చెబుతూవుండేవారు. కనుక గాంధీరాజ్యం కావాలంటే గ్రామసీమలన్నీ భాగ్యసీమలుగా పైరు పంటలతో ధాన్యలక్ష్మి నిలయాలుగావాలి. పనిలేని నిరుపేదలకు చేతినిండా పని కల్పించి సంతుష్టజీవనం కల్పించుటకు అటు ప్రభుత్వం యిటు ప్రజలు వజ్రసంకల్పంతో కృషి సాగించాలి.

అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించుకోవాలనే ప్రేరణ ప్రతి గ్రామంలోని ప్రజలకు కలిగి సంకల్ప బలంతో ఆత్మవిశ్వాసంతో ఆ కార్యక్రమాలను వారు నిర్వహించగలిగితే వాస్తవమైన స్వరాజ్యం వచ్చిందన్నమాటే. ★

కడపజిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు

మద్రాసులోని అరటిపండ్ల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు, శ్రీ ఎం. ఎస్. చంద్రశేఖరం, రాష్ట్ర వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు, శ్రీ బి.ఆర్. వెంకటరామన్‌తో కలిసి యిటీవల రాజంపేట వెళ్లారు. ఎగుమతికి అనువైన మంచి నాణ్యతగల అరటిని పెంచాలని అక్కడి రైతులకు వారు ఉద్బోధించారు. జమ్మలమడుగులోని సిండికేటు బ్యాంకువారు, వ్యవసాయదారులకు స్వల్పకాలిక ఋణాలుగా రూ. 1,02,693లు యివ్వడానికి 10 సహకార సంఘాలను ఎన్నికచేశారు. పంటకోతలు పూర్తి అయిన తర్వాత యీ మొత్తాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

పులివెందల 27 ఎకరాల భూమిలో భూసార పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. యీ విస్తీర్ణంలో కాంటూరు కట్టలు వేయడం పూర్తి అయింది. జమ్మలమడుగు బ్లాకులో భూసార పరీక్షకు రైతుల నుండి 93 భూసార నమూనాలను సేకరించి కోడూరులోని భూసార పరిశోధనా కేంద్రానికి పంపారు. 43 కేసులను పరిశీలించి, కావలసిన చర్యలు తీసుకోడానికి రైతులకు సూచనలు యివ్వడం జరిగింది.

లక్కిరెడ్డిపల్లి పంచాయతీ సమితిలో పౌష్టికాహార కార్యక్రమం క్రింద ప్రారంభించబడిన కోళ్ల పెంపకం క్షేత్రంలో ఉత్పత్తి అయిన గుడ్లను లక్కిరెడ్డిపల్లి, కొండవండ్లపల్లి చిట్వారు, కుమ్మరపల్లి, పెద్దూరు గ్రామాలలో పాఠశాలలకు వెళ్లే వయస్సుగల బాలబాలికలకు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం అమలులోఉన్న అన్నిగ్రామాలలో కూరగాయలతోటలను పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. జిల్లా అంతటా జరిగిన పశుగ్రాసం పెంపకం వారోత్సవం సమయంలో రైతులకు 14000 నాపెర్ పశుగ్రాసం మొక్కలను పంపిణీచేశారు. పులివెందల బ్లాకులోని 8 మందికి 150 మేలిజాతి కోళ్లను యిచ్చారు. పులివెండ్ల పంచాయతీ సమితిలోని వేల్పుల సహకార సంఘంలోని 13 మంది సభ్యులకు స్టేట్‌బ్యాంకు రూ. 25,000లు మంజూరు చేసింది. పులివెందలలోని భూమితనాఖా బ్యాంకు సిబ్బంది, మొత్తం రూ. 3,64,236ల బకాయీలను (నూటికి నూరుశాతం) వసూలుచేసింది.

ప్రొద్దుటూరు పంచాయతీ సమితిలో దువ్వూరుసమీపంలోని రామసాయనగర్‌లో కొత్తగా పోస్టాఫీసును ఏర్పాటు చేశారు. కమలానెహ్రూ మహిళా మండలి అధ్వర్యంలో పులివెందలలో ఒక బాలవాణికి ప్రారంభోత్సవం జరిగింది. అందులో 20 మంది చిన్నపిల్లలకు ప్రవేశం కల్పించారు. జూలైలో 5వ తేదీన కడపలో ప్రారంభింపబడిన 1000 పడకల టుబెక్టమీ శిబిరంలో నెల రోజులలో 1000 టుబెక్టమీ శస్త్ర చికిత్సలను నిర్వహించారు. ప్రొద్దుటూరు సమితి అధ్యక్షుడు శ్రీ ఆర్. చంద్రఓబులరెడ్డి గంజికుంట సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు 70 జతల వస్త్రాలను పంపిణీ చేశారు. సమితి సాధారణ రెవిన్యూల నుండి 15 శాతం మేరకు షెడ్యూలు కులాల సంక్షేమానికి కేటాయించడం జరుగుతుందని ఆయన హామీయిచ్చారు.

జిల్లాలో తీవ్రతర పథకం క్రింద 44,000 ఎకరాల భూమిని, భూమిలేని పేదలకు పంపిణీ చేశారు. పంపిణీకి యింకా లభ్యమయ్యే 26,300 ఎకరాల భూమిలో 9,500 ఎకరాల మేరకు పేద రైతులు అప్పుడే సేద్యం ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అపార ఖనిజ సంపద

-ఎస్. కామరాజు పంతులు

ఆంధ్రప్రదేశ్ అనేక రకాల ఖనిజ సంపదకు ఆలవాలం. ఆంధ్రప్రదేశ్‌లో దొరకని ఖనిజము అంటూ లేదు. ప్రపంచంలో వివిధ దేశాల్లో ఎన్ని రకాలఖనిజములు లభ్యమవుతున్నాయో అన్ని రకాల ఖనిజములు ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక తావులో లభ్యమవుతాయి. రత్నాలు, ఇనుము, మాంగనీసు, రాగి, బంగారము, గ్రాఫైటు, క్యానైటు, స్టిలైటు ఇతిమినైటు, జిప్సము, ఓకెరు, రెఫ్రైక్లే, క్వార్టుజు, బొగ్గు, ఆస్బెస్టసు ఇంకా ఎన్నో రకాల ఖనిజములు ఆంధ్రప్రదేశ్‌లో దొరుకుతున్నాయి. అయితే సమస్యలల్లా యీ అపార ఖనిజసంపదనంతటినీ, భూగర్భ పరిశోధనలుచేసి, వెలికి తీసుకొని రావటమే! యావద్భారతదేశంలో, క్రిసోలైటు తరహాకు చెందిన ఆస్బెస్టసు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే లభ్యమవుతున్నది. భారతదేశములోని బారైట్సు ఉత్పత్తి అంతా కేవలము ఆంధ్రప్రదేశ్ నుంచే. ఆంధ్రప్రదేశ్‌లోని బొగ్గు గనులు దక్షిణ భారత దేశములోని ముఖ్యమయిన బొగ్గు గనులలో ప్రముఖపాత్ర వహిస్తాయి. భారతదేశములోని మాంగనీసు ఉత్పత్తి మొత్తంలో 11.5 శాతము ఆంధ్రప్రదేశ్‌నుంచే లభ్యమవుతున్నది. ఉత్తమ శ్రేణికి చెందిన ఇనుము ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో త్రవ్వబడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతిలో అతికీలకపాత్ర వహిస్తున్న విదేశీ ద్రవ్యమును ఎంతో సంపాదించి పెట్టుతున్నది. శ్రీకాకుళం జిల్లాలోని సాలూరు ప్రాంతములో అపారమైన మాంగనీసు నిక్షేపములున్నవి. నెల్లూరు జిల్లాలోని అభ్రకము నిధులను గురించి చెప్పే పనిలేదు. కర్నూలుజిల్లాలోని ఇనుము, గుంటూరుజిల్లా వినుకొండ తాలూకా అగ్నిగుండాల ప్రాంతములోని రాగి నిక్షేపములు-ఇట్లాగే శ్రీకాకుళము, ఖమ్మము, ఆదిలాబాదు, వరంగల్లు, కడప, కర్నూలు, తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాలలోని అమూల్యమైన నిక్షేపములను గురించి ఎంతవ్రాసినా తరగదు.

ఆస్బెస్టసు:- భారతదేశములోని ఆస్బెస్టసు ఉత్పత్తి మొత్తంలో ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతమువరకు లభ్యమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో దొరికే ఆస్బెస్టసు అత్యధిక భాగము సి తరగతికి చెందినది. సిమెంటు వస్తువులు, షింగిల్సు, బోర్డులు, పుట్టీలు, ప్లాస్టికు వస్తువులు, రంగులు, పరిశ్రమలలో ఎంతో ఉపయోగకారిగా ఉంటున్నది. బ్రాహ్మణపల్లి, ఇప్పట్ల, చిన్న కూడల, రామనూతపల్లి, పులివెందలలో ఆధునిక యంత్ర పరికరములు, క్రంపెసరు, డ్రిల్లు పనిముట్ల సహాయముతో ఆస్బెస్టసు పరిశ్రమను ఎంతైనా వృద్ధి చేయవచ్చును.

బారైటు:- గ్లాసు, పెయింటులు, రంగులు, రబ్బరు, బేరియము మిశ్రమాలు, నూనె త్రవ్వకము, (oil drilling) మొదలగు అనేక పరిశ్రమలలో అత్యంత ఉపయోగ కారియైన బారైటు ఖనిజము కడప, అనంతపూరు, కర్నూలు, ఖమ్మం జిల్లాలలో విరివిగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ లోని ఖనిజ నిక్షేపాలు, యావద్భారత దేశపు అవసరాలు ఎంతోకాలం తీర్చగలవు. భారతదేశపు బారైటు ఉత్పత్తిలో 95 శాతము ఆంధ్రప్రదేశములోనే లభ్యమవుతున్నది. భారతదేశం అంతటనూ బారైటు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అతి ప్రముఖ స్థానం ఆక్రమిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో లభ్యమవుతున్న బారైటు ఖనిజ సంపదలో అత్యధిక భాగము పాకిస్తాను, ఇరాకు, ఇరాను మొదలగు అనేక విదేశములకు ఎగుమతిగా పంపబడుచున్నది. ఆయా దేశముల లోని నూనె త్రవ్వకపు పరిశ్రమలో భారతదేశపు బారైటు ఎంతో ఉపయోగకారిగా ఉన్నది.

క్లే(సుద్ద):- సిమెంటు, పేపరు, వస్త్రములు, (Textiles) నూనె పరిశ్రమలలో ఎంతో ఉపయోగకారిగా ఉండే ఉత్తమశ్రేణికి చెందినసుద్ద, తూర్పు, పశ్చిమ గోదావరి, కడప, కర్నూలు, నల్లగొండ, ఆదిలాబాదు, మహబూబ్‌నగరు, నెల్లూరు, మెదకు జిల్లాలలో విరివిగా దొరుకుతున్నది. కడప జిల్లాలోని గోదెలలోను, తూర్పుగోదావరి జిల్లాలోని పుణ్యక్షేత్రములోను దొరికే ఉత్తమ శ్రేణికి చెందిన సుద్ద ఒకటవ తరగతికి చెందిన పింగాణీ, ప్రాసిలిన్ వస్తువుల పరిశ్రమలలో ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

బొగ్గు :—సింగరేణి, బెల్లంకొండ, రామగుండం, బెల్లంపల్లి ప్రాంతములలోని బొగ్గు నిక్షేపముల గురించి ఆంధ్రులందరికి సువిదితమే. భారీ ఎత్తున భూగర్భ పరిశోధన కార్యక్రమము ఆంధ్రప్రదేశ మంతట జరిగిన యెడల, ముఖ్యంగా గుంటూరు, కర్నూలు జిల్లాలలో ఇంకా ఎన్నో బొగ్గు గనులు బయటపడతాయని పలువురు నిపుణుల ఆశ.

ఫెల్సుఫరు (Felspar) :—సబ్బు, పింగాణీ, గ్లాసు, పరిశ్రమలలో ఎంతో ఉపయోగపడే ఫెల్సుఫరు నెల్లూరు జిల్లాలో విరివిగా దొరుకుతుంది.

గ్రాఫైటు :—డ్రైబాటరీలు, విద్యుత్పరికరములు, పెయింటులు పెన్సిలు, పరిశ్రమలలో ఉపయోగపడే గ్రాఫైటు

ఖనిజము పశ్చిమ గోదావరి, విశాఖపట్నము, తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాలలో ఎంతగానో లభ్యమవుతున్నది. రాజమండ్రిలో ఆంధ్రప్రదేశ ప్రభుత్వ పరిశ్రమలశాఖ యాజమాన్యమున గ్రాఫైటు క్రూసిబిల్సు పరిశ్రమ ఒకటి నిర్వహింప బడుచున్నది. భారతదేశపు గ్రాఫైటు ఉత్పత్తి మొత్తములో అయిదు శాతము ఆంధ్రప్రదేశ్‌నుంచే లభ్యమవుతున్నది.

క్రోమైటు :—క్రోమైటుస్టీలు, హైస్పీడు పనిముట్లు, ఉష్ణమాపక పరికరములు, విద్యుత్పరికరములు, విద్యుత్పంకాలు, కొలిములు, రాగి కరిగించే కొలిములు, గంధకము విడదీసే కొలిములు, కాగితపు పరిశ్రమ, హైటెంపరేచర్ స్టీము, బాయిలర్సు, కాలికో ప్రింటింగు, చర్మపారిశుధ్యము, ఇంకా అనేక యితర పరిశ్రమలలోను, ఉపయోగ కారియైన క్రోమైటు ఖనిజము, కృష్ణాజిల్లాలోని కొండపల్లి పర్వత ప్రాంతములోను, కోడిమపోటవరం, ఖమ్మం జిల్లాల్లోని తూర్పు భాగములోను ఎంతో లభ్యమవుతుంది.

జిప్సము :—రసాయనపు ఎరువులలోను, ప్లాస్టరు ఆఫ్ పారిసు, సిమెంటు, పింగాణి పరిశ్రమలలో ఉపయోగపడే జిప్సము ఖనిజము, నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సుప్రాంతములో దొరుకుతుంది.

ఇనుము :—కృష్ణా, ఖమ్మం, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపూరు జిల్లాలలో అనేక ప్రాంతములలో ఇనుప ఖనిజపు నిక్షేపములున్నవి. ఉత్తమశ్రేణికి చెందిన ఇనుప ఖనిజము అనంతపూరు జిల్లాలో లభ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరింప బడియున్న ఇనుము, ఖనిజపు నిధులనుంచి కనీసం 389 మిలియన్ల టన్నులు ఉత్పత్తి చేయవచ్చునని నిపుణుల అంచనా. ఒక్క గుంటూరు జిల్లాలోనే 300 మిలియన్ల టన్నుల ఖనిజము భూగర్భములో ఉన్నట్లుగా చెప్ప బడుచున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇనుప ఖనిజ నిధులన్నిటినీ వెలికితీసి, ఉత్పత్తి అధికమొనరించిన యెడల, భారత దేశపు ఇనుము ఎగుమతులుకూడా ఎంతో పెరుగుతాయి. విదేశీ ద్రవ్య మారకము ఎంతగానో సంపాదించవచ్చు.

ఇలిమినైటు :—టైటానియము డయాక్సైడు ఉత్పాదన పరిశ్రమలో ఉపయోగకారియైనఇలిమినైటు విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం పరిసరములలోను, ఇంకా ఇతర తీర ప్రాంతముల లోను లభ్యమవుతుంది. జిర్కాను, మోనోజైటు కలిసిన ఇసుక పెద్దగడ్డ ప్రాంతములో దొరుకుతున్నది.

సున్నపురాయి :—సిమెంటు, పంచదార పరిశుద్ధి చేయటములోను, వెజిటబిలు ఆయిల్సు, సోడాయాష్, కాస్టికుసోడా, బ్లీచింగుపౌడరు, కాల్షియము కార్బైడు, కుండలు (పాటరీసు) తయారీ, చర్మ పారిశుధ్యపరిశ్రమలలోను ఎంతో ఉపయోగకారియైన సున్నపురాయి (Limestone) కర్నూలు, కడప, అనంతపురం, గుంటూరు జిల్లాలోని పల్నాడు తాలూకాలోను, ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, పెన్గంగ ప్రాంతములలోను, విరివిగా లభిస్తున్నది. మంచిర్యాల, పెన్గంగప్రాంతములో లభ్యమయ్యే ఉత్తమ శ్రేణికి చెందిన సున్నపురాయి, సిమెంటు పరిశ్రమ అభివృద్ధికి ఎంతైనా దోహదకారి అవగలదు. బొగ్గుగనులలోను, సిమెంటు పరిశ్రమలలోను ఉపయోగపడే మొదటి తరహాకు చెందిన సున్నపురాయి ఆంధ్రప్రదేశ్‌లో అతి విరివిగా దొరకుట వలన యావత్దక్షిణభారత దేశములోని సిమెంటు పరిశ్రమాభివృద్ధి పథకాలలో, ఆంధ్రప్రదేశ్ అతి కీలకస్థానము ఆక్రమింప నున్నది.

మాంగనీసు :— ఉక్కు, డ్రైబాటరీలు, రసాయన పదార్థములు, పింగాణి వస్తువుల ఉత్పత్తి, ప్లాస్టిక్కు, వెల్డింగు, వార్నిష్ పరిశ్రమలలో విరివిగా ఉపయోగింపబడుచున్న మాంగనీసు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో లభ్యమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని మాంగనీసు ఉత్పత్తిలో అత్యధిక భాగము విదేశములకు ఎగుమతి గావింపబడుతున్నది. భారత దేశములో, మాంగనీసు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అయిదవ స్థానము ఆక్రమిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వము ఇతోధిక సహాయమొనర్చిన యెడల ఈ పరిశ్రమ ఇంకా ఎంతో వృద్ధిచెందుతుంది.

అభ్రకము (Mica) :— విద్యుత్పరికరముల ఉత్పత్తి పరిశ్రమలలో ఎంతో ఉపయోగకారి అయిన అభ్రకము నెల్లూరు జిల్లాలోని కావలి, ఆత్మకూరు, రాపూరు, గూడూరు తాలూకాలలోను ఖమ్మంజిల్లాలోని కల్లూరు గ్రామప్రాంతములోను విరివిగా లభిస్తుంది. ఆంధ్రప్రదేశలో దొరికే అభ్రకములో చాలా భాగము విదేశములకు ఎగుమతి గావింపబడుచున్నది. అంతర్జాతీయ మార్కెట్లలోని విక్రయకేంద్రములలో ఆంధ్రప్రదేశ్ నుంచి త్రవ్వ బడిన అభ్రకము ఎంతో ప్రముఖస్థానము వహిస్తున్నది. విదేశీద్రవ్య మారకము, ఆర్థికసహాయము, తగినంతగా సాంకేతిక నిపుణులు, శిక్షణ సౌకర్యములు అందచేసినచో, గూడూరులోని మైకానైటు పరిశ్రమ ఎంతయినా అభివృద్ధిచేయవచ్చు. విదేశములకు అభ్రకపు ఎగుమతులు ద్విగుణీకృతముగావించవచ్చు. భారతదేశపు విదేశీ ద్రవ్యమారకం కొరతగూడా కొంతవరకు తీర్చవచ్చును.

క్వార్ట్జు, సిలికా :—కళ్ళద్దాలు, గ్లాసు పరిశ్రమలలో ఎంతో ఉపయోగపడే క్వార్ట్జు (Quartz), హైదరాబాదు, కర్నూలు, అనంతపురం జిల్లాలలో విరివిగా లభిస్తున్నది. కర్నూలు జిల్లాలోని కంభం, గిద్దలూరు ప్రాంతములు క్వార్ట్జు ఉత్పత్తికి ప్రముఖ కేంద్రములు.

స్టియటైటు, టాల్కు :—పెయింట్లు, రబ్బరు, సౌందర్య పోషక పదార్థములు (Cosmetics), క్రిమిసంహారకపదార్థములు, పింగాణీపరిశ్రమలలో ఉపయోగకారియైన స్టియటైటు, టాల్కు ఖనిజములు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి తాలూకాలోను, చిత్తూరు, కరీంనగరు, కర్నూలు జిల్లాలలోని అనేకప్రాంతములలోను లభ్యమవుతున్నది. తాడిపత్రి, బేతంచర్లలో దొరికే ఉత్తమశ్రేణికి చెందిన స్టియటైటు ఖనిజము, అక్కడి సిమెంటు పరిశ్రమ అభివృద్ధికి ఎంతైనా తోడ్పడుతుంది.

అణుశక్తి పదార్థములు :— అణుశక్త్యుత్పత్తిలో అత్యవసరమైన బెరిలు, సోమర్ స్కైటు, యురేనియము మొదలగు అనేక ఖనిజములు నెల్లూరు జిల్లాలోని ఊటుకూరు, గిద్దలూరు ప్రాంతములలో అభ్రకముతోపాటు, అనేకచోట్ల లభ్యమవుతుంది. కొరండం ఖనిజము అనంతపూరు, వరంగల్లు, విశాఖపట్నం జిల్లాలలో అనేక ప్రాంతములలో దొరుకుతుందని పలువురు నిపుణులు వ్యక్తపరచారు.


రాగి :— కర్నూలు జిల్లాలోని గుమ్మకొండ, గారు ప్రాంతములలోను, గుంటూరు జిల్లాలోని అగ్నిగుండాల, కారెంపూడి ప్రాంతములలోను, నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి తాలుకాలోను, సింగరాయకొండలోను రాగి గనులు అనేక ప్రాంతముల మేరకు విస్తరించి వున్నట్లు చెప్పబడుచున్నది.

కా[illegible]టు పలకరాయి :— విద్యుత్పరికరముల ఉత్పత్తి పరిశ్రమలో ఎంతో ఉపయోగపడే ఉత్తమశ్రేణికిచెందిన పలకరాయి కర్నూలు జిల్లాలోని కంభం, మార్కాపూరు ప్రాంతములలో విరివిగా దొరుకుతుంది.

రంగులు తయారీ పరిశ్రమలో ఉపయోగపడే అనేక యితర చిన్నచిన్న ఖనిజ వస్తువులు, ఓకెరు (Ochre) మొదలగునవి కర్నూలు జిల్లాలోని అంబాపురం, గుంటుపల్లి ప్రాంతములలోను, పశ్చిమగోదావరి, హైదరాబాదు జిల్లాలోని అనేక ప్రాంతములలోను విరివిగా లభిస్తాయి. పెయింట్ల పరిశ్రమలో అవసరమయిన అనేక ఖనిజములు ప్రస్తుతము భారతదేశము, విదేశములనుంచి భారీ ప్రమాణములో దిగుమతి చేసుకొంటున్నది. ఈ ప్రాంతములలోని నిధులన్నీ వెదికి, త్రవ్వకమును ప్రారంభించినయెడల, దిగుమతులు తగ్గించుకోవచ్చు. కర్నూలు జిల్లాలోని బేతంచర్ల పరిసరములలో భారీఎత్తున, రంగుల పరిశ్రమను స్థాపించి అభివృద్ధిచేయవచ్చును.

ఆంధ్రప్రదేశ్‌లో పైనుదహరించిన అపారఖనిజసంపదలోని అత్యధికభాగము ఇంతవరకు భూగర్భములో నిధుల రూపములోనే వున్నది. ఆంధ్రప్రదేశ్ అంతటా పెద్దఎత్తున భూగర్భ పరిశోధనలు జరిపించి, యీ ఖనిజసంపదనంతా త్రవ్వి, బయటికితీసే కార్యక్రమము ప్రారంభించుట ఎంతయినా అత్యవసరము. శీఘ్రగతిని అభివృద్ధి కార్యక్రమములు జరిపించుటవలన, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ సుస్థిరపడుటయేగాక, కనీసం మరో లక్ష మందికి ఉద్యోగావకాశములు కల్పింపబడుతాయి. వివిధరకములయిన పరిశ్రమలు నెలకొల్పబడుతాయి. పారిశ్రామిక రంగములోగూడా ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేయవచ్చును.

కవితాంజలి



ఢిల్లీలో రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి జన్మదినోత్సవ సందర్భంగా వారికి శ్రీ తాడూరి స్వామి శ్రీనివాస దేవానంద్ కవితాంజలి సమర్పిస్తున్న దృశ్యం.



దారితప్పిన మానవుడు

కథానిక

— బి. విద్యాసాగర్

రంగారావు కాఫీతాగి లైబ్రరీకి వెళ్ళి న్యూస్ పేపర్లు చదివి 'వాంటెడ్ కాలమ్స్'లో తనకు పనికివచ్చే వుద్యోగం యేదైనా కనిపిస్తే, అటువంటి వివరాలన్నీ నోటు చేసుకున్నాడు. తర్వాత వొక గంటసేపు అన్ని న్యూస్ పేపర్లలోనూ వున్న వార్తలన్నీ వోపిగ్గా చదివాడు. అతనికి చేసే పనేమీలేదు. కావలసినంత తీరిక. అతను బి. ఏ. ప్యాసయి మూడేళ్ళనుండి వుద్యోగం లేకుండా వున్నాడు. అతనిది బీద కుటుంబం. అప్పులుచేసి చదువుకున్నాడు. ఉద్యోగంలోకి వచ్చాక అప్పులు తీర్చవచ్చు ననుకుంటే యెంత ప్రయత్నించినా యే వుద్యోగమూదొరకలేదు. అందుకు కారణం అతనికంటే యెక్కువ చదువుకున్నవాళ్ళు ఇంటర్వ్యూలకు రావడం, లేదా రెకమండేషను వలన యింకొకరికి ఆ వుద్యోగం లభించడం.

రంగారావు యింటికి చేరుకున్నాడు. తెల్లకాగితాలు, కలం తీసుకుని వరుసగా నాలుగు అప్లికేషన్లు వ్రాశాడు. లైబ్రరీలో కూర్చుని డైరీలో నోట్‌చేసుకున్న వుద్యోగాలకు ఈ దరఖాస్తులు వ్రాశాడు.

"ఏమిటిరా! వ్రాస్తున్నావు?" అన్నాడు తండ్రి భుజంగరావు. "ఏమీలేదు, లైబ్రరీలో వాంటెడ్ కాలమ్స్ చూసివచ్చాను. వాటికి దరఖాస్తులు పంపుతున్నాను."

"ఎందుకురా, అనవసరం! పోస్టు ఖర్చులు దండుగ! ఈ వుద్యోగాలు వస్తాయా, పెడ్తాయా!"

"అలా నిరుత్సాహంతో దేనికీ దరఖాసు పంపడం మానేస్తే యెలా! పదిరాళ్ళు విసిరితే, యేదో వొకటి తగలకపోతుందా!" అన్నాడు రంగారావు.

"ఆ, తగులుతుంది! మూడేళ్ళనుండి ప్రయత్నం చేస్తున్నావు ఏ వుద్యోగానికయినా సెలక్టు అయినావా!" అన్నాడు భుజంగరావు కోపంగా.

"నాకు అదృష్టం లేదు. అందుకే రెండుమూడు వుద్యోగాలు తప్పకుండా సెలక్టు అవుతాననుకున్నవి కాలేదు."

"అదృష్టం లేదనుకోవడం వేదాంతం! ఏ వుద్యోగానికయినా రెకమండేషను కావాలిరా నాయనా! అదిలేకపోతే నువ్వు బి.ఏ. కాదు, యం. ఏ. ప్యాసయినా వుద్యోగం రాదు."

"నిజమే! దేశంలో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. ఇంజనీర్లకు వుద్యోగాలు లేవు. డాక్టర్ల పరిస్థితీ అదే!" అన్నాడు రంగారావు.

"బాగుపడదురా నాయనా! ఎన్నాళ్ళు పోయినా యింతే! ఎన్ని పంచవర్ష ప్రణాళికలు వచ్చినా నిరుద్యోగం, దారిద్ర్యం నిర్మూలించలేకుండా వున్నారు. చూడపోతే, నానాటికీ పరిస్థితి క్షీణించిపోతున్నది గాని మెరుగుపడే సూచనలు కనుపించడంలేదు." అన్నాడు భుజంగరావు.

"వస్తాను నాన్నా! పోస్టుకు టైమవుతున్నది" అని రంగారావు కాగితాలు జేబులో వేసుకుని పోస్టాఫీసుకు వెళ్ళాడు.

భుజంగరావుది పేద కుటుంబం. అతనొక ఎలిమెంటరీ స్కూలులో టీచరు. అతనికి ఏడుగురు సంతానం. ముగ్గురు మగపిల్లలు. నలుగురు ఆడపిల్లలు. రంగారావు పెద్దకొడుకు. అతన్ని ఎలాగో అప్పులు చేసి బి. ఏ. దాకా చదువు చెప్పించాడు. కొద్దిగా పొలంవుంటే అది అమ్మివేసి పెద్దకూతురి పెళ్ళిచేశాడు. మిగతా ఆడపిల్లల పెళ్ళి యెలా చేయడమనేది ఆయనకొక విషమ సమస్య అయిపోయింది. వాళ్ళకు యెలిమెంటరీ స్కూలులో చదువు పూర్తికాగానే ఆపేశాడు. రెండో కొడుకు స్కూలు ఫైనలు పూర్తి కాగానే, కాలేజీ చదువు చెప్పించే స్థోమత లేక ఆపుచేశాడు. అతను యింట్లో ఖాళీగావున్నాడు. ఇంకో కుర్రవాడు ఎలిమెంటరీ స్కూలులో చదువుతున్నాడు. భుజంగరావు గారి వయస్సు 56 సంవత్సరాలు. కొద్దికాలంలో రిటైరు కాబోతున్న, ఆయనకు జీవితంలో అన్నీ సమస్యలే!

భుజంగరావు సంసార నిర్వహణకు తన సంపాదన చాలక వూళ్ళో చాలా మంది దగ్గర అప్పులు చేశాడు. అప్పులవాళ్ళు బాకీలు తీర్చమని వత్తిడి చేస్తున్నారు. ఏదో సమాధానం చెప్పి వాళ్ళను తప్పించుకు తిరుగుతున్నాడు. పెద్ద కొడుక్కి యేదైనా మంచి ఉద్యోగం లభిస్తే, తన కష్టాలు కొంతవరకూ తీరుతాయనుకుంటే, ఆ ఆశ నిరాశ అయింది. ఎన్ని ఉద్యోగాలకు దరఖాస్తులు పంపినా ఫలితం శూన్యం. కొన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళి వచ్చాడు కాని దానిలోనూ కలసి రాలేదు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతున్న ఈ కాలంలో వట్టి బి. ఏ. క్వాలిఫికేషన్‌తో ఉద్యోగం రావడం కష్టమే! అందులోనూ రంగారావు

చదివింది బి.ఏ. (హిస్టరీ). చరిత్రలో గజనీ మహమ్మద్ సోమనాథ దేవాలయంపై ఎన్నో సార్లు దండయాత్ర జరిపినట్లు చెపుతారు. అలాగే, రంగారావు వుద్యోగాలకోసం యెన్నో దండ యాత్రలు జరిపి ఘోరంగా పరాజయం పొందాడు. ఏ వుద్యోగానికీ సెలక్టు కాలేదు.

భుజంగరావు గారు రెండో కూతురు పెళ్ళి చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఆ అమ్మాయి వయస్సు 18 యేళ్ళు. కుదిరితే, యిద్దరి పిల్లలకు త్వరలో పెళ్ళి చేయాలి. కాని యెలా చేస్తాడు! ఏమిపెట్టి చేస్తాడు! అమ్మడానికి పొలంలేదు. చచ్చినా యిక అప్పు పుట్టదు. తాకట్టు పెట్టడానికికానీ, విక్రయించడానికి కానీ భార్యమెళ్ళో నగలు యేమిలేవు. అవి యేనాడో హరించుకు పోయాయి. ఇక యేవిధంగా కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేస్తాడు! ఆలోచిస్తూ కూర్చుంటే బుర్ర వేడెక్కి పోతుంది. పూర్వ జన్మలో తను చేసుకున్న పాపానికి ప్రతిఫలంగా ఏడుగురు పిల్లలు పుట్టారు. పాపం అనడంకంటే స్వయంకృతాపరాధం అంటే బాగుంటుంది. ఆర్థిక స్తోమత లేనప్పుడు తన కుటుంబాన్ని పరిమితం చేసుకుంటే బాగుండేది! కాని ఆ కాలంలో ఈ 'ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలు' ప్రచారం లేదు. అందుకే పిల్లలు భగవంతుడిచ్చిన వరంగా భావించి స్వీకరించాడు. ఆ కాలంలోనే ఈ ప్రచారం వుంటే తనూ ఆపరేషను చేయించుకుని, ఈనాడు హాయిగా, నిశ్చింతగా జీవించేవాడు! ఇప్పుడనుకునిఏమి లాభం!

రంగారావుకు హైదరాబాదులో వొక వుద్యోగానికి 'ఇంటర్వ్యూ' కు రమ్మని పిలుపు వచ్చింది. ప్రయాణ ఖర్చులకు, యితర ఖర్చులకు వంద రూపాయలు కావాలి. తండ్రిని అడిగాడు. తండ్రి మండిపడ్డాడు.

"వంద రూపాయలు కావాలంటే యెక్కడనుంచి తెస్తాను! మన మొఖానికి యెవరు యిస్తారు అప్పు! అయినా నీ పిచ్చిగానీ ఈ వుద్యోగం వస్తుందా, పెడ్తుందా! వెళ్ళడం అనవసరం" అన్నాడు.

"ఏమో! నా అదృష్టం బాగుండి, ఈ వుద్యోగం వస్తుందేమో"

"నీ అదృష్టం, నా అదృష్టం బాగుంటే మన పరిస్థితి యిలా వుండేదికాదు. నేను యెన్నోసార్లు లాటరీ టిక్కెట్లు కూడా కొన్నాను...కాని యేమిలాభం! ఒక్కసారి కూడా ప్రైజ్ రాలేదు. ఒక్క బహుమతి వస్తే మన సమస్యలు అన్నీ తీరుతాయి."

"అడ్డదారిన డబ్బు సంపాదించాలనుకోవడం అవివేకం! లాటరీ టిక్కెట్లు కొనడం తప్పేమీకాదు కాని, అదే పనిగా వున్న డబ్బంతా ఖర్చు పెట్టడం దండుగ!"

"దండుగేరా! కాని యేమిచేస్తాం? ఆ విధంగానయినా కలిసి వస్తుందేమోననే ఆశతో కొంటాము."

"ఇంతకూ నాయింటర్వ్యూకు డబ్బు సంగతేమిటి?"

"తప్పుతుందా! తల తాకట్టు పెట్టి యెక్కడయినా పట్టుకు వస్తాను. ఇదే ఆఖరు ఇంటర్వ్యూ! ఈ ఉద్యోగం రాకపోతే, యిక నాకు వుద్యోగం వచ్చే యోగం లేదన్నమాటే!"

భుజంగరావు యెక్కడో అప్పుతెచ్చి, కొడుకు హైదరాబాద్ ప్రయాణానికి యేర్పాటుచేశాడు. రంగారావు ఈ వుద్యోగం రావాలి అని మనస్సులో భగవంతుని ప్రార్థించి, హైదరాబాదు వెళ్ళాడు.

నాలుగు రోజుల్లో హైదరాబాద్ నుంచి ఇంటర్వ్యూ ముగించుకుని తిరిగి వచ్చాడు.

"ఎలా వుందిరా ఇంటర్వ్యూ?" అడిగాడు తండ్రి.

"బాగానే వుంది. అడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పాను. ఆ వుద్యోగానికి సెలక్టు అవుతానని అనుకుంటున్నాను... ఆ పై భగవంతుడి దయ!" అన్నాడు రంగారావు.

నెల రోజులు గడిచాయి. రంగారావుకు హైదరాబాదునుంచి వర్తమానం వచ్చింది. అతను ఆ వుద్యోగానికి సెలక్టు కాలేదని అందులో సారాంశం! దానితో అతనికి జీవితంలో విరక్తి కలిగింది. ప్రభుత్వంమీద, ప్రజల మీద నమ్మకం పోయింది. అందరిమీదా కసి తీర్చుకోవాలనే వెర్రి ఆవేశం కలిగింది.

భుజంగరావు పరిస్థితికూడా అలాగేవుంది. అప్పులవాళ్ళు వత్తిడి చేస్తున్నారు. సంసార నిర్వహణకు ఆయన సంపాదన చాలడంలేదు. న్యాయంగా, ధర్మంగా తను సంపాదించి జీవితం గడుపలేననే నిశ్చయానికి వచ్చాడు లాటరీటిక్కెట్లు యెన్ని కొన్నా తనకు బహుమతి రాలేదు. కనుక, తన సమస్యలు పరిష్కరించుకోవడానికి దౌర్జన్యానికి తలపడాలి. తమ శ్రీకాకుళం జిల్లాలో నక్సలైట్లు దౌర్జన్యానికి తలపడి యెంతమందినో దోచుకున్నారు. తనుకూడా వాళ్ళలో చేతులు కలిపి, తన జిల్లాలోని ధనికులందరినీ దోచుకోవడంలో తప్పేమి కనిపించలేదు. అతనికి ఆక్షణంలో ఆ విధంగా ప్రభుత్వం మీద ప్రజలమీద కసి తీర్చుకోవచ్చును.

"ఏరా, రంగా! నాకు నక్సలైట్లలో చేరి, ప్రజలను దోచుకోవాలని, అనిపిస్తున్నది. నువ్వుకూడా నాతో వస్తావా! నీకు ఈ జన్మలో వుద్యోగంరాదు. ఎన్నాళ్ళు మనం ఈ దరిద్రం అనుభవిస్తాము! ఏమంటావ్!" అన్నాడు భుజంగరావు పగపట్టిన త్రాచులాగా.

"నాకూ అలాగే అనిపిస్తోంది నాన్నా! ఎన్నాళ్ళు చూసినా నాకు వుద్యోగం వచ్చేటట్లు కనిపించడంలేదు మన శ్రీకాకుళం జిల్లాలో నక్సలైట్ల కార్యకలాపాలు బాగాజోరుగా సాగుతున్నాయి. మనంకూడా వాళ్ళతో చేతులు కలిపి, కొన్నాళ్ళపాటు ప్రజలను దోచుకుని, ఆపైన రహస్యంగా మరొక జిల్లాకు పారిపోయి, అక్కడ మకాంపెడదాము" అన్నాడు రంగారావు రంగంలోకి దూకుతూ.

తండ్రీ కొడుకులు యిద్దరూ, యింట్లో వాళ్ళకు ఈ విషయం చెప్పకుండా ఆరోజు రాత్రి యింట్లోనుంచి రహస్యంగా

పారిపోయి నక్సలైట్లతో చేతులు కలిపారు. నక్సలైట్ నాయకుడు వారికి తగిన సహాయం చేస్తానని హామీయిచ్చి, వాళ్ళకు ఆయుధాలు యిచ్చాడు.

ఆ నాటినుంచి భుజంగరావు, రంగారావు, నక్సలైట్ల అడుగుజాడలలో నడుస్తూ, ఎన్నో దోపిడీల్లో పాల్గొన్నారు. ఎన్నో హత్యలు కళ్ళముందు జరుగుతుంటే ప్రేక్షకులలాగా వుండి పోయారు. ఎంతో డబ్బు సంపాదించారు దోపిడీలలో.

శ్రీకాకుళం జిల్లాలో పోలీసుల బందోబస్తు యెక్కువ చేయ బడింది. ఒకసారి పోలీసులు నక్సలైట్ల స్థావరాలపై దాడిజరిపి, కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో కొందరు నక్సలైట్లు మరణిం చారు. అందులో భుజంగరావు వొకడు! భుజంగరావు 'అమ్మా' అంటూ కేకవేసి పడిపోగానే, రంగారావు తండ్రి దగ్గరకు పరు గెత్తాడు.

"నాన్నా! నీ జీవితం ఈ విధంగా ముగిసిందా! దౌర్జ న్యంగా డబ్బు సంపాదించాలని, ప్రజలను దోచుకోవాలని భావించి నందుకు మనకు తగిన గుణపాఠమే నేర్పింది ప్రభుత్వం" అని యేడ్చాడు.

మరణించిన వారిని, పట్టుబడిన మిగతా నక్సలైట్లను పోలీస్ వ్యాన్‌లో యెక్కించుకుని పోలీసువారు బయలుదేరారు రంగారావు యింకా యేడుస్తుంటే, సబ్‌ఇన్‌స్పెక్టర్ "అతడు మీకు యేమవుతాడు?" అని అడిగాడు.

"మా నాన్నగారండీ! మేము వొకప్పుడు గౌరవంగా బ్రతికిన వాళ్ళమే! మా నాన్న ఈ జిల్లాలో ఎలిమెంటరీ స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన సంపాదన చాలక, అప్పుల వాళ్ళ బాధభరించలేక, ఈ మార్గం అవలంబించాము. మేముచేస్తు న్నది తప్పని తెలుసు! కాని దారిద్ర్యం అనుభవించలేక ఈ నీచానికి పాల్పడ్డాము."

"నువ్వు యేమయినా చదువుకున్నావా?"

"నేను బి. ఏ. ప్యాసయాను. మూడు యేళ్ళనుండి నిరుద్యో గిగా పడివున్నాను. ఎన్నో వుద్యోగాలకు దరఖాస్తులు పంపాను. కానీ యే వుద్యోగమూ రాలేదు అందుకే నాలోకూడా వెర్రి ఆవేశం కలిగి, ఈ పాపానికి పూనుకున్నాను"

ఇప్పటి కయినా కళ్ళుతెరచి, మంచిమార్గాన్ని అవలంబించి గౌరవంగా జీవించడానికి ప్రయత్నం చేయండి. మీరు బి.ఇడి. ప్యాసయితే, టీచర్‌గా పనికి వస్తారు కదా! ఆ పనిచేయకూడదా!" అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్ "అలాగే చేస్తాను!" అన్నాడు రంగా రావు ఏడుస్తూ. ★

పాఠకుల లేఖలు:

ఎడిటర్ గారికి

ఈ నెల (సెప్టెంబరు) సంచిక చాలా ఆకర్షణీయంగా వుంది. కళింకొండ ప్రభాకర్ గారి 'తెలుగునాడులో సాంస్కృతిక విప్లవం' విజ్ఞానదాయకంగా వుంది. నేటి యువతరానికి—మారు తున్న మన సంస్కృతి గురించి కొంతయినా సంక్షిప్తంగానైనా తెలియచేయడం అవసరం. యికముందుకూడా అటువంటి వ్యాసా లను అందచేయగలరని ఆశిస్తున్నాను. 'చైతన్యమూర్తులు' కూడా బాగుంది. ఆయా రచయితలకు, ప్రచురించిన మీకు నా అభి నందనలు.

ఇట్లు
నాగ పద్మప్రియ
విజయనగరం.

ఆర్యా!

మీ ఆంధ్రప్రదేశ్ పత్రికలో తిరస్కృతి సీరియల్‌ను మే-జూన్ 1970 పత్రికలో సశేషం అని వ్రాసినారు కాని తరువాత ప్రతినెల పత్రిక వచ్చేసరికి చాలావుత్సాహముగా వుంటాను. కాని మీరు తిరస్కృతి సీరియల్ వేయని కారణముగా నాకు చాలా నిరు త్సాహము కలుగుచున్నది గాన మీ అభిమాన పత్రికకొనే వారిలో నొకడిని గాన మీరు "తిరస్కృతి" సీరియల్‌ను తప్పక ప్రచు రిస్తారని మిమ్ములను మిక్కిలి ప్రార్థిస్తూవున్నాను.

జవుల మాణిక్యాలరావు,
సరిపల్లి

ఆర్యా,

"ఆంధ్రప్రదేశ్" ఆగష్టు 1970 పత్రిక చూచినాను. అందులో "మన రాజ్యాంగం—శాసన సభలు" అన్న శీర్షిక చదివి నాను. అది చాలా చక్కగా వున్నది. యిలాంటి వివరణలు సీరియల్‌గా యిస్తే చాలా ఉపయోగకరంగా వుండును.

శాసన సభా కార్యక్రమం; ఆ రూల్సు చదువుకొని అర్థం చేసుకొనుటకు అవకాశం లేనపుడు మీ పత్రిక చదువుకొని అవ గాహన చేసుకొనుట సులభం.

ముఖ్యంగా శాసన పరిషత్తుకు జరిగే ద్వైవార్షిక ఎన్నిక పద్ధతి వివరంగా మీ పత్రికలో ప్రచురించగలరని ఆశిస్తున్నాను.

భవదీయ
వి. రామారావు
శాసన సభ్యులు, విజయనగరం.

ఆర్యా!

ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలో "తిరస్కృతి" సీరియల్ ప్రకటించకపోవడం ఆశ్చర్యంగా వుంది. ఇది పాఠకులకు నిరాశ కల్గిస్తున్నది. దయచేసి యీ విషయం శ్రద్ధతీసుకోండి.

(ఆంగ్ల లేఖ)
యస్. వి. యల్. నరసింహం,
అడ్వకేటు, గుంటూరు.

[రచయిత్రినుండి మిగిలిన భాగం ప్రతి అందగానే తిరిగి ప్రచురిస్తాము. సం.]

రూ. 6·4 లక్షలు పంపిణీ

జంటనగరాలలో సెప్టెంబరు ఆఖరు వారంలో కురిసిన కుంభవృష్టి వల్ల అపార ప్రాణ నష్టం ఆస్తినష్టం కలిగింది. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే రంగంలో ప్రవేశించి సహాయక చర్యలకు పూనుకొంది. వరదబాధితులకు ఆహారం, దుస్తులు, ఆశ్రయం మున్నగు సదుపాయాలు కల్పించి, వారి ఈతి బాధలను తగ్గించేందుకై ప్రభుత్వం యథాశక్తి కృషిచేసింది. మునిసిపల్ కార్పొరేషను, హైదరాబాదు కలెక్టరు కార్యాలయంవారు కలసి సైనికులు, పి. డబ్ల్యు. డి. ఉద్యోగులు సి. ఆర్. పి, ఐ. సి. యస్. డబ్ల్యు. వంటి అనధికార సంస్థల సహాయ సహకారాలతో వర్షబాధితుల సహాయక చర్యలను చేపట్టారు. రోడ్లు భవనముల చీఫ్ ఇంజనీరు, పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజనీరు పర్యవేక్షణ క్రింద వివిధ స్థలాల్లో కూలిపోయిన ఇండ్లనుంచి వస్తు సరంజామాలు జాగ్రత్తగా వెతికితీసి ఆ ఇండ్లస్థలాలను శుభ్రపరచడం జరిగింది. ఆహారం పంపిణీ విషయంలోనూ, కూలిన ఇండ్ల విషయంలోను విద్యార్థులు ముందుకువచ్చి సహాయపడ్డారు.

వరదలు వచ్చిన కొన్ని గంటలలోపలనే దెబ్బతిన్న ప్రాంతాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. దెబ్బతిన్న ప్రాంతాలలో సత్వర సహాయక చర్యలు తీసుకొనేందుకు కొన్ని కొన్ని ప్రాంతాలు ఒక్కొక్క మంత్రికి అప్పగించబడ్డాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధించిన అధికారులతో ప్రతిదినం సహాయకచర్యలను గురించి సమీక్షచేశారు. ముఖ్యమంత్రి తరచుగా మంత్రులు అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేసి సహాయకచర్యల విషయమై తగిన సూచనలు చేశారు.

మొత్తంమీద 4065 ఇండ్లు దెబ్బతినడంకానీ లేక కూలిపోవడంకానీ జరిగింది. మొత్తం 1730 గుడిసెలు కొట్టుకొనిపోయినాయి. 2328 పెంకుటిండ్లు బాగా దెబ్బతిన్నాయి. వీటిల్లో కొన్ని కూలిపోయినాయికూడా. వర్షబాధితుల సహాయార్థం హైదరాబాదు కలెక్టరు రూ. 6.4 లక్షలు మంజూరుచేశారు. బాగా దెబ్బతిన్న ప్రాంతాలలో సెప్టెంబరు 27వ తేదీనాటికి డబ్బు, ఇతర వస్తువుల పంపిణీ కార్యక్రమాలు అన్నీ పూర్తి అయినాయి. ప్రతి పేద కుటుంబానికి ఒక ధోవతి ఒకచీర ఇవ్వడం జరిగింది. ఈ విధంగా మొత్తం 3000 ధోవతులు చీరలు పంచిపెట్టబడినాయి. సెప్టెంబరు 29వ తేదీన సహాయక శిబిరాలు మూసివేసిన సందర్భంలో కొన్ని రోజులు ఏదోవిధంగా జరగడానికి వీలుగా ఒక్కొక్క కుటుంబానికి 10 కిలోల బియ్యం, $\frac{1}{2}$ కిలో పప్పుధాన్యాలు చొప్పున పంచిపెట్టడం జరిగింది.

గౌలిగుడాలో మూడంతస్తుల భవనం కూలిపోయిన కారణంగా, అందులో ఇరుక్కొనిపోయిన అనేకమంది ప్రజలను రక్షించడానికి సైనిక సహాయం పొందడం జరిగింది. సెప్టెంబరు 22వ తేదీన 200 మంది జవానులు గౌలిగుడాలో ఈ మూడంతస్తుల భవన శిధిలాలను వెలికితీశారు. గౌలిగుడా, జాంబాగ్, ఉస్మాన్‌గంజ్‌లలో భవన శిధిలాలను వెలికితీసే బాధ్యత పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీరుకు వప్పగించబడింది. ఈ ప్రాంతంలో 250 మంది కూలీలు ప్రతిదినం పనిచేశారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన లారీలు 26 కూడా సహాయక పనులకై నియోగించబడినాయి. గోషామహలు, తోప్‌ఖాన, చాకినవాడి ప్రాంతాలలో సహాయకపనులు నిర్వహించే బాధ్యత రోడ్డులు భవనముల చీఫ్ ఇంజనీరుకు అప్పగించబడింది. ఈయన 28 లారీలు, 580 మంది కూలీలతో రాత్రింబవళ్ళు పనిచేశారు.

తోప్‌ఖానాలో సి. ఆర్. పి. కి చెందిన 25 మంది, రోడ్లు భవనముల చీఫ్ ఇంజనీరు ఆధ్వర్యంలో పనిచేశారు.

వీరి కృషికి తోడుగా మునిసిపల్ కార్పొరేషనుకూడా 7,000 మంది కూలీలతో సహాయక చర్యలను చేపట్టింది. 120 లారీలు ఇండ్ల శిధిలాలను తీసివేయడానికి వినియోగించబడినాయి.

సెప్టెంబరు 24 నుంచి 29 వరకు రోజూ 8000 మంది కూలీలు పనిచేస్తూ వచ్చినారంటే ఎన్ని యిండ్లు కూలిపోయి వుంటాయో ఎన్ని సహాయక చర్యలు తీసుకోవలిసి వచ్చిందో అంచనా వేయవచ్చు.

సెప్టెంబరు 28 వ తేదీ నాటికంతా, శిధిలాలను తీసివేసి రోడ్లను చిన్న వీధులను శుభ్రపరచడం జరిగింది. 5 రోజులు అహోరాత్రాలు పనిచేసిన తరువాత 28 శవాలను శిధిలాలనుంచి వెలికితీయడం జరిగింది. వర్షాలవల్ల మొత్తం 55 మంది మరణించారు.

అనేక మంది ప్రజలు నిరాశ్రయులైనందువల్ల మునిసిపల్ కార్పొరేషను 12 సహాయక శిబిరాలను ఏర్పాటుచేసింది. దెబ్బ తిన్న ప్రాంతాలకు సమీపంలో వున్న ప్రభుత్వ భవనాలలో వీరికి ఆశ్రయం ఇచ్చే ఏర్పాట్లు చేయబడినాయి.

సెప్టెంబరు 22 వ తేదీ మధ్యాహ్నానికి 5,000 మంది నిరాశ్రయులకు సహాయక శిబిరాలలో భోజన వసతి సౌకర్యాలు కల్పించబడినాయి. ఈ సంఖ్య 10,000 కు పెరిగింది. అందు వల్ల ఈ శిబిరాల సంఖ్యను 20 కి పెంచవలసి వచ్చింది. రిసాలా, అబ్దుల్లా ఉస్మాన్‌గంజ్, గౌలిగుడా, గోషామహల్ మున్నగు చోట్ల మునిసిపల్ కార్పొరేషను సిబ్బంది భోజన సదుపాయాలు కల్పించారు. పొద్దున రొట్టె పాలు ఇవ్వడమే కాకుండా రెండు పూటల భోజనం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ప్యాకెట్లలో ఆహారం సరఫరా చేయబడింది. కొన్ని అనధికార సంస్థలు ముఖ్యంగా అఖిలభారత సాంఘిక సంక్షేమ మండలి వారు కూడా ఆహారం సరఫరా చేశారు. ప్రభుత్వం ఆలస్యం లేకుండా ప్రజారోగ్య పారిశుద్ధ్యపు చర్యలు గైకొనింది. జలమయమైన ప్రాంతాలలో క్రిమి సంహారక మందులు ప్రయోగించబడినాయి. ప్రజలకు టీకాలు వేయబడినాయి. సంచారక వైద్య చికిత్సాలయాలు కూడా పనిచేశాయి. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్య శాఖవారు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొన్నారు.

ఒకవైపు ప్రజారోగ్యపు ఏర్పాట్లు, నిరాశ్రయులకు సహాయక చర్యలు జరుగుతుండగా సహాయక చర్యలు మంజూరు చేయడానికి అధికారులు, దెబ్బతిన్న ప్రాంతాలను తనిఖీచేసి కలిగిన నష్టాన్ని సరియైన అంచనా వేయడానికి కృషిచేశారు. కూలిపోయిన గుడిసెల విషయంలో రూ. 100 లు; పెంకుటిండ్లు లేక పక్కా ఇండ్ల విషయంలో గరిష్ఠ రూ. 200 లు నగదు గ్రాంటు ఇవ్వడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. సహాయం చేయడానికి తగిన మంజూరీ ఇచ్చేందుకై సెప్టెంబరు 24 వ తేదీ ఉదయం 150 మంది రెవిన్యూ అధికారులు దెబ్బతిన్న ప్రాంతాలలో ప్రతి ఇంటినీ పరిశీలించారు. మరుసటిదినం నుంచీ గ్రాంటులు పంపిణీ చేయడం ఆరంభమైంది. సెప్టెంబరు 27 వ తేదీవరకు, బాగా దెబ్బతిన్న ప్రాంతాలలో సహాయక చర్యలు పరిసమాప్తి అయినాయి.

తుఫానుబాధితుల కాలనీకి శంకుస్థాపన

తూర్పు గోదావరి జిల్లా, సాంబమూర్తి నగరంలో తుఫాను బాధితుల సహాయార్థం రోటరీక్లబ్బువారు నిర్మించ తలపెట్టిన 30 ఇండ్ల కాలనీకి రవాణా శాఖా మంత్రి డా. యం. యస్. లక్ష్మీ నరసయ్య శంకుస్థాపనచేశారు.

మంత్రి ఈ సందర్భంలో ప్రసంగిస్తూ, ప్రభుత్వ భూములు స్వాధీనపరచుకొన్న పెద్ద పెద్ద భూస్వాములు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆ భూములను విడిచిపెట్టినట్లయితే వాటిని బీద ప్రజలకు పంచిపెట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయంలో సహకరించవలసిందని వారికి విజ్ఞప్తిచేశారు. ప్రజలందరికీ తిండి, బట్ట, ఇండ్ల సౌకర్యం కల్పించడమే ధ్యేయం లక్ష్యం అని ఆయన చెప్పారు.

తుఫాను సహాయక నిధి నుంచి ఒక్కొక్క ఇంటికి రూ. 500 లు ఇవ్వడం జరుగుతుందని ఈ సభకు అధ్యక్షత వహించిన కలెక్టరు తెలిపారు.

స్పోర్ట్సు కౌన్సిలు పునర్నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్సు కౌన్సిలును పునర్నిర్మాణం చేసింది. దీనికి శాసనసభ్యులు శ్రీ యం ఎ రామచంద్రారెడ్డి రెండేండ్లు అధ్యక్షులుగా వుంటారు. లాన్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవకార్యదర్శి శ్రీ నరసింహారావు ఎంప్లాయ్‌మెంటు ట్రైనింగు డైరెక్టరు శ్రీ జి. డి ఖురేషి ఐ. ఎ. యస్; లెఫ్టినెంటు కల్నల్ డి. సంజీవరావు విద్యాశాఖ డైరెక్టరు, అమలాపురం శాసనసభ్యులు శ్రీ కె ప్రభాకరరావు హాకీ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి శ్రీ బి. దేవరాజన్ కర్నూలు నివాసి శ్రీ యం జె. రామమూర్తి కడప శాసనసభ్యులు శ్రీ ఆర్ రాజగోపాలరెడ్డి శ్రీ యన్. యన్. శాస్త్రి ఈ స్పోర్ట్సు కౌన్సిలులో సభ్యులుగా నియమింపబడినారు

విద్యార్థులు-క్రమశిక్షణ

ఎస్. హనుమత్ప్రసాద్

నేడు విద్యార్థి లోకంలో అనేక రూపాలలో అలజడులు చెలరేగుతున్నాయి. క్రమశిక్షణారాహిత్యం యిందుకు కారణం. అంతే కాదు. తల్లిదండ్రులు తమ సంతానంపట్ల గారాబంగా ప్రవర్తించడం కూడా విద్యార్థులు చెడిపోవటానికి కారణమే.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు: శ్రీ పి. వి. నరసింహారావుగారు ఇలా అన్నారు.

“ఇంగ్లీష్ మీడియమ్‌లో క్రమశిక్షణ పాటించడం జరుగుతున్నది అందుచేతనే విద్యార్థులు ఇంగ్లీషు మీడియమ్‌లో చేరాలని ఆతురత పడుతున్నారు. తెలుగు బోధనా భాషగా గల కళాశాలల్లో కానీ, పాఠశాలల్లో కానీ క్రమశిక్షణ సరిగా పాటించుట లేదు. ఈ తారతమ్యం ఎందుకున్నది.” అని. నిజమే ఈ తారతమ్యం ఎందుకుంది ?

సాహిత్యాభివృద్ధి జరగాలి

మాతృభాషపై ప్రజలకు అభిమానం సన్నగిల్లడానికి కారణాలు ఏమిటి ? అని ప్రశ్నించుకుంటే మనకు సమాధానం దొరకదు. కానీ, మాతృభాషపై అభిమానం పెంపొందించాలి అని అనుకుంటే సాహిత్యాభివృద్ధి జరగాలి. సాహిత్యాభివృద్ధి జరిగితే క్రమశిక్షణ అదంతటదే పెరుగుతుందని భావించటం పొరపాటు. మరి, క్రమశిక్షణ పెరగాలంటే ఏం చేయాలి ? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికి నాకు తెలిసినంతవరకు కొన్ని సూచనలు యిస్తాను.

అవేవంటే,

ప్రాథమిక పాఠశాలలో క్రమశిక్షణ :— ఏ భావిభారత పౌరుని భవిష్యత్తైనా ప్రాథమిక విద్యావిధానం పైనే ఆధారపడి ఉంటుంది. అయిదవ తరగతివరకూ ప్రాథమిక విద్య. ఇప్పటి ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని పురపాలక సంస్థలక్రింద, మరికొన్ని ప్రైవేటు సంస్థలక్రింద నిర్వహించబడుతూ ఉన్నవి. ప్రైవేటు సంస్థలవారు ప్రత్యేక యూనిఫారమ్‌ను ప్రవేశపెట్టి, పిల్లలలో పరిశుభ్రతను అభివృద్ధి పరచుచున్నారు. భవిష్యత్తునుగురించి కఠోరోపన్యాసములను విన్పించి, వారిలో భయాన్ని రేకెత్తించి, విద్యాభ్యాసము సాగించునట్లు చేయుచున్నారు. అయితే ఈ పాఠశాలల్లో ప్రవేశము ధనవంతుల బిడ్డలకే ‘చందా’లనీ ఫీజులనీ, విపరీతంగా ధనమును దోచుకొనుచున్నారు. బీదలకు ప్రవేశములేదు. ఈ కారణముచే బీద విద్యార్థులందరూ పురపాలక సంస్థ ఆధ్వర్యమున నున్న పాఠశాలల్లో చేరుతున్నారు. ఉపాధ్యాయుల నడత సరిగా ఉండదు పాఠశాలల్లో. చీటికీమాటికీ సమ్మెలుచేస్తూ విద్యార్థులకు పాఠములను బోధించుట మానుతుంటారు. భావిభారత పౌరుల నడవడికకు రూపకల్పన చేయవలసిన బోధకులే తప్పటడుగువేస్తూంటే ఇక విద్యార్థుల సంగతి చెప్పడమెందుకు ? ఈ ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనా విధానమును పరిశీలించుట కొరకు సంఘమును నియమించి, ప్రభుత్వము భావిభారత పౌరుల ‘శీలమును’ సరిదిద్దవలసి వుంటుంది. ఈ సంఘమున మానసిక శాస్త్రవేత్తలున్నచో మరీ మంచిది.

ఉన్నత పాఠశాలలు విద్యార్థి సంఘాలు :— ఎస్.ఎస్.సి. వరకు బోధించు పాఠశాలలు ఆంధ్రప్రదేశమంతటా విస్తృతంగా వున్నాయి. కనీసం అయిదువందల మందికి తగ్గకుండా ఈ పాఠశాలల్లో ఉంటారు. వారి కనీసావసరములను సాధించుటకై విద్యార్థి సంఘాలు అవతరించాయి. ఈ సంఘంలో అధ్యక్షోపాధ్యక్షులు, కొందరు కార్యదర్శులు ఉంటారు. విద్యార్థులకు ఓటు విలువ తెలియపరచుట, పరిశీలనాశక్తి పెంపుదల—ఇవి విద్యార్థి సంఘ ఎన్నికల లక్ష్యాలు. ఇక్కడకూడా పార్టీ రాజకీయాలు తలెత్తుట శోచనీయం. ఏ లక్ష్యాలనైతే నిర్మించుకొని, ఈ సంఘాలు వెలసినవో, ఆ లక్ష్యాలను పాటించటం లేకపోగా తగాదాలు తలెత్తినవి ఇది బాధాకరమైన విషయం. పోనీ, తగాదాల అనంతరం ఈ సంఘం ఏమన్నా పనిచేస్తుందా అంటే అదీలేదు. కేవలం ఆగస్టు 15, అక్టోబర్ 2, జనవరి 26 రోజుల్లోనే ఆ సంఘం పనిచేసేది. ప్రధానోపాధ్యాయుడు ఆ యా ఉత్సవాల నిర్వహణకై కొంతధనం మంజూరుచేస్తే, దానిలో సగంకూడా ఈ ఉత్సవాల నిర్వహణకు వ్యయం చేయరు. ఆ మిగిలిన సగం ధనము ఆ సంఘసభ్యులు తాము వినియోగించుకుంటారు. అసలందుకేనేమో ఆ ఎన్నికల్లో పదవులకోసం ప్రాకులాడేది. ఇలాటి ఫలితాలనిస్తున్నందునే కొన్ని పాఠశాలల్లో విద్యార్థి సంఘఎన్నికలు జరుపుటలేదు. ఇలా విద్యార్థి సంఘాల రద్దుచేసేకన్నా వాటికి కొన్ని బాధ్యతలు కల్పిస్తే చాలా మంచిది. ఉదాహరణకు పాఠశాలలలోకానీ, కళాశాలలలోకానీ అల్లర్లు తలెత్తితే వాటిని ఆపేసేందుకు, నిషేధించేందుకు ఈ సంఘాలనే వినియోగించుకోవాలి. సాహిత్య సంబంధమైన పోటీలు, క్రీడోత్సవాలు, పౌరశిక్షణ మొదలగునవి ఈ సంఘాల ఆధ్వర్యంక్రిందే జరిపించాలి.

లైబ్రరీలు—విజ్ఞానము.— లైబ్రరీలలో విజ్ఞాన సాహిత్య సంబంధములైన పుస్తకాలేకాక, న్యూస్‌పేపర్లు కూడా ఉండాలి.

(తరువాయి 45వ పేజీలో)

వేములవాడ పంచాయతీ సమితి

కరీంనగర్ జిల్లాలోని వేములవాడ పంచాయతీ సమితి 1959 నవంబరు 1వ తేదీన ఏర్పాటు చేయబడింది. ఈ సమితిలో 96 గ్రామాలతో కూడిన 58 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 1,27,406 మంది ప్రజల అభ్యున్నతిని తీర్చి దిద్దే బృహత్తర కార్యక్రమాన్ని యీ సమితి స్వీకరించి విజయవంతంగా కృషి చేస్తున్నది. తమ గ్రామాల అభివృద్ధి విషయంలో ఉత్సాహం, పరస్పర సహకారం, స్వయం సహాయంతో పనిచేసే తత్వాన్ని ప్రజలలో కలిగించడంలో యీ సమితి కృతకృత్యమైంది. ఈ దశాబ్దకాలంలో వ్యవసాయం, పశుపోషణ, సహకారం, కమ్యూనికేషన్‌లు విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం రంగాలలో యీ సమితి గణనీయమైన ఫలితాలను సాధించింది.

కొత్తరకం విత్తనాలు

వరి, జొన్న, మొక్కజొన్న యీ బ్లాకులోని ప్రధానమైన పంటలు. వ్యవసాయంలోని ఆధునిక విధానాలను గూర్చి రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయడం జరుగుతున్నది. వరి, జొన్న, గోధుమల సంకరజాతి విత్తనాలను రైతులు విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ విత్తనాల వాడకం క్రమంగా పెరుగుతున్నది. ఈనాడు 1722 ఎకరాలలో ఐ. ఆర్. 8, హంస, జయ వరి వంగడాలు. 1541 ఎకరాలలో సంకరజాతి మొక్కజొన్న 250 ఎకరాలలో సంకరజాతి జొన్న 210 ఎకరాలలో మెక్సికన్ గోధుమ సేద్యం చేస్తున్నారు. రైతులు ఆధునిక వ్యవసాయపరికరాలను కూడ ఉపయోగిస్తున్నారు. ఎరువుల వాడకం విధానం కూడ రైతులకు బాగా తెలుసు. ఏ రకం ఎరువులను ఎప్పుడు ఎంత వాడాలనే విషయాలు వారికి కరతలామలకమైంది. క్రిమి సంహారక మందుల వాడకం సర్వ సాధారణమైన విషయంగా చెప్పుకుంటారు. సస్యరక్షణ పరికరాలను వారు సొంతం చేసుకున్నారు. అవసరమైన రైతులకు అక్కడ సరఫరా చేయడానికి వీలుగా పంచాయతీలలో స్ప్రేయర్లు, డస్టర్లు నిల్వఉంచారు. కొత్తరకాల విత్తనాలను సంశయ రహితంగా వాడడంలో రైతులు ఎంతో ఉత్సాహం, చొరవ కనబరుస్తున్నారు. జిల్లాలో 300 కు పైగా ఎకరాలలో కొత్తరకం కృష్ణపత్తిని వేశారనే విషయమే దానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

బ్లాకులోని 24 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాను విస్తరింపజేయడంతో సేద్యపు బావుల త్రవ్వకం, లిఫ్టు ఇరిగేషన్ పథకాల అమలు జరపడంద్వారా భూగర్భ జలాలను సద్వినియోగం చేసే అవకాశం రైతులకు లభించింది. ఇంతవరకు 8,600 సేద్యపు బావుల త్రవ్వకం, మూల వాగుపై 8 లిఫ్టు ఇరిగేషన్ పథకాలను చేపట్టడం జరిగింది. తత్ఫలితంగా అదనంగా 638 హెక్టర్ల భూమికి నీటి పారుదల సౌకర్యం లభించింది. బ్లాకులో 951 విద్యుచ్ఛక్తి మోటార్లు 1,101 ఆయిల్ ఇంజనులు నెలకొల్పారు.

మంచినీటి బావులు

గ్రామాల మధ్య రోడ్లు నిర్మించడం, ప్రధాన రహదార్లతో గ్రామం రోడ్లను కలుపడంవంటి పనులనుకూడ చేపట్టారు. పంచాయతీ సమితి 29 కిలో మీటర్లు, జిల్లా పరిషత్తు 55 కిలో మీటర్ల దూరం రోడ్లను నిర్మించాయి. రోడ్ల నిర్మాణం నిమిత్తం దాదాపు 100 ఎకరాల భూమిని భూస్వాముల నుండి పరిహారపు చెల్లింపు లేకుండా స్వీకరించారు. సమితిలోని కొన్ని గ్రామాలు మినహా దాదాపు అన్ని గ్రామాలలో మంచినీటి బావులను త్రవ్వారు. 38 పాఠశాల భవనాలను నిర్మించారు.

సమితిలోని అనేక గ్రామాలలో ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడంతో పాటు 110 ప్రాథమిక పాఠశాలలో 16 ప్రాథమిక పాఠశాలలను అప్పర్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చారు. దశాబ్దం క్రితం ఉన్నత పాఠశాల విద్య నిమిత్తం విద్యార్థులు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేది యిప్పుడు బ్లాకు ప్రాంతంలోనే 9 ఉన్నత పాఠశాలలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం క్రింద 50 కేంద్రాలలో ప్రతిరోజు 4340 మంది విద్యార్థులకు భోజనం ఏర్పాటుచేశారు. అందువల్ల బీద ప్రజలు తమ పిల్లలను పాఠశాలలకు పంపడానికి ప్రోత్సాహం లభించింది.

సహకార ఉద్యమం

గత దశాబ్దం కాలంలో సమితిలోని మారుమూల గ్రామాలకు సహితం సహకార ఉద్యమాన్ని విస్తరింపజేశారు. ఇప్పుడు సమితిలో 103 బహుళార్థ సాధక సహకార సంఘాలు ఉన్నాయి. రు. 3,04,610 ల పెట్టుబడితో 6776 మంది సభ్యులు వాటిలో ఉన్నారు. ప్రతి సంవత్సరం స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాల రూపంలో యీ సంఘాలు రు. 2 లక్షల మేరకు లావాదేవీలను నిర్వహిస్తున్నాయి.

1968 జూలై నుండి యీ సమితిలో తీవ్రతర ఏరియా అభివృద్ధి పథకాన్ని అమలు జరుపుతున్నారు. రు. 68_75 లక్షల ఖర్చుతో మూడు సంవత్సరాలపాటు యీ పథకాన్ని అమలు జరుపుతారు. ఇంతవరకు 508 కొత్త బావుల త్రవ్వకానికీ, 142 పాత బావుల మరమ్మతుకు, 524 ఆయిల్ ఇంజనులు, 116 విద్యుచ్ఛక్తి మోటార్లు, 161 రాహట్ల కొనుగోలుకు రు. 33,27,419 లు ఋణాలుగా యిచ్చారు. సమితిలోని అన్ని గ్రామాలకు మూడు సంవత్సరాల కాలంలో విద్యుచ్ఛక్తి సరఫరా చేసే ఉద్దేశంతో అమెరికా సహాయంతో గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా సంఘాన్ని ఏర్పాటు చేయడం సమితి కృషిలోని మరొక గమనార్హమైన ఘట్టం. ★

గ్రంథ ప్రకటన - ప్రభుత్వము

యర్రోజు శ్రీనివాసరావు

ఒకరి భావాలను మరొకరికి తెలియజేయడానికి ఉపయోగపడే సాధనం భాష. వాస్తవానికి ఈ ప్రపంచంలో వున్న ప్రతి జీవీ ఇతర జీవులకు తన భావాలను వ్యక్తం చెయ్యడం సహజం. జంతువులు, పక్షులు ధ్వనుల మూలంగానూ, చేష్టల మూలంగానూ తోటి జంతువులలో భావ వినిమయం జరపటం మనం నిత్యం చూస్తూవున్నదే. చంటి పిల్లలు, మూగవారు, అంగ విన్యాసం వల్ల తమ భావాలను వ్యక్తం చేస్తారు. అదే విధంగా స్థానిక భాషరాని అన్య ప్రాంతీయులు కూడా ఇదే రూపంలో భావ వ్యక్తీకరణ చెయ్యడం మనం గమనిస్తాం.

క్రమ పరిణామంలో భాషలు ఏర్పడ్డాయి. భాషోత్పత్తికి సంబంధించి ఈనాడు అనేకమైన వాదాలు ఉన్నాయి. అవశ్యకతను పురస్కరించుకొని భాషలు రూపు దాల్చినట్లు పైథాగరస్, మొదలైన స్వభావ వాదులు అభిప్రాయ పడ్డారు. సంకేతాలవల్ల భాష ఏర్పడిందని డెమిట్రియస్, అరిస్టాటిల్ మున్నగు సంకేత వాదులు భావించారు.

ఏమైనప్పటికీ భాష మానవులకు ప్రధానమైన భావ వ్యక్తీకరణ సాధనంగా వర్ధిల్లింది. ఈ నాడు ప్రపంచంలో ప్రజలు అనేక భాషలను ఉపయోగిస్తున్నారు. మొదట భాష లిపి సహాయం లేకుండానే పరిణామం చెందుతూ వచ్చింది. క్రమంగా భాషకు లిపి ఏర్పడింది. మెసపొటేమియా ప్రాంతంలో ప్రచారంలో వున్న సుమీరియన్ భాషకు గల లిపి అత్యంత ప్రాచీనమైనదని పరిశోధకులు తెలియ జేస్తున్నారు.

ఉప ఖండంగా ప్రశస్తి గాంచిన భారత దేశంలో కూడా పెక్కు భాషలు ప్రచారంలో వున్నాయి. లిపిలేని ఆదివాసీ భాషలు కూడా ఎన్నో వున్నాయి. అయితే మన భారత రాజ్యాంగం పద్నాల్గు దేశీయ భాషలను గుర్తించి వాటికి 8 వ షెడ్యూలులో స్థానం కల్పించింది.

ముద్రణ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందియున్న ఈ కాలంలో అన్ని భాషలలోనూ గ్రంథ ప్రకటన విస్తారంగా జరుగుతున్నది. కొయ్య దిమ్మల ద్వారా తొలి ముద్రణ చైనా దేశంలో ప్రారంభమై క్రమంగా జపాను, కొరియా ప్రాంతాలకు వ్యాపించింది. అయినప్పటికీ నేడు ముద్రణలో పాశ్చాత్య దేశాలదే పైచేయిగా వున్నది.

స్వాతంత్ర్యానంతరం

భారతదేశం స్వాతంత్ర్య సముపార్జన తరువాత ముద్రణ విషయంలో ఎంతో పురోగతి సాధించింది. ముద్రణాలయాలు ప్రతిదినం వేలాది గ్రంథాలను ముద్రిస్తున్నాయి. దేశంలోని గ్రంథ ప్రకటన సంస్థలు అనేక గ్రంథాలను వెలువరిస్తున్నాయి. భారతరాజ్యాంగంలో భావ ప్రకటన ఒక ప్రాథమిక హక్కుగా పొందు పరచుకున్నాం. అంత మాత్రం చేత గ్రంథ ప్రకటన విషయంలో ప్రభుత్వానికి ఎట్టి ప్రమేయం వుండరాదనే భావం కాదు.

వాస్తవానికి ప్రజల అభిప్రాయాలను తీర్చి దిద్దడంలో పత్రికల తరువాత ముఖ్యస్థానం వహించేది గ్రంథాలే. అందులోనూ అధిక సంఖ్యలో గ్రంథ ప్రచురణ సాగుతున్న ఈ రోజుల్లో, అక్షరాస్యత పెరిగిన ఈ రోజుల్లో గ్రంథాలు శక్తివంతమైనవని అంగీకరించక తప్పదు.

అంచేత ఈ సాధనం యొక్క స్వరూప స్వభావాలను ప్రభుత్వం ఎప్పటి కప్పుడు తెలుసుకొంటూ వుండడం మిక్కిలి ఆవశ్యకమని వేరుగా చెప్పనవసరంలేదు. ఇది భావ ప్రకటన స్వాతంత్ర్యానికి ఏవిధంగాను ప్రతి బంధకమైనదికాదు. పైగా ప్రజాభిప్రాయాన్ని తీర్చి దిద్దే ఈ సాధనం విషయంపై ప్రభుత్వం శ్రద్ధాసక్తులు ప్రదర్శించడం వారి కర్తవ్యం కూడా.

శాసనం

గ్రంథ ప్రకటనకు సంబంధించిన శాసనాలలో ప్రధానమైనది ముద్రణాలయాల, పుస్తకాల రిజిస్ట్రేషను చట్టం. దీనిని చాలా సంవత్సరాల క్రిందట—అంటే 1867 లో చేశారు, దీనిలో తరువాతి సంవత్సరాలలో కొన్ని మార్పులు జరిగాయి.

• పత్రికలు, పుస్తకాలను గురించి ప్రభుత్వానికి తాజా సమాచారం అందజేయడానికి వీలుకల్పించడమే ఈచట్టం ఉద్దేశం. ఇది కేంద్రచట్టం. అయినప్పటికీ ఆయా రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలే ఈ చట్ట నిబంధనలను అమలు పరుస్తాయి. రిజిస్ట్రారు అనే అధికారి ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు జరుపుతారు ఆయనకు జంటనగరాలలో పోలీసు కమిషనరు, జిల్లాలలో జిల్లా మాజిస్ట్రేట్లు తోడ్పడతారు. ఈ చట్టపునిబంధనల ద్వారా లభ్యమైన అధికారములను పురస్కరించుకొని మనరాష్ట్ర ప్రభుత్వం ఒక ఉత్తరువును జారీ చేసింది. దీని ప్రకారం ప్రతి ముద్రాపకుడు తన ముద్రణాలయంలో ముద్రించిన పుస్తకాల ప్రతులు మూడు పుస్తకాల రిజస్ట్రారు కార్యాలయానికి తప్పక పంపవలసి ఉంటుంది. పుస్తకాలతోపాటు ఆ ప్రచురణకు సంబంధించిన వివరాలు తెలిపే మెమోరాండంను ముద్రాపకుడు, ప్రచురణ కర్త కలిసి పంపవలసి ఉంటుంది. ఆ విధంగా పంపక పోవడం

ఈ చట్టం క్రింద శిక్షార్హమైన నేరం కాగలదు. ఈ విషయాన్ని ముద్రాపకులు తమ ముద్రణాలయం స్థాపించేటప్పుడే తెలుసుకోగలరు.

ముద్రాపకుడు తన ముద్రణాలయంలో ముద్రించిన పుస్తకాలను గురించి జిల్లా మేజిస్ట్రేటుకు నివేదికలను పంపాలి. తద్వారా జిల్లాలోని ముద్రణాలయాలందు ముద్రించిన పుస్తకాలను గురించి మేజిస్ట్రేటుకు సరైన సమాచారం లభించగలదు.

ప్రచురణలను గురించి సరైన సమాచారం సేకరించడం ఈ చట్టపు ఆశయాలలో ముఖ్యమైనది. పుస్తకాల రిజిస్ట్రారు తన కార్యాలయానికి అందిన పుస్తకాలు, నియత కాలిక పత్రికల వివరాలను పొందుపరుస్తూ మూడు మాసాల కొకసారి ఆంధ్రప్రదేశ్ గెజిటులో కేటలాగును ప్రకటిస్తారు. ఇది ఇతర రాష్ట్రాలలోని పుస్తకాల రిజిస్ట్రార్లకు వినిమయ పద్ధతిపై పంపబడుతుంది. గెజిటులో ఇదికూడా ఒక భాగం కాబట్టి రాష్ట్రమందలి ప్రభుత్వ కార్యాలయాలకు, స్థానిక సంస్థలకు కూడా వీటిని పంపుతారు. ఆ విధంగా ఇది బహుళ ప్రచారాన్ని పొందుతుంది.

ముద్రాపకుడు పుస్తకాలను మూడేసి ప్రతులలో పుస్తకాల రిజిస్ట్రారుకు పంపవలసి వున్నది. ఈ మూడు ప్రతులలో ఒక ప్రతిని పుస్తకాల రిజిస్ట్రారు కార్యాలయంలో ఉంచుతారు. మిగిలిన వాటిలో ఒక ప్రతిని హైదరాబాదులోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి, మరొకదానిని న్యూఢిల్లీలోని పార్లమెంటు గ్రంథాలయానికి పంపుతారు. పుస్తకాలను తెప్పించి రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి, పార్లమెంటు గ్రంథాలయానికి పంపే బాధ్యత పుస్తకాల రిజిస్ట్రారుపై వున్నది. ఈ సందర్భంలో మరొక ముఖ్య విషయాన్ని కూడా మనం గమనించవలసి వున్నది. ముద్రాపకులు, పుస్తకాల రిజిస్ట్రారుకు మూడు ప్రతులు పంపడంతోపాటు కలకత్తాలోని జాకీర్ గ్రంథాలయానికీ, మదరాసులోని కన్నెమెర పబ్లిక్ గ్రంథాలయానికీ, బొంబాయిలోని కేంద్ర గ్రంథాలయానికి ఒక్కొక్క ప్రతి చొప్పున పంపవలసి వున్నది.

ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ నాడు ఎన్నో ముద్రణాలయాలున్నాయి. రాష్ట్రమంతటా అనేక గ్రంథ ప్రచురణ సంస్థలు పని చేస్తున్నాయి. ముద్రాపకులు, ప్రచురణ కర్తలు ప్రభుత్వంతో పూర్తిగా సహకరించినప్పుడే ప్రభుత్వానికి సరియైన, సమగ్రమైన సమాచారం లభిస్తుంది. తద్వారా ప్రభుత్వానికి ప్రచురణల స్వరూప, స్వభావాల గురించి ఎప్పటికప్పుడు వాస్తవ సమాచారం అందుతుంది. ప్రజాస్వామిక సరళిపై పనిచేసే మన ప్రభుత్వంతో సహకరించడం, పైన తెల్పిన చట్టపు నిబంధనలను పాటించటం మన ముద్రాపకుల, ప్రచురణ కర్తల విధ్యుక్త ధర్మమైవున్నది. వారు, కర్తవ్యాన్ని గుర్తించి ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందజేయగలరని విశ్వసిద్దాం.

దక్షిణ ప్రాంతీయ పశువులు, కోళ్ల ప్రదర్శన

1971 జనవరిలో కాకినాడలో నాలుగు రోజుల వరకు అఖిల భారత దక్షిణ ప్రాంతీయ పశువులు, కోళ్ళ ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శన ప్రాంతీయస్థాయిలో జరుగుతుంది. కనుక ఇందులో ఒంగోలు, మాల్వి, కంగాయం, హల్లీకర్ దిమోని, మున్నగు జాతి పశువులు తమిళనాడు, కేరళ, మైసూరు, మధ్యప్రదేశ్‌ల నుంచి పాల్గొనగలవని ఆశింపబడుతున్నది. శ్రేష్ఠమైన జాతిపశువులకు ఆంధ్రప్రదేశ్ పేరుపొందింది. రైతులు ఈ మహదవకాశాన్ని వినియోగించుకొని తమవద్దనున్న శ్రేష్ఠమైన పశువులను ఈ ప్రదర్శనలో చేర్చవచ్చు. సంకరజాతి పశువుల ఉత్పత్తి విషయంలో జరిగిన ప్రగతిని ప్రత్యక్షంగా చూచి తెలుసుకొనవచ్చు. దూడలపై ప్రత్యేక శ్రద్ధ వహించబడుతుంది.

ఈ ప్రదర్శనలో పాల ఉత్పత్తి పోటీ నిర్వహింపబడుతుంది. పాల ఉత్పత్తిదారులు తమ ఆవులను, గేదెలను ఈ పోటీకి పంపవచ్చు.

పశు ప్రదర్శనతోపాటు ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు ప్రదర్శనశాలలను ఏర్పాటు చేస్తాయి. ఈ శాలలవల్ల ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో జరిగిన ప్రగతిని గురించి ప్రజలు తెలుసుకోవచ్చు. ఇతర వివరాలను కాకినాడలోని జిల్లా పశువైద్య శాఖాధికారి నుంచి తెలుసుకోవచ్చును.

31—8a

అందరికీ అందుబాటులో వున్న పౌష్టికాహారం

మోడరన్ బ్రెడ్

పౌష్టికాహారాన్ని ప్రజలకు సరసమైన ధరకు లభింప జేయాలని భారత ప్రభుత్వం చేస్తున్నకృషిలోభాగంగా మోడర్న్‌బేకరీలను దేశమందంతటా ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం లోపంవల్ల లక్షలాది భారతీయులు ఎన్నోజబ్బులకు గురికావడం అందరికీ తెలిసిన విషయమే. అందువల్ల వీరుతీసుకునే ఆహారంలో అధికంగా విటమినులు, మాంసకృత్తులు, ఖనిజలవణాలు వుండడం చాలా అవసరం. వీటిని సమకూర్చాలంటే నిత్యం తీసుకునే ఆహారంలో— ఏరొట్టెరూపంలోనో యీ విటమినులు తదితర పోషక పదార్థాలను అందజేయవచ్చు.

భారతదేశంలో రొట్టెల పరిశ్రమకు చాలా చక్కటి అవకాశాలు వున్నాయనీ, విటమినులు, ఖనిజలవణాలు మొదలైన పోషక పదార్థాలను రొట్టెరూపంలో అందజేయడం వల్ల పౌష్టికాహార లోపంవల్ల వచ్చే జబ్బులను నివారించవచ్చుననీ ఆస్ట్రేలియాలోని రొట్టెల పరిశోధక సంస్థ డైరెక్టరు ఎరిక్‌బాండ్ అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియా కెనడా ప్రభుత్వాలు కొలంబో ప్రణాళిక క్రింద ఆధునిక రొట్టెల తయారీ యంత్రాలను బహుమతిగా యివ్వడానికి సిద్ధపడడం వల్ల భారతప్రభుత్వం ముఖ్యమైన నగరాలలో రొట్టెల కర్మాగారాలను నెలకొల్పింది.

ఈ విధమైన కర్మాగారాలు యిప్పుడు బొంబాయి, కలకత్తా, మద్రాసు, ఢిల్లీ, అహమదాబాదు, కాన్పూరు, బెంగుళూరు, కొచ్చిన్, హైదరాబాదులలో పనిచేస్తున్నాయి. ఈ తొమ్మిది కర్మాగారాలూ కలిసి ఏడాదికి ఒక్కొక్కటి 400 గ్రాముల బరువుగల పదికోట్ల రొట్టెలను తయారు చేస్తున్నాయి. అంటే ఒకరొట్టెను ముగ్గురు పంచుకుంటే రోజుకి పదిలక్షలమందికి అదనంగా ఆహారం అందజేసినట్టు అవుతుంది. బొంబాయి, కలకత్తా నగరాలలోని కర్మాగారాలు 400 గ్రాముల బరువుగల రొట్టెలను రోజుకు 72,000 చొప్పున తయారుచేస్తున్నాయి. ఇతర ప్రాంతాలలోని చిన్న కర్మాగారాలు రోజుకు 36,000 రొట్టెల చొప్పున తయారు చేస్తున్నాయి. ఈ చిన్న కర్మాగారాల్ని ముందు ముందు అవసరమైనప్పుడు పెద్దవి చేసేందుకు వీలుంది.


ఆధునిక యంత్రాలతో చాలా ఆరోగ్యకరమైన పరిస్థితుల్లో మోడరన్ బ్రెడ్‌ను తయారుచేస్తారు. పిండిని యంత్రమే తీసుకొని వెళ్ళి నీళ్ళలో కలిపి ముద్దను తయారు చేస్తుంది. యంత్రాలద్వారా అది కలగలిపే యంత్రంలోకి పోతుంది. అక్కడ నుండి అచ్చుల్లోకి పోయి అన్నీ ఒకే మాదిరిగా రొట్టెల ముద్ద ఏర్పడుతుంది. దాన్ని కరెంటు గదుల్లో వేడిచేయగా రొట్టెలు తయారవుతాయి. యంత్రాలే వాటిని అందమైన కాగితంలో చుట్టుతాయి. రొట్టె చాలా కాలం నిలవవుండానికి వీలుగా పైచుట్టు కాగితం రూపొందించబడింది.


హైదరాబాదులోని కర్మాగారాన్ని కొలంబో ప్రణాళిక క్రింద కెనడా ప్రభుత్వం భారత దేశానికి బహుమతిగా యిచ్చింది. భారతీయ ఇంజనీర్ల తోడ్పాటుతో కెనడా సాంకేతిక వేత్తలు 1969 ఆగస్టులో ఈ కర్మాగారం యంత్రాలను నెలకొల్పారు. 1969 సెప్టెంబరు నుంచి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభమైంది. మన ఆపరేటర్లకు కెనడా సాంకేతిక వేత్తలు శిక్షణ యిచ్చారు. ఇప్పుడు దీన్ని పూర్తిగా మనవాళ్ళే నడుపుతున్నారు. హైదరాబాదు కర్మాగారం 400 గ్రాములు గల రొట్టెలను రోజుకు 36,000లను తయారుచేస్తున్నది. దీనిమీద సుమారుగా 40 లక్షలు పెట్టుబడి పెట్టబడింది. ఇక్కడివి అన్ని అత్యాధునిక ఆటోమేటిక్ యంత్రాలే.


ఇక్కడ తయారయ్యే రొట్టెలు "మోడరన్ బ్రెడ్" పేరున మార్కెట్టు చేయబడుతున్నాయి. హైదరాబాదు కర్మాగారంలో యిప్పుడు 800 గ్రా.లు 400 గ్రా.లు 200 గ్రా.లు బరువుగల వైట్ సేండ్‌విచ్ బ్రెడ్, 200 గ్రా.లు బరువుగల ఫ్రూట్ బ్రెడ్, 200 గ్రా.లు గల మసాలా బ్రెడ్ తయారవుతున్నాయి. త్వరలోనే తియ్యని బన్‌లను కూడా యిక్కడ తయారుచేస్తారు. హైదరాబాదులో అమ్మకాలు చేయడమే గాక విజయవాడ, వరంగల్లు, నిజామాబాదు, కర్నూలు, కడప, ఏలూరు, మహబూబునగర్, కొత్తగూడెంలలో ఏజంట్లను ఏర్పాటు చేసి రోజూ రొట్టెలను పంపించడం జరుగుతుంది. ఎనిమిదినెలల తక్కువ వ్యవధిలోనే యీ రొట్టెల అమ్మకాలు సుమారు 300 శాతం పెరిగాయి.


* * * * * * * *


1



4








మోడరన్ బ్రెడ్ కథ







1. రొట్టెల పిండి ముద్దను తయారుచేసే యంత్ర
2. పిండిముద్ద కావలసిన బరువుల్లో యంత్ర ద్వారా విభజించ బడుతుంది
3. పిండి ముద్దను గుండ్రంగాచేసి అచ్చులో పంపే యంత్రం
4. అచ్చులలో పిండి ముద్ద రొట్టెల రూప పొందే విభాగం
5. అచ్చులలోని పిండి ముద్దను వేడిచేసే విద్యుత్ ఛాంబర్
6. యంత్రం ద్వారా రొట్టెలను ముక్కలుగా కో కాగితంతో చుట్టే విభాగం

మహాభారతము

తెఱుపుగంటుల లక్ష్మీశాస్త్రి

పురోహితుడు జంతు బాలకుని హవిస్సుగాజేసి సోమకునితో యజ్ఞము చేయదలచెను. అట్టి తఱి తల్లులు పుత్ర ప్రేమచేత బాలకుని తమ వద్దకు లాగుకొనుచు దుఃఖించిరి. వారు ఆ బాలకుని కుడి చేతినిబట్టి తమ వైపు లాగుకొనుచుండగా పురోహితుడు ఎడమచేతినిబట్టి యీడ్చుచు ఆ బాలకుని ముక్కలు ముక్కలుగా ఖండించి అతని శరీరములోని వపను అగ్నిలో హోమము చేసెను. అప్పుడు హోమధూమమునుండి వపా గంధమును ఆఘ్రాణించి రాణులందరు పుత్రశోకముచేత భూమి పైన పడిపోయి కొంత సేపటికి తేరుకొనిరి. ఆ తరువాత వారందరు గర్భవతులై, పది మాసములు గర్భధారణముచేసి నూర్గురు పుత్రులను కనిరి. జంతు బాలకుడు తన తల్లి గర్భమునుండియే తిరిగి పుట్టెను. అతడందరిలోను జ్యేష్ఠుడు. రాణులు తమ పుత్రులకంటె అతని యెడల విశేష ప్రేమ కలవారైరి. అతనికి సువర్ణ చిహ్నము కుడి పార్శ్వమున ఉండెను. అందఱికన్న వయస్సులోనేకాక గుణములచేత కూడ అతడు జ్యేష్ఠుడుగా నుండెను.

తరువాత కొన్నాళ్ళకు సోమకుని పురోహితుడు, ఆ పిదప సోమకుడు మరణించి నరకమునకు పోయిరి. నరకములో అగ్నిలో తపించుచున్న తన పురోహితుని జూచి "మహాత్మా ఏల యిట్లు నరక బాధ ననుభవించుచున్నావు." అని అడిగెను. దానికి బదులుగా, పురోహితుడు నరకాగ్నిలో ఉడుకుచు, "రాజా నీవు నాచేత నీ పుత్రుని వధింప చేసితివి. ఆ పాపమును ఇట్లు అనుభవించుచున్నాను" అని చెప్పెను. అది విని సోమకుడు యమధర్మరాజుతో "ధర్మరాజా ఈ మహాత్ముడు నా కారణముగా బాలవధ చేసెను. ఆ పాపము నాదియే కాబట్టి యితనికి నరక బాధ నుండి విముక్తి కలిగించి నన్ను నరకాగ్నిలో వేయుము. నా గురువు రక్షింపబడు గాక" అని యనెను. దానికి యముడు "కర్మ ఫలమునను భవించవలసిన వాడు కర్తయే కాని ఇతరులెప్పుడును అనుభవించరు" అని చెప్పెను. ఆ మాటకు సోమకుడు "ధర్మరాజా! వేదవేత్తయగు నా గురువును నరకములో విడిచి పుణ్యలోకములకు నేను పోవను. స్వర్గమైనను నరకమైనను నేను ఇతనితోపాటే యుండ దలచుచున్నాను. నేను చేసిన పుణ్యములపైన నాకెంత అధికారమున్నదో యితనికిని అంతయే అధికారము కలదు. మా యిరువురి పుణ్య పాపములు యిరువురికి సమానముగానే జెందవలెను." అని చెప్పెను. ఆ మాటకు యమ ధర్మరాజు "రాజా! అట్లైనచో ఇతనితోపాటే నరక బాధను ఇంతదనుభవించి నన్నాళ్లు అనుభవించుము. ఆ తరువాత సద్గతిని పొందగలవు." అని చెప్పెను.

యమధర్మరాజు చెప్పిన మేరకే సోమక మహారాజు నరకములోనే ఉండి పాపము క్షీణించిన తరువాత గురువుతోపాటు నరక బాధనుండి విముక్తుడై తన పుణ్యములు కారణముగా తానార్జించిన పుణ్య లోకములకు గురువుతోపాటే పోయి అచ్చట సుఖముల ననుభవించెను.

లోమశుడు యుధిష్ఠిరునకు సోమకుని కథ చెప్పి "యీ ఎదురుగనున్నదే ఆ సోమకుని ఆశ్రమము. ధర్మరాజా! యిచట ఆరు రాత్రులు నివసించిన మానవుడు ఉత్తమ గతికి పోవగలడు. కనుక మనమిచట ఆరు దినములు నివసింతము." అని లోమశుడు చెప్పి తరువాత కథను పాండవులకు ఈ విధముగా చెప్పసాగెను :—

యుధిష్ఠిరా! పూర్వము ఈ చోటనే బ్రహ్మదేవుడు 'ఇష్టికృత' నామకమైన యాగమును వేయి సంవత్సరములు చేసెను. 'నాభాగ' పుత్రుడగు అంబరీషుడు ఇక్కడ యజ్ఞముచేసి సిద్ధుడయ్యెను. ఇది 'నహుష' పుత్రుడగు యయాతి దేశము. ఇక్కడ అతని యజ్ఞభూమి ఉన్నది. ఇక్కడనున్న అనేక వేదికలు యయాతి యజ్ఞవేదికలే. ఇక్కడ పరశురాముని యజ్ఞకుండము, నారాయణుని ఆశ్రమము ఉన్నవి. ఋచీకపుత్రుడగు జమదగ్ని సంచరించు తీర్థముగూడ నిచటనే రౌప్యా నదీతీరమునన్నది.

ధర్మరాజా! ఈ తీర్థమును గూర్చి పరంపరగా వచ్చుచున్న ఒక కథను చెప్పెదను వినుము; "పూర్వము ఒకానొక స్త్రీ తన పుత్రునితో ఈ తీర్థమునందు నివసించుటకు వచ్చి యుండెను. అక్కడ ఉన్న ఒక భయంకర పిశాచ స్త్రీ ఆమెతో నిట్లనెను. "ఓసీ నీవు యుగంధర దేశమునందు పెరుగు త్రాగి అచ్యుతనే స్థల గ్రామమునందు నివసించి 'భూతలయ' గ్రామమునందు స్నానము చేసితివి. అట్టి నీకు ఇక్కడ పుత్ర సహితముగా నివసించుటకు అధికారము ఎట్లు కలుగును? ఒకవేళ ఒకరాత్రి నివసించినను నివసించుదువు గాక. రెండవరాత్రి కూడ నివసింపదలచినచో నీవింతకన్న ఎక్కువ కష్టము ననుభవించెదవు." అని చెప్పెను.

[యుగంధర దేశ వాసులు ఒంటె మఱియు గాడిద పెరుగు త్రాగెదరు. ధర్మ శాస్త్రములో ఒంటె మఱియు ఒకటే గిట్టగల జంతువుల పాలు త్రాగుట సురాపానముతో సమానము అని చెప్పబడినది. దీనికి ప్రమాణము 'ఔష్ట్రమే కశఫమ్ క్షీరం సురాతుల్యమ్' అని యున్నది.

అచ్యుత స్థల గ్రామమునందు వర్ణ సంకర జాతివారు, చండాలురు నివసించుచుండిరి. ధర్మ శాస్త్రములో వర్ణసంకర జాతులతో సంబంధము కలవారు "ప్రాజాపత్యము" అను వ్రతమును ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. దీనికి ప్రమాణము—'సంస్వజ్య సంకరై స్సార్థం ప్రాజాపత్యం వ్రతం చరేత్' అని ప్రాజాపత్య వ్రతమనగా – మూడు దినములు ఉదయము. మూడు దినములు సాయంత్రము, మూడు దినములు అయాచితముగా లభించిన అన్నమును తినవలెను. ఆ తరువాత మూడు దినములు ఏమియు తినకుండ నుండవలెను. ఈ విధముగా క్రమముగా ఒక సంవత్సరము త్రిప్పి త్రిప్పి చేయు వ్రతమునకు 'ప్రాజాపత్యవ్రత'మని, పేరు. ఇది మానవుడు చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తముగా అనుష్ఠించబడును భూత లయమను గ్రామము చోరులకు, దోపిడి గాండ్రకు నివాసస్థానముగా నుండెను. అక్కడ ఒక నది యుండెను. ఆ నదీ ప్రవాహములో శవములు కొట్టుకొని పోవుచుండెను. ధర్మ శాస్త్రములో, ఆ గ్రామములో నివసించి ఆ నదిలో స్నానము చేసినవారు ప్రాజా పత్యవ్రతము ప్రాయశ్చిత్తముగా చేయవలెనని చెప్పబడియున్నది. దీనికి ప్రమాణము—ప్రోష్యభూతలయే విప్రః ప్రాజాపత్యం వ్రతంచరేత్" అని యున్నది.]

పై ఉపాఖ్యానమువలన పాపిష్ఠులకు ఈ చోటు నివసించుటకు అర్హము కాదు అని తెలియుచున్నది. కనుక ధర్మరాజా! యిక్కడ మనము నివసించి విశేష పుణ్యమును సంపాదించుకొందము. ఇది కురు క్షేత్రమునకు ద్వారము. ఈ ప్రాంతముననే యమునా నది యొక్క "ప్లక్షావతరణము" అను తీర్థము కలదు. ఇది స్వర్గద్వారము. అనేక మహర్షులు ఇచట యజ్ఞములు చేసిరి రాజా! ఈ తీర్థమునందు పూర్వము భరతుడను రాజు అనేక యాగములు, అశ్వమేధ యాగము చేసెను. ఇచటనే "సంవర్త"మునిని ఆశ్రయించి 'మరుత్త' రాజు యజ్ఞానుష్ఠానము చేసెను. కనుక యుధిష్ఠిరా! ఇచట స్నానముచేసిన వారు సమస్త లోకములను ప్రత్యక్షముగా చూడగలరు. సర్వపాప విముక్తులై పవిత్రులగుదురు. కనుక నీవు ఇచట కూడ స్నానము చేయుము."

ఆ మాటలు విని ధర్మరాజు లోమశునితో "మహాత్మా! నీ దయచేత నేను ఈ ప్లక్షావతరణ జలమందు ఉండి అన్ని లోకములను ప్రత్యక్షముగా చూచుచున్నాను. ఇక్కడ నుండియే నాకు స్వర్గమునందున్న అర్జునుడు కనబడుచున్నాడు." అని చెప్పెను తరువాత లోమశుడు సరస్వతీ నదిని చూపించి ధర్మరాజుతో "రాజా! ఇచ్చట స్నానము చేసినచో సమస్త పాపముల నుండి విముక్తుడవయ్యెదవు ఎందరో దేవర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు ఇచట సారస్వత యజ్ఞములు చేసిరి. ఇచట ఐదు యోజనముల విస్తీర్ణముగల ప్రజాపతి యొక్క యజ్ఞవేదిక కలదు. దీని యందు పూర్వము కురు రాజు యజ్ఞము చేసెను. ఇచట మరణించిన మానవులు స్వర్గ సుఖమనుభవించెదరు. మరణాసన్నులైన మనుష్యులు వేల సంఖ్యలో నిచటికి వచ్చెదరు. ఇచ్చట మరణించిన వారికి స్వర్గ సుఖము కలుగునని పూర్వము దక్ష ప్రజాపతి చెప్పెను ఇది సరస్వతీ నదియొక్క "వినశనము" అను పేరుగల తీర్థము ధర్మరాజా! ఇది నిషాదరాజ్యమునకు ద్వారము. ఇచ్చట నిషాదుల యొక్క (కిరాతులు) స్పర్శదోషము తనకు కలుగ కూడదని సరస్వతీ నది భూమి లోపలికి వారికి కనుపడకుండుటకై ప్రవేశించెను ఆ తరువాత కనపడునదియే "చమసోద్భేద" తీర్థము. అచ్చట సరస్వతీనది మరల ప్రకటితమై కనబడెను. ఈ ప్రక్కన నున్నది 'సింధు' తీర్థము ఇచట లోపాముద్ర అగస్త్యుని వరించెను. ఇచటనే 'ప్రభాస' 'విష్ణుపద' తీర్థములున్నవి ఈ ప్రక్కన పరమపావనియైన 'విపాశా' నది ప్రవహించుచున్నది. పూర్వము వసిష్ఠుడు పుత్రశోకము భరించజాలక తనను పాశములతో బంధించుకొని ఈ నదిలో పడగా నది అతని పాశములను త్రెంచి అతనిని పైకెత్తెను. అందుచేత దీనికి 'విపాశ' అని పేరు వచ్చినది. ఆ తరువాత పుణ్యప్రదమైన కాశ్మీర దేశము కలదు. ఇచట ఋషులకు అగ్నికి, కౌశ్యపునకు, యయాతికి పూర్వము సంవాదము జరిగెను ఇచట కొంత దూరమున మానససరోవరము కలదు. ఇచటి పర్వతమునందు పరశురాముడు తన ఆశ్రమమును నిర్మించుకొని యుండెను ఇది పరశురాముని ఆశ్రమద్వారము, దీనిని వాయువు గూడ అతిక్రమింపజాలడనగా యితరుల మాట చెప్పనేల.

ధర్మరాజా: ఇచటనొక ఆశ్చర్యకరమైన విషయముగలదు ఇచట నివసించువారికి భగవంతుడైన శంకరుడు పార్వతీ సహితుడై ప్రమథగణములతో దర్శనమిచ్చును ఈ సరస్సు తీరమునందు చైత్రమాసమున అనేక యజ్ఞముల ద్వారా పరమేశ్వరుని ఆరాధించెదరు ఈ సరోవరమునకు 'ఉజ్జానకము' అను పేరు కలదు. ఇచట కుమారస్వామియు, అరుంధతితో వసిష్ఠుడును తపస్సాధనచేసి సిద్ధిని, శాంతిని పొందిరి.

ఇదిగో ఇక్కడ కనబడునది 'కుశవాన్' అను కొలను. ఇక్కడ కమలములు సర్వదా వికసించియుండును. ఇది రుక్మిణీ దేవియొక్క ఆశ్రమము. ఆమె యిచ్చట క్రోధమును జయించి శాంతిని పొందెను ఇకపైన నీవు ధర్మరాజా: 'భృగుతుంగము' అను పేరు గల గొప్ప పర్వతమును చూచెదవు. దానిచేత నీకు తపస్సమాధి రూప ఫలము కలుగును ఈ ప్రాంతముననే 'వితస్తా' నది ఉన్నది. యమున యొక్క రెండుతటములందు 'జల' 'ఉపజల' అను రెండు ఉపనదులు ప్రవహించుచుండును

అచట పూర్వము 'ఉశీనరుడు' అను రాజు యజ్ఞముచేసి ఇంద్రునికన్న ఉన్నతస్థానమును పొందెను. ధర్మరాజా! అట్టి ఉశీనరుని మహాత్మ్యమును తెలిసికొనుటకు అతడు చేయు యజ్ఞమునందు ఇంద్రుడు డేగరూపమును, అగ్నిపావురము రూపమును ధరించిపోయిరి పావురము డేగవలన భయముచేత ఆ రాజును శరణమువేడి అతని ఒడిలోదూరి దాగుకొనెను.

అప్పుడు డేగకు ఉశీనరునకు ఈ విధముగా సంవాదము జరిగెను:—

డేగ:— రాజా! దేశములో రాజులందరు నీవొకడవే ధర్మాత్ముడవని చెప్పుచున్నారు. అట్టి నీవు ఈ ధర్మవిరుద్ధమైన కార్యమును ఎందుకు చేయదలచుచున్నావు. నేను ఆకలిచే బాధపడుచున్నాను. పావురము నాకు దైవము నిర్ణయించిన ఆహారము. నీవు ధర్మమునందలి ఆశచే దీనిని రక్షించకుము. నీవు దీనికి ఆశ్రయమిచ్చి వాస్తవముగా ధర్మమును పరిత్యజించుచున్నావు.

ఉశీనరుడు:— పక్షిరాజా! ఈ పావురము నీకు భయపడి ప్రాణరక్షణ కొరకై నన్ను ఆశ్రయించినది. అభయమును కోరు దీనిని నీకు ఒప్పగించకుండుటయే పరమ ధర్మము. అయ్యో! ఈ పావురమును చూడుము. భయకంపితయై వణకుచున్నది. ఇట్టి దీనిని నేను విడిచినచో అన్యాయముకాదా. లోకములో బ్రాహ్మణుని, జగన్మాతయగు గోవును హత్య చేయువాడును, తనను శరణువేడిన వారిని విడిచిపెట్టువాడును, సమానమైన పాపమును అనుభవించెదరు.

డేగ:— రాజా! ఆహారమువలననే సమస్త జంతువులు పుట్టుచున్నవి, వృద్ధిపొందుచున్నవి, జీవించుచున్నవి. కనుక ఆహారము విడచుట చాల కష్టము. నీవు నా భోజనమును లాగుకొంటివి. అందువలన నేను మరణించెదను. ఆ తరువాత నా భార్యాపుత్రాదులు నశించెదరు. కనుక నీవు ఒక్క పావురమును రక్షించుటచేత ఇందఱి ప్రాణములను నశింపజేయుచున్నావు. రాజా! ఒక ధర్మమును బాధించు మఱియొక ధర్మము అధర్మమే అగును. ఇతర ధర్మములను బాధించిన ధర్మమే వాస్తవికధర్మము. పరస్పర విరుద్ధములైన ధర్మములలో గురులాఘవములను విచారించి యితరులకు బాధ కలిగించని ధర్మమును ఆచరించవలెను. ధర్మాధర్మములు నిర్ణయించుపట్ల అందలి పుణ్యాపాపములయొక్క గురులాఘవ విచారముచేయవలెను. అధిక పుణ్యప్రదమైన ధర్మమునే ఆచరించుట యోగ్యమగును.

ఉశీనరుడు:— పక్షిరాజా! నీ మాటలు చాల యోగ్యములుగా నున్నవి. నీవు గరుడపక్షివి కాదుగదా. గొప్ప ధర్మజ్ఞుడవనుటలో సందేహములేదు. నీవు చెప్పుమాటలు అతి విచిత్రముగను ధర్మసంగతముగను ఉన్నవి. నీకు తెలియని విషయమేలేదని నాకు తోచుచున్నది. అయినను శరణాగతుని విడిచిపెట్టుట మంచి కార్యమని నీవు ఎందుకు తలచుచున్నావో నాకు అర్థమగుటలేదు. నీ ప్రయత్నము కేవలము భోజన సంపాదనవరకే పర్యాప్తమై యున్నదిగదా! నీ ఆహారము మరియొక విధముగ కూడ నేను సంపాదించి యివ్వగలను. అది ఈ పావురమునకన్న అధికము కావచ్చును. వరాహము, హరిణము, మహిషము మొదలైన పశువులలో దేనినైన కోరుకొనుము, దానిని ఇచ్చెదను.

డేగ:— రాజా! నేను వరహాది పశువులను వేనినికూడతినను నాకు ఇతర జంతువులు అక్కఱలేదు. బ్రహ్మదేవుడు నా కొరకు నియమించిన ఆహారము పావురమే. కనుక దీనినే నాకు విడువుము. డేగ పావురమును ఆహారముగా గొనుట ప్రాచీన కాలమునుండి వచ్చిన ఆచారము. కనుక రాజా! నీవు సారభూతమైన ధర్మమును తెలిసికొనక అరటిస్తంభము వలె అసారమైన ధర్మమును ఎందుకు ఆశ్రయించెదవు?

ఉశీ:— పక్షిరాజా! నేను సంపన్నమైన ఈనా 'శిబి' రాజ్యమును నీకు అర్పించెదను. ఇది గాక నీ యిష్టమైన వస్తువును దేనినైనను ఇచ్చెదను. నేను నీ కొరకు ఏ కార్యములు చేసినచో ఈ పక్షిని నీవు విడిచెదవో ఆ పనులన్నియు చేసెదను. కాని నా శరణుజొచ్చిన ఈ పావురమును మాత్రము విడువను.

డేగ:— ఉశీనరమహారాజా! నీకు ఈ పురము యింతటి ప్రేమ ఉన్నచో దీనితో సమానమైన తూకముగల మాంసమును నీ శరీరమునుండి కోసి తూచి యిమ్ము. దానివలన నాకు తృప్తి కలుగును.

ఉశీ :— పక్షిరాజా! నాపైన నీకు చాల దయగలిగినదని భావించెదను." ఇప్పుడే నా మాంసమును కోసి తులలో పెట్టి తూచి యిచ్చెదను. అనిచెప్పి ఉశీనరుడు తన శరీరమునుండి మాంసమును కోసి పావురముతో సమానముగా తూచి యిచ్చెను. కాని తులలో రెండవవైపునందుంచబడిన పావురము అతని మాంసము కంటె తూకములో అధికముగా నుండెను. అతడు తన శరీరము నుండి ఎంత మాంసమును కోసి యిచ్చినను పావురముతో సమానము కాక పోయినది. అపుడు తానే స్వయముగా తులలో కూర్చొనెను. అది చూచి డేగ సంతసించి యిట్లనెను; ధర్మాత్మా ! నేను ఇంద్రుడను. ఈపావురము అగ్నిదేవుడు. నీ ధర్మమును పరీక్షించుటకై ఈ యజ్ఞశాలకు వచ్చితిమి. రాజా! నీశరీరమునుండి మాంసమును కోసియిచ్చి నీవుప్రపంచములో గొప్ప కీర్తి సంపాదించితివి. ప్రపంచములో నీకీదైన వ్యక్తి మరియొకడు లేడు. నీపేరు నీకీర్తి శాశ్వతముగా లోకములో నిలిచియుండగలదు." అనిచెప్పి యింద్రాగ్నులు దేవలోకమునకు పోయిరి. ధర్మాత్ముడగు ఉశీనరుడు కూడ భూమ్యాకాశములలో వ్యాపించిన తనధర్మముచేత దేదీప్యమానమైన శరీరమును ధరించి స్వర్గలోకమునకు పోయెను.

ధర్మరాజా! యిది ఉశీనర మహారాజు యొక్క ఆశ్రమము. దీని దర్శనముచేత నీ సమస్త పాపములు పోయి నీవు పుణ్యము సంపాదించవచ్చును. కనుక నీవు నాతోబాటు ఈ ఆశ్రమమును దర్శించుము. ఈ ఆశ్రమనివాసులైన బ్రాహ్మణులకు సర్వదా దేవతలు, మునులు దర్శనమిచ్చుచుందురు.

అష్టావక్రోపాఖ్యానము

లోమశుడిట్లు చెప్పెను :— "యుధిష్ఠిరమహారాజా : 'ఉద్దాలకునకు' 'శ్వేతకేతువు' అను పుత్రుడుండెను. అతడు మంత్రశాస్త్రములో నిపుణుడు. ఈ ఆశ్రమము అతనిదే. దీనియందు శ్వేతకేతువు మానవ స్త్రీ రూపము ధరించివచ్చిన సరస్వతీ దేవిని ప్రత్యక్ష్యముగా దర్శించి 'దేవీ ! వాణీస్వరూపిణివైన

నీతత్త్వమును యథార్థముగ తెలిసికొనదలచుచున్నాను' అని అడిగియుండెను. అట్లు సరస్వతీదేవిని ప్రత్యక్షముగా దర్శించ గల్గిన సామర్థ్యము శ్వేతకేతువునకు ఉండెను.

ఆ కాలములో 'కహోడ' ముని పుత్రుడగు అష్టావక్రుడు, శ్వేతకేతువు ఆ యిరువురు మహర్షులు సమస్త ప్రపంచములోని వేదవేత్తలలో శ్రేష్ఠులుగనుండిరి. ఉద్దాలకుని మేనమామ శ్వేతకేతువు. ఒకప్పుడు ఆ యిరువురు విదేహ రాజగు జనకుని యజ్ఞమండపములోనికి పోయి అచట మహాపండితుడుగా నున్న 'బంది' అను విద్వాంసుని శాస్త్రవాదములో ఓడించిరి. అష్టావక్రుడు శాస్త్రవాదమునందు మిక్కిలి సమర్థుడుగ నుండెను. బాల్యదశలోనే జనకమహారాజు యొక్క యజ్ఞమండపములోనికి పోయి అచ్చటి శాస్త్ర వాదములో తన ప్రతివాదులను ఓడించి వారిని నదిలో పడవేయించెను. అట్టి మహిమగల అష్టావక్రుని ఆశ్రమమిది. ఈ ఆశ్రమములో ప్రవేశించి నీవు భగవచ్చింతన చేయుము."

లోమశుని మాటలువిని యుధిష్ఠిరుడు. "మహాత్మా ! 'బంది' వంటి గొప్పపండితుని గూడ జయించగలిగిన బ్రహ్మర్షియగు అష్టావక్రుని మహిమ యెట్టిది. అతడు ఏకారణముచేత అష్టావక్రుడు [8 అవయవములు వంకరగా నుండువాడు] అయ్యెను. అనుగ్రహించి తెలుపుము" అని యడిగెను. దానికి లోమశుడు ఆ కథను ఇట్లు చెప్పదొడగెను;—

"ధర్మరాజా? ఉద్దాలక మహామునికి 'కహోడ' నామకుడగు ఒక శిష్యుడుండెను. అతడు మిక్కిలి నియమనిష్ఠలతో గురుసేవ చేయుచు గుర్వాజ్ఞతో మెలగుచు చాలకాలము విద్యాభ్యాసము చేసెను. అతని గురుభక్తికి, విద్యయందలి శ్రద్ధకు సంతుష్టుడై ఉద్దాలకుడు త్వరలోనే సమస్త వేదశాస్త్రములను అతనికి నేర్పి తన పుత్రియగు 'సుజాత' ను అతనికి నిచ్చి వివాహము చేసెను. కొంత కాలమునకు సుజాత గర్భవతియయ్యెను. గర్భస్థ శిశువు అతితేజస్విగా నుండెను. ఒకనాడు వేదాధ్యయనము చేయుచున్న తండ్రిని ఆ శిశువు "తండ్రీ ! మీరు రాత్రి యంతయు వేద పాఠము చేయుచున్నప్పటికిని మీ వేదమంత్రోచ్చారణము శుద్ధముగా లేదు" అని చెప్పెను. శిష్యులమధ్య కూర్చున్న కహోడముని గర్భస్థశిశువు చేసిన ఈ నిందను సహించక అవమానపడి కోపముతో "అరే బాలకా ! గర్భములోనుండగనే యిట్టి వంకర మాటలు మాట్లాడుచున్నావు కనుక నీశరీరములో ఎనిమిది అవయవములు వంకరగానగు గాక" అని శపించెను. అందువలన యవయవములు వంకరలై యతనికి 'అష్టావక్రుడు' అను పేరు వచ్చెను. అతని మేనమామయగు శ్వేతకేతువు అతనితో సమానమైన వయస్సు కలవాడుగానే యుండెను.

గర్భ భారముచేత బాధపడుచున్న సుజాత భర్తతో ఏకాంతమునందు "మహాత్మా ! నాకిపుడు పదవమాసము నడచుచున్నది. దరిద్రులమగు మనము ఎట్లు ప్రసవవ్యయమును భరించగలము ?" అనియనెను. ఆ మాటవిని కహోడముని ధనార్థియై జనకమహారాజు సభకు పోయెను. అప్పుడు ఆ సభలోనున్న బంది అను పండితుడు కహోడమునిని శాస్త్రవాదములో ఓడించి నదిలో ముంచెను. దాని వలన అతడు మరణించెను.

ఈ విషయము తెలిసిన ఉద్దాలకముని తన కూతురగు సుజాతకు ఆ సమాచారము తెలిపి "బిడ్డా! ఈ సంగతి నీ పిల్లవానికి తెలుపక రహస్యముగానుంచుము" అని చెప్పెను. సుజాత ఆ విషయము కొడుకుకు తెలుపలేదు. అష్టావక్రుడు తన మాతామహుడగు ఉద్దాలకుడే తన తండ్రి యనియు, మేనమామయగు శ్వేతకేతువు తన సోదరుడనియు భావించుచుండెను.

12 సంవత్సరముల వయస్సులో ఉద్దాలకుని యొడిలో కూర్చున్న అష్టావక్రునిచూచి శ్వేతకేతువు "మాతండ్రి వడిలో కూర్చునుటకు నీకు అర్హత లే"దని అతనినిలాగెను. శ్వేతకేతువు యొక్క కఠినభాషణము అష్టావక్రుని హృదయమునందు శల్యము వలె గ్రుచ్చుకొని దుఃఖించుచు తల్లివద్దకుపోయి "నా తండ్రి ఎక్కడనున్నాడు" అడిగెను. అదివిని తల్లి యథార్థము చెప్పనిచో నీ బాలకుడు తనను శపించునను భయముచే జరిగిన సంగతి యంతయు చెప్పెను. ఈ రహస్యముతెలిసిన తరువాత అష్టావక్రుడు ఆ రాత్రి శ్వేతకేతువుతో నిట్లనెను:—


"మనమిరువురము జనకరాజు చేయు యజ్ఞమునకుపోవుదము. అక్కడ ఆశ్చర్యకరములైన విషయములెన్నియో మనకు కనబడునని వినుచున్నాను. మనము అచటి పండితుల శాస్త్రార్థమును వినెదముగాక. అక్కడికి పోవుటచేత మనకు వక్తృత్వ శక్తి, పరిజ్ఞానము పెరుగుటయేగాక అచట మధుర స్వరముతో గానము చేయబడు వేదపాఠములు కూడ వినుటకు అవకాశము లభించగలదు."

ఆ మాటలకు శ్వేతకేతువు అంగీకరించెను. ఇరువురు కలిసి జనకు యజ్ఞమునకు పోయిరి, యజ్ఞశాలకు పోవుత్రోవలోనే అష్టావక్రునకు రాజు ఎదురుపడెను. అపుడు రాజసేవకులు అతనిని త్రోవనుండి దూరముగా త్రోయదొడగిరి. అపుడు అష్టావక్రుడు రాజుతో నిట్లనెను "రాజా! బ్రాహ్మణుడు ఎదురుగా రానంత వరకు అంధునకు, బధిరునకు, స్త్రీకి, బరువుమోయు వానికి, రాజునకు తొలుత మార్గము విడువవలయును. కాని బ్రాహ్మణుడు ఎదురుగా వచ్చినచో అందరికన్న మొదట అతనికే త్రోవ విడువవలెను" అని చెప్పెను. అప్పుడు ఆయిరువురకు సంవాదము జరిగెను.

(సశేషము)

పశ్చిమ గోదావరి జిల్లాలో

కొత్త పరిశ్రమలకు గల అవకాశాలు



రబ్బరు పీచు

రబ్బరును కరిగించి పీచుతోకలిపి తయారుచేసిన రబ్బరు పీచును రబ్బరు ఫోమ్ బదులు వాడవచ్చును.

ఈ జిల్లాలో కొబ్బరి పీచు విస్తారంగా లభిస్తున్న దృష్ట్యా యీ పరిశ్రమను అభివృద్ధి పరచడానికి అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

రబ్బరుపీచును తయారుచేసేవాళ్ళు యీజిల్లాలో ఎవరూలేరు.

ఏటా మన రాష్ట్రంలో రబ్బరు ఫోమ్‌ను రూ. 5 లక్షల మేరకు వాడుతున్నారు.

ఫోమ్ రబ్బరు తయారు చేసే వాళ్ళనుంచి యీ రబ్బరు పీచు తయారీ దార్లకు పోటీ వున్నప్పటికీ రబ్బరు పీచు నాణ్యం, మన్నిక ఎక్కువ గనుక తట్టుకోగలదనే భావించవచ్చు.

గడ్డితో చేసిన బోర్డులు

ఈ జిల్లాలో వరిగడ్డి విస్తారంగా లభిస్తుంది.

గడ్డితో బోర్డులు చేయడానికి ఈ వరిగడ్డిని ఉపయోగించవచ్చు.

గడ్డితో చేసిన బోర్డులకు మంచి గిరాకీవుంది.

ఏటా ఈ జిల్లాలో రూ. 1.75 లక్షల ఖరీదు చేసే కార్డు బోర్డు వుపయోగించ బడుతోంది.

ఈ విధమైన బోర్డులకు గిరాకీ బాగుంది. పైగా దీనికి కావలసిన ముడి పదార్థాలు యిక్కడ విస్తారంగా లభిస్తాయి. అందువల్ల యీ బోర్డులను తయారు చేసే యూనిటును నెలకొల్పవచ్చును.

జిగురు

తోళ్ళు శుద్ధి చేసే చోట మిగిలిన జంతు శరీరం నుంచి పనికి రాని పదార్థాలతో తయారయ్యే జిగురు తయారు చేయవచ్చు. కాగితాలు మొదలలైనవి అతికించడానికి ఇది బాగా వుపయోగపడుతుంది.

ఏలూరులోని తోళ్ళ శుద్ధి కేంద్రాలలో లభించే యీ పనికి రాని పదార్థాలు జిగురు తయారు చేయడానికి ముఖ్యమైన ముడి పదార్థాలుగా వుపయోగిస్తాయి.

కలప చెక్క పరిశ్రమల్లోనూ, పుస్తకాల బైండింగులోనూ జిగురు ఎక్కువగా కావలసి వుంటుంది.

ఏలూరులో యిటువంటి యూనిటును ఒకదానిని నెలకొల్పుకోవచ్చు.

పళ్ళ నిలువ పరిశ్రమ

పచ్చడులు, పండ్లరసం పాకాలు, ముద్దలు మొదలైన రూపంలో పళ్ళను నిలువ చేయవచ్చు.

ఇలా నిలువ వుంచిన వాటికి దేశమంతటా మంచి మార్కెటు ఉంది.

ఈ జిల్లాలో అరటి పళ్ళు, మామిడి పళ్ళు, దబ్బపళ్ళు విస్తారంగా పండుతాయి.

క్రిమిసంహారక మందులు

మొక్కల సంరక్షణకై క్రిమి సంహారక మందులకు యీ జిల్లాలో బాగా గిరాకీ వుంది.

లఘు పరిశ్రమ క్రింద క్రిమి సంహారక మందులను తయారు చేయవచ్చు.

వ్యవసాయ రంగంలో అభివృద్ధిని సాధించడానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తున్న దృష్ట్యా ముందు ముందు యీ విధమైన క్రిమి సంహారకాలకు గిరాకీ బాగా పెరిగే అవకాశం వుంది.

ఈ జిల్లాలో క్రిమి సంహారక మందుల్ని తయారు చేసే యూనిట్లను నెలకొల్పడానికి అవకాశాలు బావున్నాయి.

డబ్బాలలో రొయ్యల నిల్వ

అన్ని ప్రాంతాలలోనూ తాజా రొయ్యలు లభించడం కష్టం గనుక సీలువేసిన డబ్బాలలో రొయ్యలను సరఫరా చేయడం యీ రోజులలో సర్వసాధారణమై పోయింది.

ఈ జిల్లాలోని కొల్లేరు, ఉప్పుటేరుప్రాంతాలలో రొయ్యలు విస్తారంగా లభిస్తాయి. సీలు వేసిన డబ్బాలలో రొయ్యల ఎగుమతికి మంచి మార్కెటు వుంది.

4. జిల్లాలో యీ పరిశ్రమలను నెలకొల్పడానికి అవకాశాలు విపరీతంగా వున్నాయి.

గ్రాఫైట్ శుద్ధి

ఈ జిల్లాలో గ్రాఫైట్ మట్టి నిధులు విస్తారంగా వున్నాయి.

ఇక్కడ లభించే గ్రాఫైట్‌లో మలినాలు చాలా చేరి వున్నాయి. దీనిని శుద్ధి చేసినప్పుడు అనేక వస్తువులను దీనితో తయారు చేయవచ్చు.

శుద్ధి చేసిన గ్రాఫైట్ మట్టిని రాజ మండ్రిలోని మూసల తయారీ పరిశ్రమలో వుపయోగించవచ్చు.

అద్దకం సామగ్రి

ఉన్ని తివాసీలను తయారు చేసేవారు, చేనేత పారిశ్రామికులూ అద్దకం సామగ్రిని వాడుతారు.

ఈ అద్దకం రంగులను ఇప్పుడు బైటి కేంద్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

ఈ రాష్ట్రంలో చేనేత పారిశ్రామికులు అధికంగా వుండడం వల్ల ఇక్కడ అద్దకం సామగ్రికి మంచిగిరాకీ వుంది.

ఈ ప్రాంతంలో వీటిని తయారుచేసే పరిశ్రమను ఏర్పాటు చేయడానికి మంచి అవకాశాలువున్నాయి.

చెరకు మైనం

ఇది చక్కెర ప్రాసెసింగ్ పరిశ్రమలో అనుబంధ ఉత్పత్తి చెరకుమైనం అనేది కొత్తగా వాడుకలోకి వచ్చిన పదార్థం.

ఇప్పుడిప్పుడే దీని అవసరాన్ని వినియోగదారులు గుర్తిస్తున్నారు.

ముడిపదార్థాలను రవాణాచేయడంలో ఎదురయ్యే యిబ్బందులను అధిగమించడానికై యీ పరిశ్రమని చక్కెర మిల్లులకు దగ్గరగా ఏర్పాటుచేయవలసి వుంటుంది.

ఈ పరిశ్రమని నెలకొల్పేముందు దీనిపై పెట్టాల్సిన ఖర్చు, వచ్చే ఆదాయం మొదలైనవి లెక్కవేసి చూసుకోవలసివుంటుంది.

హోల్డాల్‌లు

వర్తక వ్యాపారాలు అభివృద్ధిచెందడంవల్ల ప్రజల ప్రయాణాలు కూడఎక్కువై హోల్డాల్‌లకు గిరాకీ ఏర్పడింది.

వీటిని తయారుచేసే యూనిటు ఒక్కటికూడా యిప్పుడు యీ జిల్లాలోలేదు.

ఇప్పుడు వీటికిగల మార్కెటును బట్టిచూస్తే ముందుముందు మరీ ఎక్కువగిరాకీ వుంటుందని తేలుతుంది.

1960లో యీ జిల్లాలో రూ. 75,000 విలువ మేరకు హోల్డాల్‌లకు గిరాకీ వుంది.

జిల్లాలో యీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి చక్కటి అవకాశాలు వున్నాయి.

పెయింట్లు, వార్నీషులు

పెయింట్లు, వార్నీషులను, కుటీర పరిశ్రమగా తయారు చేసే యూనిటు ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాలో వుంది.

ఇక్కడ తయారు చేస్తున్నప్పటికీ యితర ప్రాంతాలనుంచి ఇంకా దిగుమతి చేసుకుంటూనే వున్నారు.

1961లో యీ జిల్లాలో రూ. 4.5 లక్షల విలువ చేసే వార్నీషులు, పెయింట్లు వాడకం అయ్యాయి.

ఏటా వీటికి 10 శాతంచొప్పున గిరాకీ పెరుగుతున్నట్లు వర్తకందార్లు అంచనా వేస్తున్నారు.

• ఈ జిల్లాలో యీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి అవకాశాలు విస్తారంగా వున్నాయి.

సీసం సీళ్ళు


సంచులను సీలు చేయడానికి కొవ్వూరులోని సూపర్ ఫాస్ఫేటు కర్మాగారానికి సీసం సీళ్ళు కావలసి వుంది.

వీటిని ప్రస్తుతం కలకత్తానుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

తగరం రేకుతో కూడా వీటిని తయారు చేసుకోవచ్చు.

అయితే ప్రస్తుతం యీ సీసం సీళ్ళకు అంతగా మార్కెటు లేనందుచేత తేలిక ఇంజనీరింగ్ పనులు చేపట్టే యూనిటు ఏదైనా వీటిని తయారు చేయడానికి ప్రయత్నించవచ్చు. ★





వార్తా చిత్రాలు

పైన · ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అక్టోబరు 4 న నెహ్రూ జూలాజికల్ పార్కులో "వన్యప్రాణి సప్తాహ" నికి ప్రారంభోత్సవం చేశారు.

మధ్య · మహిళా సంక్షేమ మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ అక్టోబరు 1వ తేదీన వరదబాధితుల సహాయార్థం ప్రదర్శించిన 'ఇద్దరు అమ్మాయిలు' చిత్రప్రదర్శనకు అధ్యక్షత వహించారు

క్రింద : కుడివైపు : నగరంలో సంచార సూపర్ బజారు సర్వీసు ఏర్పాటైంది.

ఎడమ హైదరాబాదు గుర్రపు పందాలలో ముఖ్యమంత్రి కప్పును అక్టోబరు 4 న ముఖ్యమంత్రి బహూకరిస్తున్న దృశ్యం















వార్తా చిత్రాలు


పైన ఎడమవైపు: అక్టోబరు 7 న బ్రెజిలు రాయబారి ముఖ్యమంత్రిని కలుసుకున్నారు

మధ్య : బ్రెజిలు రాయబారి అక్టోబరు 6 న భారత ఎలక్ట్రానిక్ కార్పొరేషన్‌ను సందర్శించారు

క్రింద ఎడమవైపు : గాంధీభవన్‌లో అక్టోబరు 9 న జరిగిన నిర్మాణాత్మక కార్యక్రమానికి సంబంధించిన విద్యార్థుల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు

క్రింద కుడివైపు : రాజస్థానీ చిత్రాల ప్రదర్శనకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అక్టోబరు 4న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు

పైన కుడివైపు : రాజస్థానీ నర్తకి ప్రదర్శన



చైతన్యమూర్తులు

మనలను మానవులుగా చేసిన మహనీయులలో పేర్కొన తగిన వారు బుద్ధుడు, శంకరుడు, వివేకానందుడు. మనయొద్ద భిక్షగైకొని మన అజ్ఞానమును తొలగించి, జ్ఞానభిక్షనిడి, వెలుగు బాట చూపిన మహాత్ములు.

ఒక్కొక్క స్థలములో ఒక్కొక్క మాహాత్మ్యం వుంటుంది. అందువలననే మన పూర్వులు తీర్థయాత్రలు, వేర్వేరు పుణ్య క్షేత్రములందు విగ్రహారాధన నియమించిరి. మన భారత దేశమునకు దక్షిణమున ఉన్న కన్యాకుమారి అగ్రమునకు సమీపమున ఉన్న గుట్టపై ధ్యానము చేయునపుడు వివేకానందుని మనస్సులో ఒక ఆలోచన కలిగింది. "ఊరూర తిరుగుచు, ప్రజలకు తత్త్వ బోధ చేయు సన్యాసులు చాలామంది వున్నారు. అది మతిలేని పని తత్త్వ దర్శనకు ఆకలితో బాధపడు వారు పనికిరారని మన గురుదేవులు రామకృష్ణ పరమహంస చెప్పుచుండెడి వారు. ఈ బీద ప్రజలు పశు జీవితము గడుపుచుండుటకు కారణము కేవలము అజ్ఞానమే. సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులు ప్రతి గ్రామమునకు వెళ్ళి విద్యాబోధన చేసి పల్లెటూరివారి స్థితిని బాగుచేసినచో అనతికాలములో సత్ఫలితాలు కలుగుతాయి. మనజాతి వ్యక్తిత్వమును కోల్పోయింది. మన భారత దేశములో కల అశాంతికంతకు హేతువదియే పోగొట్టుకొన్న వ్యక్తిత్వమును మరల చేకూర్చి మనము భారతీయులను ఉద్ధరించ వలెను." ఈ తీరున యోచించి వివేకానందుడు కోట్లకొలది భారతీయులను సర్వవిధముల ఉద్ధరించుటకు ఎడతెగకుండ కృషి సల్పుటకు, భారతదేశ సేవకు తన జీవితము నంకితము చేయుటకు తీర్మానించు కొనెను. 'మానవ సేవయే మాధవ సేవ'—మానవ సేవ మించు పరమార్థము లేదని నిశ్చయించెను.

ఆరని దివ్వె

"కామయే దుఃఖ తప్తానాం
ప్రాణినా మార్తి నాశనం"

కె. విశ్వేశ్వర రావు



"శరీర ధారులకు ఆపద వచ్చిన వారి యాపదల్ క్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మేలున్నదె" దుఃఖ తప్తులైన వారికి, అన్నార్తులైన వారికి బాధ తొలగించి వారికి సేవ చేయుటయే ఆకాంక్షించెను. "నా దేశమున ఒక కుక్కయైనను పస్తుపడి యున్నచో దానికి కూడ ఆహార మిడి రక్షించుటయే నా పరమ ధర్మము; ఇదియే నా మతము"

పేదల ఆకలి తీర్చండి

తన "నా నియమిత కార్యక్రమ పద్ధతి" (My plan of campaign) లో స్వామి యిట్లు వ్రాసెను. "భావిభారతదేశ భక్తులారా ! లక్షలాది పేదలు పస్తుండి, యున్నారని మీకు తెలియునా ? లక్షలకొలది బీదలు జీవితాంత పర్యంతము ఆకలితో మలమల మాడుచున్నారని మీరు గ్రహించినారా ? నల్లని మేఘమువలె అజ్ఞానము భారతభూమిపై ఆవరించి యున్నదని మీరెరుగుదురా ? పేదలు, వ్యాధిగ్రస్తులు, దుర్బలులు—వీరియందున్న భగవంతుని పూజింపుడు." ఈ సందేశము రామనాడ్‌రాజా యెదుట చెప్పెను. ఆ మరునాడే ఆ రాజా వేలాది పేదప్రజలకు అన్న సంతర్పణ గావించెను.

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకేచ పండితాస్సమ దర్శినః'

అని భగవానుడు చెప్పినట్లు విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుని యందు, గోవునందు. ఏనుగునందు, కుక్కయందు శపాకుని యందు సమానముగా భగవంతుని సందర్శించిన నిజమైన పండితుడు వివేకానందుడు.

షికాగో సభ

షికాగో నగరమున 1893 లో జరిగిన సర్వమత సభ ద్వారా ప్రపంచమునందలి ప్రజల కెల్లరకు ఆయన చెప్పిన సందేశ మిదియే. "సహాయము చేయుము—కలహించవద్దు. సహనము కలిగియుండుము—నాశనము చేయవద్దు, ఐకమత్యము శాంతి కలిగియుండుము—తగవులాడ వద్దు"

'ఉత్తిష్ఠత ! జాగ్రత !! ప్రాప్యవారా న్నిబోధత !!!' ఇదియే ఆయన ఉపదేశ సారము.

అందుచేతనే రామకృష్ణ పరమహంస "30 కోట్ల భారతీయుల 2వేల సంవత్సరాల ఆధ్యాత్మిక జీవిత పరిపూర్ణత" అని పొగడబడగా వివేకానందుడు "భారతదేశ హృదయము, ఐకమత్యము, గతి" యన నెగడెను ఆయన సంక్షిప్త భారతదేశము. హిందూమతము యొక్క వెలుగుచున్న దివ్వె—ఆరని దివ్యజ్యోతి !

స్మారక మందిరం

కావుననే ఆ జ్యోతి సంస్మరణార్థము కన్యాకుమారి అగ్రమునకు సమీపమున హిందూమహాసముద్రము, అరేబియా సముద్రము, బంగాళా ఖాతము—ఈ మూడు సముద్రములచే పరివేష్టితమైయున్న వివేకానంద గుట్టపై 90 లక్షల రూపాయలు వెచ్చించి వివేకానందుని స్మారక మందిరమును నిర్మించిరి. మన భారత రాష్ట్రపతియైన శ్రీ వి. వి. గిరిగారు ఆ మందిరములో ప్రతిష్ఠింపబడిన వివేకానందుని కాంస్య విగ్రహమును 2–9–70 తేదీన ఆవిష్కరించారు.

ఖమ్మం జిల్లాలో రు. 106 లక్షలతో ప్రాదేశిక అభివృద్ధి పథకం

బావుల త్రవ్వకం, ఆయిల్ ఇంజనులు, విద్యుచ్ఛక్తి మోటార్ల ఏర్పాటుకు రు. 106 లక్షల ఖర్చుతో వ్యవసాయ రిఫైనాన్స్ కార్పొరేషన్ మంజూరుచేసిన సమీకృత ప్రాదేశిక అభివృద్ధి పథకాన్ని ఖమ్మం, మధిర, కొత్తగూడెం పంచాయతీ సమితులలో అమలు జరుపుతున్నారు.

మూడు బ్లాకులలోని 130 గ్రామాలకు యీ పథకం అమలు పరిమితమైంది. అయితే మూడు బ్లాకులలోని అన్ని గ్రామాలకు యీ పథకాన్ని వర్తింపజేయడానికి రిఫైనాన్స్ కార్పొరేషన్ అంగీకరించింది.

బావుల త్రవ్వకం, పంపుసెట్లకు ఋణాలు స్వీకరించడానికి భూమి తనఖా బ్యాంకులను సంప్రదించాలి.

కలియుగ భీముడు కోడి రామ్మూర్తి

—————కందూరి నారాయణమూర్తి

దేశ రక్షణము కొఱకు సైనికబల మెంత యవసరమో దేహదారుఢ్యానికి వ్యాయామము అంత అవసరం అని చాటి చెప్పిన వ్యక్తి శ్రీ కోడి రామ్మూర్తి. వీరిపేరు వినని వారు ఆంధ్రదేశమున వుండరు. ఆయన గొప్ప మేధావి. భారత దేశములో మొట్టమొదటగా సర్కసును ప్రవేశ పెట్టిన ఘనత ఆయన కొక్కడికే దక్కింది. అంతకుముందు సర్కస్ అంటే ఏమిటో మన దేశము వారికి తెలియదు. ఆయన తెలుగు వాడని చెప్పుట మిక్కిలి గర్వించదగ్గ విషయము.

కోడి రామ్మూర్తి 6 జూన్ 1885వ సంవత్సరమున శ్రీకాకుళము జిల్లాలోని వీరఘట్టము అను గ్రామములో జన్మించాడు. రామ్మూర్తి బాల్యము నుండియే కసరత్తులు చేయుటలో మిక్కిలి మిన్నగా వుండేవాడు. చదువునందు శ్రద్ధ ఎక్కువ లేదు.

వీరి పెద తండ్రి పోలీసు ఆఫీసరుగా పని చేస్తూ వుండేవాడు. ఆయనవద్దనే రామ్మూర్తి పెరిగి పెద్ద వాడయ్యాడు. ఇంటర్మీడియట్ చదువు అయింతర్వాత మద్రాసులో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టరుగా శిక్షణ పొందాడు. శరీర వ్యాయామాల ద్వారా బలము, ఆరోగ్యము చేకూరుతుందని స్వయంగా తెలుసుకున్నాడు.

ప్రతి రోజు ఆయన మిత్ర బృందంతోకలిసి ఊరి వెలుపల వున్న చెరువు వద్దకుపోయి వ్యాయామము, పరుగెత్తుట, కుస్తీలు మొదలగునవి చేసి ఆ తర్వాత చెరువులో ఈత కొట్టేవాడు. నీళ్ళలోపల ఇరువది నిముషముల వరకు వుండేవాడట. పేరలల్ బారు మీద, హారిజాంటల్ బార్లమీద పలు విధములైన కసరత్తులు చేస్తూ ఇతరులను కూడా చేయించేవాడు.

సంక్రాంతి వంటి పండుగల సందర్భముగా నిర్వహించే పోటీలలో, బరువుల నెత్తుట, కుస్తీలు పట్టుట, పరుగు పందెములు మొదలగు వాటిలో రామ్మూర్తి ప్రప్రథముడుగా వచ్చేవాడు. పెద్ద పెద్ద పేరు మోసిన పహిల్వాన్‌లు సహితం ఆయినకు వంగి వంగి సలాములు చేసేవారు.

రామ్మూర్తికి దైవభక్తి ఎక్కువ. ఆయన నిత్యం ఆరాధించేది హనుమంతుడిని. సాధువులను, సన్యాసులను గౌరవించేవాడు.

ఒకరోజు ఆయన స్నానంచేసే చెరువుకు అవతలవడ్డున ఒక కుటీరంలో నివాసం చేస్తున్న రెండు వందల ఒక్క సంవత్సరముల వయస్సుగల సీతారాంబాబా అను అవధూతస్వామి దృష్టియందు రామ్మూర్తి పడ్డాడు. ఆ సాధువు రామ్మూర్తిని దగ్గరకు రావించుకొని ప్రాణాయామ విధానమును, హనుమదుపాసనా పద్ధతినినేర్పి "నీవు వీనిని నేను జెప్పిన విధంగా బాగా సరియైన రీతుల్లో చేసిన యెడల త్వరలోనే సిద్ధి కలిగి ప్రపంచ ప్రఖ్యాతి గాంచెదవని" ఆశీర్వదించి పంపాడు.

కొంతకాలం ఫిజికల్ ఇన్‌స్ట్రక్టరుగా అదే వూరిలో పని జేసిన రామ్మూర్తికి తుని రాజావారి వద్ద నుండి పిలుపు వచ్చింది. తుని రాజా వారికి సర్కసు కంపెనీ పెట్టవలసనే ఊహ చాలా కాలమునుండి వుండేది. ఉత్సాహ పూరితుడు, పట్టుదల గలవాడు అగు రామ్మూర్తి ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్ వృత్తికి స్వస్తిజెప్పి రాజావారి సహాయముతో 1903వ సంవత్సరములో ఒక చిన్న సర్కసు కంపెనీని స్థాపించి ప్రతి ఊరు తిరిగి ప్రదర్శనలు యిచ్చాడు.

ఆరోగ్యము, శరీర బలము, చేకూరడానికై వ్యాయామము ఎంతైనా అవసరం అని యువతీ యువకులకు బోధించేవాడు. ఆయనే మన దేశమున సర్కసును మొదటిసారిగా స్థాపించిన వ్యక్తి. దేశమంతటా సర్కసు ప్రదర్శనములతో సంచారము చేస్తూ గొప్ప పేరు ప్రతిష్ఠలు గడించాడు. అనేక విధములైన కసరత్తులలో ప్రవీణులగు వారిని యీ సర్కసు సంస్థ ఆకర్షించింది. దేశంలోని యువతీ యువకులు యీ సంస్థలో చేరి పేరు ప్రఖ్యాతులు గాంచారు.

పూనాపట్టణములో రామ్మూర్తి పెక్కు ప్రదర్శనములు యిచ్చాడు. కీర్తిశేషులయిన లోకమాన్య బాలగంగాధర తిలక్ రామ్మూర్తి ప్రదర్శనములచేత ఆకర్షింపబడి గొప్ప సన్మాన సభ ఏర్పాటు చేసి సత్కరించి "మల్లమార్తాండ" అను బిరుదుయిచ్చారు. మరి యింకొకమారు వంగదేశములో సన్మానింపబడి "మల్లరాజ తిలక్" అను బిరుదును పొందాడు.

ఆంధ్రదేశంవారు ఆయనకు "కలియుగ భీముడు" ఆంధ్ర వీరకంఠీరవము" అను బిరుదులనొసంగి పెద్ద బహిరంగ సభలో సన్మానించారు.

ప్రస్తుతము హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాధికారి, కోడి రామ్మూర్తికి "జగదేకవీరుడు" అను బిరుదు యిచ్చారు.

మల్లయుద్ధములో ఆయనతో సరితూగువాడెప్పుడునూ ఆనాడులేడు. ఎంత పేరుకల జెట్టినైనా నిముషములో ఓడగొట్టెడి యోధానయోధుడు రామ్మూర్తి. ఇతడు కుస్తీలుపట్టే రీతులు ఓడిన వారికిగాని, ప్రేక్షకులకుగాని తెలిసెడివికావు.

ఒకసారి ప్యారిస్‌నగరంలోని పాశ్చాత్య మల్లవీరులు ఆయనతో పోటీపడి ఓడిపోయారు. మన దేశములో పేరొందిన జెట్టీలు, గామా, కల్లూకీకర్‌సింగ్, అర్జున్‌సింగ్, గులాం మహ్మద్ మొదలయిన వారందరు రామమూర్తికి చేతులు జోడించెడివారు. గామా ఆయనకు శిష్యుడుగా వుండేవాడు.

ఆయన చిన్నతనంలో ఒకసారి కొబ్బరిచెట్టును చూచి నోరూరిందట. అప్పుడు బలహీనుడగుటచే కొబ్బరి బొండాంలు కోయలేకపోయాడు. ప్రపంచములో నలుమూలల తిరిగి తన స్వగ్రామానికి తిరిగి వచ్చినప్పుడు కొబ్బరిచెట్టును చూడగానే చిన్నతనంలో జరిగినది గుర్తొచ్చి నవ్వుకొని కొబ్బరిచెట్టును పట్టుకొని వూపాడట. కొబ్బరికాయలు కనీసం ఒక్కపిందె అయినా లేకుండా నేలరాలాయట!

రామ్మూర్తి సర్కసులో ముఖ్యముగా ప్రదర్శించేవి :

1. రెండు మోటారుకారులు ఒకొక్కటి 36 అశ్వశక్తి (Horse power) గలవి తాళ్ళతో తన జబ్బలకు కట్టించుకొని కార్లను ముందుకు సాగనిచ్చి వాటి వేగమును స్తంభింపజేయుటయే గాక వాటి ఎనిమిది చక్రములను పైకి లేపి గిరగిర తిరుగునట్లు చేయడం.

2. రెండు ఎద్దుల బండ్లలో రెండింటియందు నిండుగా మనుష్యులను ఎక్కించుకొని ఒకదాని కుడి చక్రమును ఛాతీమీద రెండోదాని ఎడమచక్రమును తొడల మీదను ఏకకాలములో లాగించుకొనడం.

3. వెయ్యి పౌనుల బరువుగల రాయిని తన ఛాతీమీద పెట్టుకొని సమ్మెటతో దానిపై కొట్టించుకొనడం.

4. ఇనుపగొలుసులను త్రెంచడం.

5. రోడ్డు రోలరును తన మీదుగా లాగించుకోవడం.

6. మూడుటన్నుల బరువుగల ఏనుగును తన రొమ్ముమీద ఎక్కించుకోవడం.

ఆయన ఛాతీ గాలి పీల్చకుండా వున్నప్పుడు 48 అం. గాలి పీల్చినప్పుడు 58 అం పరిమాణము కలిగివుండేది.

దేశనాయకులగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు, మహాత్మా గాంధీ, మోతిలాల్ నెహ్రూగార్లచేత మన్ననలు పొందిన జగదేక వీరుడు రామ్మూర్తి. బ్రిటీషు చక్రవర్తి పంచమజార్జి రామ్మూర్తి ప్రదర్శనను చూసి ఆశ్చర్యంజెంది ఆయనకొక బంగారు పతకంను బహూకరించాడు ఆయనకు లభించిన పతకములన్నీ నల్లకోటుకు ధరించేవాడు రామ్మూర్తి.

రామ్మూర్తి మాతృభాష తెలుగు అయినా హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశరక్షణార్థమై కావలసిన దేహదారుఢ్యము సంపాదించుకొనవలయునని యువకులకు బోధ చేసెడివాడు. ఆయన ముఖంలో ఎల్లప్పుడూ సంతోషం తాండవించేది. భారతదేశములో ప్రతి కుగ్రామములో వ్యాయామ పాఠశాల వుండవలెనని ఆయన అభిలాష. గ్రంథాలయములన్నా, సాహిత్యమన్నా ఆసక్తి ఎక్కువ. తను ఆర్జించిన ధనంలో కొంత గ్రంథాలయములకు, సత్కార్యములకు. బీద విద్యార్థుల పుస్తకముల కొరకు, వేతనముల కొరకు దానము చేసేవాడు. రచయితలను రావించి వారిని సన్మానించేవాడు.

1927వ సంవత్సరంలో పారిస్‌లో సర్కసు ప్రదర్శనము ఏర్పాటుచేశారు. స్వార్థపరులు కొందరు ధనంకోసం కక్కుర్తి పడి విదేశీయులకు అమ్ముడుపోయి రామ్మూర్తి ఏనుగును ఎక్కించుకొనుటకు రొమ్ముపై వుంచుకొనే చెక్కను మార్చి అదే స్థానంలో మేకులు వుంచబడిన చెక్కను వుంచారు. తొందరలో రామ్మూర్తి చెక్కను గుర్తించలేదు. ఏనుగు అతని రొమ్ముపై కాలు మోపగానే చెక్కలోపల నున్న మేకులు గుండెలో దిగబడినవి. దానితో కొండంత రామ్మూర్తికి అస్వస్థత చేకూరింది. అప్పటి నుండి సర్కసు ప్రదర్శనములు రద్దుచేసి స్వగ్రామములో విశ్రాంతి తీసుకుంటూ 1938 వ సంవత్సరంలో కీర్తిశేషుడయ్యాడు. ★

(27వ పేజీ తరువాయి)

విద్యార్థులు : క్రమ శిక్షణ

ప్రతి విద్యార్థికి ఏ రోజువార్తలు ఆరోజే తెలియాలి. వారంవారం ఆ వారంలో జరిగిన వింతలు, రాజకీయ వాతావరణం మొదలగు వానిపై విమర్శలు, విద్యార్థులచే వ్రాయించాలి. కథానికలు చదివించి, అందులోని సాహిత్యంపైననూ, విజ్ఞానంపైననూ చర్చలు జరిపించాలి.

4. కళాసేవకుల తయారీ — నాటికలు, నాటకాలు, తోలుబొమ్మలాటలు, సంగీతం, సాహిత్యం వీటిపై విద్యార్థులకు మక్కువ కలిగించాలి. 'స్టేజిఫియర్' అనగా అందరిఎదుట స్టేజిపై ఉపన్యసించుటకు కలుగు భయమును తొలగించవలెను. సంగీతంపై మక్కువకల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరిపించాలి. 'మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్సు' విద్యార్థులకు చౌకలో ఇప్పించవలెను. నాటక, నాటికల పోటీలు పెట్టించవలెను.

'జనరల్ నాలెడ్జి' పీరియడ్స్, పౌరశిక్షణ తరగతులు అన్ని పాఠశాలలలోనూ లేవు. ఆ తరగతులు అన్ని పాఠశాలలలోనూ ప్రవేశ పెట్టవలెను. ఇది ప్రభుత్వమునకు సాధ్యమేగా!

ప్రభుత్వము నిర్వహించుపరీక్షల్లో 'నేనే విద్యామంత్రినైతే...' "నేనే ఆర్థికమంత్రినైతే..." అను ప్రశ్నలనిచ్చి విద్యార్థుల అభిప్రాయములను తెలుసుకొనుట ఎంతైనా అవసరము.

ఈ సూచనలను అన్నీ తొందరగా పాటించటం కష్టమే! మనం సాధించిన అభివృద్ధి ఇరవై మూడేళ్ళది. అంతేకానీ. ఒక్కసారిగా సాధించలేదు కదా! ఎన్నో ప్రణాళికలు నిర్మించి, నిర్వహించి సాధించాము. అలాగే క్రమేణ యీ సూచనలను మనం ఆచరణలో పెట్టుకోవాలి. ★



Shilpi BOB 21/70 Tel

భారత దేశంలో ఏకైక  దేవాలయం శ్రీ కూర్మం

- సున్నా అచ్యుతరావు
- వేమకోటి సీతారామశాస్త్రి

మన భారత దేశంలో ఎన్నో పవిత్ర దేవాలయాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రముఖ చారిత్రిక స్థలాలు వున్నాయి. ఆయా దేవాలయాల్లో అనేక రూపాలలో భగవంతుడు వెలసి వున్నాడు. కాని దశావతారాలలో రెండో అవతారమైన కూర్మావతారం (తాబేలు) శ్రీ కూర్మ నాథస్వామి పేర శ్రీ కూర్మ దేవాలయం శ్రీకాకుళం జిల్లాలో తప్ప భారతదేశంలో మరెక్కడా లేదు! ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణంగా మనం భావించవచ్చు. మన తెలుగు వాళ్ళకు మహద్భాగ్యంగా ఎంచుకోవచ్చు. ఇది తెలుగు తల్లి ప్రాచీన సిరిసంపదలలో మేటిరత్నంగా మనం గర్వపడవచ్చు.

శ్రీ మహావిష్ణువును అనేక అవతారాలుగా, అనేక రూపాలుగా పలుచోట్ల ఆరాధించే దేవాలయాలున్నా వీటిలోకూర్మరూపమున మహావిష్ణువును కొలిచే శ్రీ కూర్మ పుణ్యక్షేత్రాన్ని కలిగియున్న శ్రీకాకుళం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అఖిల భారత ప్రాముఖ్యతను పొందింది. శ్రీకాకుళంలో వున్న ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, యాత్రా స్థలంగా, ఆంధ్రుల అభిమాన దైవంగా అలరారుతున్న పుణ్య క్షేత్రం శ్రీ కూర్మక్షేత్రం.

క్షేత్ర మాహాత్మ్యం

శ్రీకూర్మ దేవాలయానికి ప్రఖ్యాతక్షేత్ర మాహాత్మ్యంవుంది. పౌరాణిక, చారిత్రిక ఆధారాలెన్నో వున్నాయి. దేవాలయమండప స్తంభాలు మనోహరమైన శిల్పరీతులలో, చక్కని కళా నైపుణ్యముతో అలరారుతున్నాయి. దేవాలయానికి చుట్టూవున్న ప్రాకారాన్ని ఆనుకుని అనేక దేవతా విగ్రహాలు, వరుసలు తీరిన అనేక స్థంభాలు చక్కని శిల్పంతో మలచబడ్డాయి. ఆ నగిషీ, ఆ శిల్పాలు, ఆనాటి శిల్పుల నైపుణ్యం చూస్తూంటే తన్మయులమవుతాం.

శ్రీకూర్మక్షేత్ర మాహాత్మ్యాన్ని దత్తాత్రేయుడు వ్యాసమహర్షికి చెప్పాడు. వేదవ్యాసుడు తీర్థయాత్రలు చేసి, కళింగ పట్టణమున కర్పూరేశ్వరుని సందర్శించి, శ్రీకూర్మ క్షేత్రం ప్రవేశించి, చక్రతీర్థంలో స్నానంచేసి సిద్ధేశ్వరుని రుద్రసూక్తులతో పూజించి కూర్మేశ్వర దర్శనానికి బయలుదేరుతూ, తోటి తీర్థ వాసియైన బ్రాహ్మణుడికి శ్రీకూర్మక్షేత్ర మాహాత్మ్యం చెప్పాడు.


పూర్వం దేవదానవులు క్షీరసాగరాన్ని అమృతం కొరకు మందర పర్వతంతో మథించగా, వాసుకి కక్కినవిషం మహాశివుడు మింగి లోకాలను సంరక్షించాడు. కమఠ రూపంలో మహావిష్ణువు మందర పర్వతం మోసి, అమృతోద్భవానికి కారకుడయ్యాడు. అపుడు దేవదానవులు వాసుకి విషానికి, మందరపర్వత ఘాతానికి ఎంతోమంది మరణించారు. అపుడు కమఠ రూపంలోవున్న మహావిష్ణువుని దేవతలు ప్రార్థించగా, మహావిష్ణువు శివప్రతిష్ఠ చేయమని సలహా యిచ్చాడు. వారట్లే శివుని ప్రార్థించగా, శివుడు పాతాళలోకము నుండి జ్యోతిర్లింగ స్వరూపంలో ప్రత్యక్షమయ్యాడు. అపుడు శ్రీ మహావిష్ణువు విశ్వకర్మను పిలిచి ఒక ఆలయం నిర్మింపజేశాడు. తన చక్రంతో ఒక తటాకం నిర్మించాడు.

ప్రాచీన క్షేత్రం


పిమ్మట శంకరుడు విష్ణువుతో భావిపరిణామం చెబుతూ, యుగాంతరమున త్రిదండియు, విశిష్టాద్వైత మతావలంబియు నైన ఒక పురుషుడు వచ్చి, పాంచరాత్ర విధానంచే ఈ క్షేత్రమును సంస్కరించి, జ్యోతిర్లింగాన్ని మహావిష్ణువుగా భావించి పూజ చేస్తాడనీ, పాతాళ సిద్ధేశ్వరుడు క్షేత్రపాలకుడవుతాడనీ చెప్పాడు. ఈ కూర్మక్షేత్ర మాహాత్మ్యం గురించి పద్మ పురాణంలో ముప్పై అధ్యాయములు, బ్రహ్మ పురాణంలో మూడు అధ్యాయములు వున్నాయి. అందువలన ఇది చాలా ప్రాచీనమైన క్షేత్రమనవచ్చు. పద్మపురాణం ప్రకారం పూర్వం చంద్రవంశ రాజైన శ్వేత చక్రవర్తికి కూర్మావతార రూపంలో శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమైనట్లును, అతనిచే అనేక సంవత్సరములు శ్రీహరి పూజింపబడినట్లును, శ్రీ కూర్మనాథ దేవాలయానికి శ్వేత చక్రవర్తి చేతనే ఆలయ ప్రాకారాదులు నిర్మింపబడినట్లునూ వున్నది. శ్రీ కూర్మనాథస్వామిని కుశలవులు సేవించినట్లును, తీర్థయాత్ర కాలంలో బలరాముడు దర్శించినట్లునూ పురాణ ప్రమాణములున్నది.

బౌద్ధస్థూపం పోలికలు

చారిత్రాత్మకంగా ఈ దేవాలయానికుండే విశిష్టత వేరు. క్రీస్తుశకం ఆరంభదశలో హిందూదేశంలో బౌద్ధమతం అన్నిచోట్ల విస్తృతమైవుంది. బౌద్ధమతం పవిత్రమై గొప్పదిగా పరిగణింపబడినా, విగ్రహారాధన అప్పట్లో లేదు. బుద్ధుని పవిత్రావశేషాలు నిక్షిప్తంచేసి వాటిచుట్టూ ప్రార్థనామందిరాలు కట్టబడి బౌద్ధభిక్షువులు, బౌద్ధ మతావలంబకులచే పూజింపబడేవి. వైదికమతం బౌద్ధమతంతో పోటీచేయడంతో వైదికమతావలంబకులుకూడా శివపార్వతులు, లక్ష్మీనారాయణులు మొదలైన దేవతలను శిలలతోనూ, లోహంతోను తయారుచేసి వూరేగించేవారు. కాలక్రమేణా ఈ విగ్రహాలనుంచడానికి మందిరాలు కావలసిన అవసరం ఏర్పడింది. శ్రీకూర్మనాథ స్వామి గర్భాలయం బౌద్ధస్తూపం మాదిరిగానే కట్టబడివుంది. బౌద్ధస్తూపపు పోలికలున్నాయి. దేవాలయ గర్భాలయం నుండి సుమారు నాలుగుమైళ్ళ పొడవుగల ఒక భూసొరంగం శాలిహుండం కొండలమీద (కళింగ పట్టణం దగ్గరలో) గల బౌద్ధ స్తూపం వరకూ వుందని ప్రతీతి.



ఆలయ ముఖద్వారం



ఆలయ గోపురం

త్రిమతాచార్యులు సేవించిన క్షేత్రం

ఒకప్పుడు ఈ క్షేత్రం త్రిమతాలవారికి అభిమాన క్షేత్రమై వెలసింది. అద్వైతమత స్థాపకులైన శ్రీ శంకరాచార్యులు కూర్మనాథ విగ్రహం వెనుక భాగాన సుదర్శనమూర్తి సాలగ్రామాన్ని స్థాపించారు. ద్వైతమతాచార్యులైన శ్రీ మధ్వాచార్యులుగా వున్న నరహరి తీర్థులు సీతారామ లక్ష్మణులను ప్రతిష్ఠించారు. విశిష్టాద్వైతమత స్థాపకులు శ్రీ రామానుజాచార్యులు ఈ క్షేత్రాన్ని విష్ణుస్థలముగా నిరూపించి, వారి ఆరాధ్యదైవాలైన శ్రీ గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను నిత్యోత్సవ విగ్రహాలుగా నిలబెట్టారు.

క్రీ. శ. 1599 వ సంవత్సరములో మహమ్మద్ కులీ పాదుషా సమీనముల్క విద్యాధర ముకుంద బాహుబలేంద్రులను రాజ్యభ్రష్టులను చేసి కళింగ సీమలో ఈ శ్రీకూర్మ ఆలయాన్ని కొల్లగొట్టాడనే జనశ్రుతి వుంది. క్రీ. శ. 1604వ సంవత్సరంలో పద్మనాయకుడును విప్పర్ల గోత్రుడునగు సర్వప్ప అశ్వరాయుడు ఈ దేవాలయాన్ని తిరిగి ఉద్ధరించినట్లు చరిత్ర స్పష్టం చేస్తున్నది. కొంతకాలం యీ దివ్యక్షేత్రం ఒరిస్సాలోని పర్లాకిమిడి రాజుల పాలనలో వుండి, విజయనగర సంస్థానంవారి పాలనలోకి వచ్చిందని ప్రఖ్యాతి.

ఈ దేవాలయం కూర్మము (తాబేలు) గల సాలగ్రామము

గర్భాలయముతోను, పెద్ద ముఖద్వారముతోను, మనోహరమైన మండపాలతోను, వరుసలు తీరిన స్థంభాలతోను, విశాలమైన పుష్కరిణితోను విలసిల్లుతున్నది. కూర్మనాథస్వామి వున్న ఆలయాన్ని శ్రీ కూర్మవిమానమని, గాంధర్వ విమానమని పిలుస్తారు. ఎత్తైన ప్రదేశం నుండి ఆలయాన్ని చూస్తే, మనకి ఆలయం చక్కని ఒక విమాన రూపంలో కనబడి మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఈ విమానానికి నాల్గు దిక్కుల నుండి శ్రీధర, నారసింహ, వరాహ, హయగ్రీవ విగ్రహాలున్నాయి. ఇవిగాక ఇంకా చిత్ర విచిత్రమైన శిల్పాలతో దేవతా విగ్రహాలు అలంకరణగా వున్నాయి. ఈ విమానాన్ని అనుసరించి భోగ మండపము, పుష్పాంజలి మండపము ఆస్థాన మండపము, శంఖనిధి, పద్మనిధి మొదలయినవి వున్నాయి.

గోడలమీద పురాణ గాథలు

దేవాలయావరణలో ఎత్తైన ధ్వజ స్థంభం, రామకోటి స్థంభం, దేవాలయం చుట్టు డెబ్బదికి పైగా నల్లని రాతి స్థంభాలు ప్రవేశ ద్వారాలు చోళ సాంప్రదాయనికి చెందిన అందమైన శిల్పకళతో జీవముట్టి పడుతూ రమణీయంగా వున్నాయి. దేవాలయం చుట్టూ గోడలపైన. ఐరావతారూఢుడైన ఇంద్రుడు, భాగవతంలో గోపికావస్త్రాపహరణము, కాళిందీ మర్దన, దశావతారములు, గోవర్ధనగిరి, శేషతల్పశాయి, జగన్నాథస్వామి, పూతన వధ, మొదలైన శ్రీకృష్ణలీలల చిత్రాలన్నీ రంగులలో చిత్రింపబడివున్నాయి. దేవాలయంలో సుమారు 200 కి పైగా తెలుగులోను, సంస్కృతములోను శిలాశాసనాలున్నాయి. ఇవన్నీ 5 వ శతాబ్దికి చెందినవి. దేవాలయ మండప స్థంభాలపైన, ప్రాకార కుడ్యాలపైన శిల్పుల చేతులలో రమణీయంగా, కళాత్మకంగా శిల్పాలు చెక్కబడి వున్నాయి. ఈ శ్రీ కూర్మక్షేత్రానికి సమీపంలో అష్ట తీర్థాలు వున్నాయి. దీనిని పంచలింగాత్మక క్షేత్రమని కూడా అంటారు.

కళ్యాణోత్సవం

ఈ క్షేత్రంలో ప్రతి మాసంలో ఏదో ఒక విశేషోత్సవం వుంటుంది. ముఖ్యంగా కళ్యాణోత్సవం, డోలోత్సవం అనే రెండు ఉత్సవాలు జరుగుతాయి. ప్రతి సంవత్సరము వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున నవాహ్నిక (తొమ్మిది రోజులు) దీక్షగా కళ్యాణోత్సవం జరుగుతుంది. దీనినే బ్రహ్మోత్సవ మని కూడా అంటారు. డోలోత్సవం ప్రతి సంవత్సర ఫాల్గున శుక్ల పూర్ణిమ రోజున గొప్పగా జరుగుతుంది. ఈ రెండు ఉత్సవాలకు ఆ తొమ్మిది రోజులు ఈ క్షేత్రానికి వివిధ ప్రదేశాల నుండి, చుట్టుప్రక్కల గ్రామాల నుండి ప్రజలు, యాత్రికులు తండోపతండాలుగా వస్తారు. పల్లెటూర్ల నుండి వందల కొలది ఎడ్ల బండ్లు కట్టుకొని జనం వస్తారు. అయినా కరువు తీరనట్లే వుంటుంది. ఈ ఉత్సవ రోజుల్లోనేగాక నిత్యం శ్రీ కూర్మ క్షేత్రానికి భక్తులు అసంఖ్యాకంగా వస్తూ పోతుంటారు.

ఈ ప్రసిద్ధ శ్రీ కూర్మ పుణ్యక్షేత్రం శ్రీకాకుళానికి 9 మైళ్ళ దూరంలో వుంది. ఇపుడు శ్రీ కూర్మం పుణ్యక్షేత్రం చుట్టూ పెద్ద వూరే వెలసింది. శ్రీకాకుళం నుండి శ్రీ కూర్మం వెళ్ళటానికి నిత్యం బస్సులు వున్నాయి. శ్రీకాకుళం రోడ్ (ఆముదాలవలస) రైల్వే స్టేషన్‌లో దిగి శ్రీకాకుళం మీదుగా కూడా శ్రీ కూర్మం వెళ్ళవచ్చును. ఈ మార్గానయితే 18 మైళ్ళ దూరముంటుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన అన్నవరం నుండి, సింహాచలం నుండి కూడా శ్రీ కూర్మానికి ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు వేసి చక్కని రవాణా సౌకర్యాన్ని కలిగించారు.

భారత దేశంలో ఏకైక శ్రీ కూర్మ దేవాలయమైన ఈ పుణ్యక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుండి, ఇతర రాష్ట్రముల నుండి యాత్రికులు, భక్తులు వస్తుంటారు. యావదాంధ్ర దేశానికి మనోహరా అలంకారమై మహత్తర వైభవంతో అలరారుతున్న శ్రీకూర్మక్షేత్రం చరిత్ర పరిశోధకులు, యాత్రికులు, చరిత్రకారులు, కవులు, రచయితలు, శిల్పసాంప్రదాయ పరిశోధకులు తప్పక చూడవలసిన క్షేత్రం. పవిత్రమైన పుణ్యక్షేత్రం.



36 మందికి సరిపడే సూపర్ డీలక్స్ లగ్జరీ కోచ్‌తో పర్యాటకుల బృందం

హైదరాబాదు నగర రామణీయకత చూడాలంటే

యాత్రిక సౌకర్యాల అభివృద్ధిలో యిప్పుడు ఒక క్రొత్తశకం ప్రారంభం కాబోతున్నది. భారత దేశంలోని ముఖ్యనగరాలకు దేశ విదేశ యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చిపోతున్నారు.

హైదరాబాదు చారిత్రిక ప్రాధాన్యం గల నగరం. దానికి తోడు యిటీవల అనేక పరిశ్రమలు నగరంలో స్థాపించబడడంతో దీని ప్రాధాన్యం బాగా పెరిగింది

భారత యాత్రిక విషయాల అభివృద్ధి సంస్థవారు (ఐ. టి. డి. సి.) రాష్ట్ర ప్రభుత్వ యాత్రిక శాఖతో కలిసి, నగరంలో చూడదగిన ప్రాంతాలు చూపించడానికి వాహనాలను ఏర్పాటు చేశారు. వీటిలో జరిగే "ఒకరోజు యాత్ర" ఆహ్లాదకరంగా వుంటుంది.

ఈ యేడు జులై—సెప్టెంబరు మధ్యకాలంలో నగరానికి వచ్చిన వారిలో 14,000 మంది యీ సౌకర్యాన్ని వుపయోగించుకున్నారు. వీరుగాక 17 విదేశ రాయబారుల బృందాలు కూడా యీ అవకాశాన్ని వినియోగించు కున్నాయి. కార్పొరేషన్ ఆధ్వర్యాన 3 అంబాసడర్ కార్లు, 36 మందికి సరిపడే సూపర్ డీలక్స్ లగ్జరీ కోచ్‌లు రెండు, 16 మందికి సరిపడే లగ్జరీకోచ్ ఒకటి వున్నాయి.



జపానునుంచి వచ్చిన ట్రావల్ ఏజంట్ల బృందం ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిని అక్టోబరు 12న కలుసుకున్నారు.

బ్యాంకుల నిర్వహణా విధానం

మన దేశంలో బ్యాంకుల పరిశ్రమ ఇటీవల ఒక మలుపు తిరిగింది. దేశ ఆర్థిక రంగంలో కలిగిన అతిముఖ్యమైన పరిణామాలలో ఒకటిగా ఈ మార్పును పేర్కొనవలసినది. సమాజంలో ఏవోకొన్ని వర్గాలకోసమేకాక యావత్ప్రజానీకానికి ఉపయోగపడే విధంగా బ్యాంకులు పనిచేసేట్లు చూడాలన్న తలంపు, కొత్త పంథా ననుసరించి కొత్తకొత్త ప్రయోగాలు జరుపుతూ ఈ పరిశ్రమను ముందుకు నడిపించాలన్న సంకల్పం, కొత్త కార్యక్రమాల విషయంలో సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఈ దేశంలోని బ్యాంకులవారికి స్వశక్తి సామర్థ్యాలపై ఏర్పడిన నమ్మకం—ఈ మార్పుకు కారణం. దేశంలో బ్యాంకుల పరిశ్రమ కొత్తరూపు దిద్దుకోవడమేకాదు, సరికొత్త వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నది. ఇంతమాత్రంచేత ఈ రంగంలో వ్యాపార సరళి నీరసించలేదు.

దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, లఘు పరిశ్రమలు, ఎగుమతులు, రవాణా వంటి కీలకమైన రంగాలు అభివృద్ధిచెందడానికి దోహదం చేయటం, ఆర్థిక వ్యవస్థలోని వివిధరంగాలకు ఒకవిధమైన లంకెను కుదర్చటం, సమాజంలోని విభిన్న వర్గాల, వివిధ ప్రాంతాలవారికి మధ్య ఆర్థికంగా ఉంటూన్న వ్యత్యాసాలను తొలగించటం, దేశ ఆర్థిక సౌష్టవాన్ని పెంపొందించటం, డిపాజిట్లను ఇతోధికంగా సమీకరించడం అనే ధ్యేయాల సాధనకుగాను ఈనాడు దేశంలో బ్యాంకులు పని సాగిస్తున్నాయి.

దేశంలో బ్యాంకులు ఇప్పుడు మరింత విస్తృత ప్రాతిపదికపై పని సాగిస్తున్నాయి. పల్లెప్రాంతాలలో నివసించేవారు పొదుపు చేసుకునే సొమ్మును డిపాజిట్ల రూపంలో సేకరించడానికే కాక, వారికి కొత్తకొత్త సేవా సదుపాయాలను కల్పించడానికి పూనుకోవడంతో కొత్తగా అనేకమంది ఈ బ్యాంకులతో లావాదేవీలను ఏర్పాటుచేసుకుంటున్నారు.

ఈయీ మార్పులదృష్ట్యా, బ్యాంకులనిర్వహణలో ఇంతవరకు అనుసరిస్తూన్న పద్ధతులు ఎంతవరకు అనుకూలమైనవి అన్న ప్రశ్న బయలుదేరింది. ఈ సంగతిని సరిగా గమనించి తదనుగుణంగా వ్యవహరించని పక్షంలో, బ్యాంకులు స్వయంగా తెచ్చిపెట్టుకున్న చిక్కులలో పడగలవు. దరిమిలా ఎప్పుడో పరిస్థితిని చక్కదిద్దుకోవటం కష్టమవడమే కాదు, బ్యాంకుల్ల పేరు ప్రతిష్ఠలకూ, శక్తిసామర్థ్యాలకూ ఈలోగా ఎంతో హాని కలిగే ప్రమాదంకూడాఉంది.

ఇతర పరిశ్రమలకూ, బ్యాంకుల పరిశ్రమకూ స్వరూప స్వభావాలలో చాలా తేడా ఉంది. తమను నమ్ముకుని ఉన్నవారి అవసరాలను బ్యాంకులు సకాలంలో తగిన విధంగా తీర్చలేని పక్షంలో ఎన్నోరకాల కృషికీ, కార్యకలాపాలకూ నష్టం కలుగుతుంది. అందుచేత, తమను నమ్ముకున్నవారి అవసరాలను తీర్చడానికై జాప్యం ఏదీ లేకుండా తగు నిర్ణయాలు చేయడమేకాక, బ్యాంకులు, వారికి మున్ముందు ఎప్పుడు ఎలాంటి అవసరాలు ఏర్పడగలవో ముందుగా ఊహించటం కూడా ముఖ్యమే. ఈ పనిని ఏమేరకు అనేకాక, ఏవిధంగా బ్యాంకులు జరుపకలవు అన్నదానిని బట్టి, కొత్త విధానాల జయాపజయాలు ఆధారపడి ఉంటాయి.

బ్యాంకుల ప్రయోజనాలలోనూ, ధ్యేయాలలోనూ వైఖరులలోనూ వచ్చిన ఈ మార్పులదృష్ట్యా, వేర్వేరు నిర్ణయాలు ఎక్కడో ఒక కేంద్ర స్థానంనుంచి వెలువడవలసిన మామూలు పద్ధతి అంతగా ఉపకరించదు. నిర్వహణ విధానాలలో తగు మార్పులు రావడం ఎంతైనా అవసరం.

వికేంద్రీకరణ

ఇకముందు, బ్యాంకుల నిర్వహణలోనూ, నిర్ణయాలు చేసే విధానంలోనూ, ఆయా సమయాలలో ఏర్పడే అవసరములనుబట్టి వ్యవహరించేందుకు వీలుగా, వికేంద్రీకరణ అమలు జరగడం అవసరం. ప్రతివిషయానికీ పైవారి ఆదేశాలకూ, సూచనలకూ వేచి ఉండవలసిన అగత్యం లేకుండా, వేర్వేరు స్థాయిలలోనూ, సాధ్యమైనంతవరకు బ్యాంకులు స్వేచ్ఛగా వ్యవహరించతగు నిర్ణయాలు చేయడానికి వీలు ఉండాలి. అలాకాని పక్షంలో ఎంతో జాప్యం ఏర్పడి, బ్యాంకులు కల్పించే సేవా సదుపాయాలు స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

వేర్వేరు విషయాలలోనూ అందులో ముఖ్యంగా ఋణాల నివ్వటం విషయంలో నిర్ణయాలు చేయడానికి సంబంధించి బ్యాంకుల యాజమాన్యంలో ఈ వికేంద్రీకరణ జరగాలీ అంటే, నిర్వహణ స్థాయిన బ్యాంకుల రూపురేఖలలోనూ, వృత్తిపరంగా సిబ్బంది యోగ్యతలలోనూ కొన్ని మార్పులు అవసరమౌతాయి. ఉద్యోగాలు, అధికారులు తగినంత చొరవ చేసుకొని, తమ విచక్షణను ఉపయోగించి ఉచితమైన నిర్ణయాలు చేసి సరిగా పని సాగించడానికి అవకాశమిచ్చే విధంగా, బ్యాంకుల వ్యవస్థను తీర్చి దిద్దవలసి ఉంది. చాలినంతమందిని పనిలో చేర్చుకున్నంతమాత్రాన, వారికి తగిన శిక్షణ ఇచ్చినంతమాత్రాన చాలదు.

సమాజపరంగా సాధించ తలపెట్టిన ఆర్థిక ప్రయోజనాలు చేకూరి నిలబడగలగాలీ అంటే, ఒక్కశాఖల విషయంలోనేకాక, అసలు బ్యాంకుల నిర్వహణ తీరుతెన్నులలోనే వికేంద్రీకరణ అవసరం.

అంగబలానికి తగినవిధంగా మెరుగులు దిద్దుకోనిపక్షంలో, నిర్వహణ విధానంలో మార్పులు వచ్చి కూడా నిష్ప్రయోజనమే అవుతుంది. బ్యాంకుల ద్వారా సాధించబూనుకున్న లక్ష్యాలు నెరవేరేందుకు వసతుల లోపంలేదు. సుశిక్షితులైన సిబ్బంది, అధికారులు కావాలి. వారివారి పనులలో సమర్థత, నిజాయితీ మాత్రమే ఉండికూడా అట్టే ప్రయోజనంలేదు. ఇప్పుడు కొత్తగా రూపొందించుకున్న విధానాలను, ఏర్పరుచుకున్న లక్ష్యాలను గురించి చక్కగా ఆకళింపు చేసుకున్న సిబ్బంది ముఖ్యం. ఇందుకు తగిన శిక్షణ ఇవ్వవలసి వుంది.

శిక్షణ కళాశాలలు

ముఖ్యంగా బ్యాంకుల నిర్వహణ వ్యవహారాలకు సంబంధించిన జాతీయసంస్థ, ఈ రకమైన శిక్షణ ఇప్పించడం ద్వారా అనువైన అంగబలాన్ని పెంపొందించేందుకు సమగ్రమైన ఒక పథకాన్ని గురించి గట్టిగా యోచిస్తున్నది. భారీ ఎత్తున ఈ కార్యక్రమం సాగించేందుకు ఇప్పటికిప్పుడే అనేక చర్యలకు ఉపక్రమించడమయింది. వీరు తలపెట్టిన పథకంమేరకు, ఇప్పుడున్న సిబ్బందికి కొత్తగా చేర్చుకునే గుమాస్తా స్థాయి ఉద్యోగులకు సాంకేతికమైన నేర్పు నైపుణ్యాలను బోధించేందుకు ఒక వంద ప్రాంతీయ శిక్షణ కేంద్రాలూ; అధికారుల స్థాయి సిబ్బందికి ప్రత్యేకమైన ఆయా విషయాలలో శిక్షణ ఇవ్వడానికి- బ్రాంచి మానేజర్ల స్థాయి ఉద్యోగుల వరకు నిర్వహణలో బోధపరచడానికిగాను ఇరవై కళాశాలలూ ఏర్పాటవుతాయి.

ఇది బ్యాంకుల నిర్వహణ వ్యవహారాల జాతీయ సంస్థ, వ్యవసాయ రంగానికీ, లఘు పరిశ్రమలకూ ఋణ సహాయం కల్పించడంవంటి కొత్త రంగాలలో నేర్పుగా పనిజరపడం ఎలాగో బోధపరుస్తుంది. బ్యాంకుల నిర్వహణలో ఉన్నతస్థాయి శిక్షనిస్తుంది. ఈ సందర్భంలో, అవసరమైన పరిశోధనలకూ, సంప్రదింపులకూ అవకాశం కల్పించడమవుతుంది.

దేశంలోని బ్యాంకులన్నీ, నిర్వహణ పాటవానికి తగు విధంగా మెరుగులు దిద్దుతూ ఉండే వ్యవహారం చూడడానికై విడిగా ఒక శాఖను ఏర్పాటు చేసుకుంటున్నాయి. బాగా ఉన్నతస్థాయిన ఏర్పాటయ్యే ఈ శాఖ, నిర్వహణ విధానాన్ని మెరుగుపరచడానికిగల వేర్వేరు పద్ధతులను విపులంగా పరిశీలించి, సమన్వయ పూర్వకంగా పని జరిగేట్లు చూస్తుంది.

దేశ స్థితి గతులలో ఏర్పడుతూన్న మార్పులకు అనుగుణంగా బ్యాంకుల పరిశ్రమ వ్యవహరించడానికి ముందుకు వచ్చింది. ఈ రంగంలో ఉత్పన్నమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు బ్యాంకుల వారు తగిన విధంగా సర్దుబాటు చేసుకోగలుగుతున్నారు.

బ్యాంకులు కల్పించే సహాయంపైనా, సేవా సదుపాయాల పైనా దేశ ప్రజ గొప్ప ఆశలు పెట్టుకున్నది. ప్రజోపయోగం కోసం పాటుపడవలసిన బ్యాంకుల వ్యవస్థ మానవ సేవా దృక్పథంతో వ్యవహరించవలసి ఉన్నది. నిర్వహణ విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు, స్వయంగా కట్టుదిట్టంగా బ్యాంకులవారు పూనుకోవడం, ఈ కృషిలో ఒక అడుగు ముందుకు వేయటం కాగలదు. ఇలా జరిగినప్పుడు, ఒకింత ఆలస్యంగానైనా ప్రస్తుతపు ప్రజల అవసరాలు తీర్చడానికి అవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తుకు సంబంధించినంతవరకు, సామాజికంగానూ, ఆర్థికంగానూ దేశానికి ఏర్పడబోయే అవసరాలేమిటో ముందుగానే ఊహించి తెలుసుకుని, వాటిని తీర్చడానికి నిరంతర కృషి జరగవలసి ఉంది. ★

అణుశక్తి ఉత్పత్తికి ఇంధనాలు

అణుశక్తి ఉత్పాదనకు అవసరమైన కొన్ని రకాల ఇంధన పదార్థాలను రూపొందించేందుకు గాను, బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం తాలూకు అణు ఇంధనాల విభాగంవారు, హైదరాబాద్‌లో కొన్ని కర్మాగారాలను నెలకొల్పుతున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు రు. 13 కోట్ల 34 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ నెలకొల్పుతూన్న కర్మాగారాలలో ఉత్పత్తి మొదలయినప్పుడు, సాలీనా విదేశీ మారక ద్రవ్యం రూపేణా 5½ కోట్ల రూపాయల వరకు ఆదా అవుతుంది. నికరంగా సంవత్సరానికి సుమారుగా 3 కోట్ల రూపాయలు ఆదా అవుతాయి.

యురేనియం ఆక్సైడ్, జిర్కోనియం ఆక్సైడ్ కర్మాగారాలూ, మరో రెండు యంత్రాగారాలూ 1970 సంవత్సరాంతం నాటికి పని ప్రారంభించగల వనుకుంటున్నారు. ప్రత్యేక ఇంధన ద్రవ్యాల కర్మాగారం 1971 జూన్ ప్రాంతం నాటికి ఉత్పత్తి ప్రారంభించ వచ్చు. ఇదే సమయానికి మరో కర్మాగారంలో కూడా ఘట్టాల వారీగా పని మొదలవుతుంది. కొన్ని కొన్ని ప్రక్రియలను గురిచేసి శ్రేష్ఠతరంగా రూపొందించిన ఇంధన పదార్థాలను ఉత్పత్తిచేసే కర్మాగారం, 1972 సంవత్సరంలో పని ప్రారంభిస్తుంది.

ఈ వేర్వేరు కర్మాగారాల స్థాపనకు కావలసిన యంత్ర సామగ్రి, పరికరాలలో చాలావరకు, ప్రాజెక్టు స్థలానికి చేరాయి. యురేనియం ఆక్సైడ్ తయారుచేసే యంత్రాలలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తొట్టిని నిర్మించే పనీ, జిర్కోనియం ఆక్సైడు తయారీ యంత్రాలలో 75 శాతం పనీ, ట్రాంబేలోని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం తాలుకు కార్ఖానాలలో పూర్తి అయిపోయింది.

దేశంలో నెలకొల్పే అణువిద్యుత్ కేంద్రాలకూ, తారాపూర్‌లో అణు ఇంధనాలను మరోసారి తగు ప్రక్రియలకు గురిచేసేందుకుగల కర్మాగారానికీ, రాజస్థాన్, బరోడాలలోని భారజల ఉత్పత్తి కేంద్రాలకూ అవసరమైన యురేనియం ఆక్సైడునూ, మరికొన్ని ప్రత్యేక ద్రవ్యాలనూ, హైదరాబాదు దగ్గర ఏర్పాటవుతూన్న కర్మాగారాలు సరఫరా చేస్తాయి.



వి. ఘనంజయరావు

అధికోత్పత్తి సాధించిన రైతు

"ఎక్కువ దిగుబడి రావాలంటే యీ ప్రాంతంలోని రైతులు జింక్ సల్ఫేట్ కూడా ఎరువుగా వెయ్యాలి." అంటాడు తన అనుభవాన్ని పురస్కరించుకుని చెప్తూ ఒక అనుభవజ్ఞుడైన అభ్యుదయ కర్షకుడు. అయితే ఇది ఏ ప్రాంతం ? ఈ అనుభవజ్ఞుడైన రైతువెవరు?

అల్లూరి హరిపురుషోత్తమ రావు హైదరాబాదు జిల్లా, మేడ్చల్ పంచయతీ సమితిలోని కండ్లకోయ గ్రామస్థుడు. ఆయనకు 25 ఎకరాల భూవసతివుంది. అభ్యుదయ భావాలు కల రైతు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన జాతీయ ప్రదర్శన క్షేత్ర పరిశీలల్లో ఆయనది కూడా ఒకటి. ఆధునిక వ్యవసాయ విధానాలను తాను అనుసరించడమే కాకుండాతోటి రైతులను ప్రోత్సహిస్తాడు శ్రీ పురుషోత్తమరావు.

విశ్వవిద్యాలయంవారు ఈ పథకాన్ని గత మూడేండ్లుగా నిర్వహిస్తున్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐ. సి. ఎ. ఆర్.) వారు రూపొందించిన పథకం యిది.

ఒకే భూమిలో జాగ్రత్తగా పనిచేసుకుంటూ, ఆధునిక విధానాలు అనుసరిస్తే రెండు మూడు పంటలు పండించవచ్చనీ, తద్వారా దిగుబడి ఎక్కువ సాధించవచ్చుననీ ప్రత్యక్షంగా నిరూపించడమే ఈ పథకం లక్ష్యం.

మేలురకం విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ మందులు మొత్తం మూడు పంటలైతే రు. 550 ల విలువగలవీ, రెండుపంటలైతే రు. 400 ల విలువగలవీ రైతులకు యిస్తారు.

పరిశీలనలు జరిపే శాస్త్రవేత్తలు ఎప్పుడూ లేబరేటరీలలో కూచోకుండా అచ్చటికి వెళ్ళి రైతులతో ప్రత్యేకంగా పరిశోధనలలో పాల్గొనడం కూడా యీ పథకం యొక్క మరొక ముఖ్యలక్షణం దీనివల్ల వారిలో నూతన భావాలు ఏర్పడే అవకాశం వుంటుంది.

వ్యవసాయ విశ్వవిద్యాలయంవారి ఆధ్వర్యాన "విస్తృత జాతీయప్రదర్శన కార్యక్రమం'' అనే కొత్త పథకం కూడా అమలు జరుగుతున్నది. దీనికి కూడా ఐ. సి. ఎ. ఆర్. వారి సహకారం వున్నది. హైదరాబాదు, చిత్తూరు, పశ్చిమ గోదావరి, కర్నూలు జిల్లాల్లో యీ పథకం అమలు పరుస్తున్నారు. వ్యవసాయ శాస్త్ర నిపుణులను జిల్లాల్లో నియమించారు.

శ్రీ హరి పురుషోత్తమరావు మొదటి పంట ఐ. ఆర్. 8. రెండో పంట "హంస" రకం వేశాడు.

1969 జూన్ 5వతేదీన మొదటి పంటకు నారుమడి తయారు చేశాడు. 30 బండ్ల ఎరువు, 50 కిలోల యూరియా, 50 కిలోల అమోనియా సల్ఫేటు, 25 కిలోల పోటాష్. మ్యూరియేట్ ఆరంభములో వేసి భూమిని పదును చేశాడు. జూన్ 29, 30 తేదీల్లో నాట్లు జరిగాయి. జూలై 20న ఒకసారి, ఆగష్టు 4న ఒకసారి కలుపు వేశారు. ఆ సమయాల్లో మళ్ళీ 25 కిలోల యూరియా వేశాడు. గింజలు చల్లాక 15వరోజున ఎండ్రిన్ (నాలుగు గ్యాలన్ల నీళ్లలో ఒక ఔన్సు) స్ట్రెప్టో సైక్లిన్ చల్లడం జరిగింది. నాట్లకు 2 రోజులు ముందు మళ్ళీ యీ మందు చల్లారు. నాట్లు వేసింతర్వాత కూడా ఎండ్రిన్, ఫోలిడాల్ మందులు వాడబడ్డాయి.

పంటకాలం మొత్తం 155 రోజులు. ఐ.ఆర్. 8 యకరంలో 4050 కిలోలు పండింది. దీనివల్ల రు. 2349లు, గడ్డిమీద రు 360లు వచ్చింది. ఆయనకు అయిన ఖర్చులు : విత్తనాలు ఎరువులు : రు.278-85; మొక్కల మందులు రు.34-88, కూలీలు రు.232-00 మొత్తం రు. 545-73, నికరాదాయం రు 2163-47.

నవంబరు 7, 8 తేదీలో యీ పంట కోసింతర్వాత, కొన్నాళ్ల పొలాన్ని అలా వదిలేసి మళ్ళీ 1970 జనవరి 29న దున్నాడు. 100 కిలోల అమోనియా, 50 కిలోల యూరియా, 50 కిలోల పోటాష్ వేశాడు. "హంస" నారుమడి డిశెంబరు 28న ప్రారంభమైంది. జనవరి 29న నాట్లు. ఫిబ్రవరి 14, మార్చి 17 తేదీల్లో కలుపుతీత అప్పుడు ప్రతిసారి 25 కిలోల యూరియా వేశారు. నారుమడికి 15వ రోజున పారాథియాన్ (8 గ్యాలన్ల నీళ్లతో 1 ఔన్సు) బ్లిటాక్స్ (2 గ్యాలన్లలో 1 ఔన్సు) మందులు చల్లాలి. మళ్ళీ 22వ రోజున పారాథియాన్ చల్లారు. 48 రోజులకు జింక్ మిక్చర్ (2 గ్యాలన్లలో 1 ఔన్సు థియోడాన్ (4 గ్యాలన్ల 1 ఔన్సు) చల్లారు. మొక్కలు 81 రోజులప్పుడు మళ్ళీ వీటినీ, పారాథియాన్‌నూ చల్లారు.

ఈ పనంతా చేయడానికి అయిన ఖర్చు రు. 679లు. రాబడి 3810 కిలోల ధాన్యం, 5435 కిలోల గడ్డికి గాను మొత్తం రు. 2131-00 ★

గ్రంథ సమీక్ష

సమీక్షకు రెండేసి ప్రతులు పంపించాలి

శ్రీ శంకరకృప

ఇది దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠమువారి యాజమాన్యమున వెలువడు ఆధ్యాత్మిక మాస పత్రిక. శ్రీశృంగేరీ జగద్గురు చరణుల ఆశీర్వాదముతో గడచిన తొమ్మిది సంవత్సరములనుంచి హైందవమత, ధర్మ, తాత్విక, నీతి, సంస్కృతులను సేవించుచు ప్రచారము కావించుచున్న 'శ్రీ శంకర కృప' పదవ సంవత్సరంలో ప్రవేశించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సంచికగా వెలువడిన 'శ్రీ శంకర కృప' ఆస్తిక మహాజనులందరి ఆదరాభిమానాలను అందుకోగలదనడంలో సందేహంలేదు. శ్రీ జగద్గురువుల ఉపదేశములు, శ్రీ భగవత్పాద విరచితమైన శ్రీగణేశ పంచరత్నమాల, శ్రీ జగద్గురు సచ్చిదానంద శివాభినవ నృసింహ స్వామివారి 'శ్రీ శారదా మహిమ స్తవః' శ్రీ జగద్గురు చంద్రశేఖర భారతీ స్వామివారి 'శ్రీ మదాచార్యేంద్ర స్తవః' యీ ప్రత్యేక సంచికకు అమూల్యమైన అలంకారాలుగా శోభిల్లుచున్నవి. ఆది శంకరులకు సంబంధించిన అనేకమైన యితర విషయములతోపాటు 'పంచాంగ విశేషములు', 'ఉపనిషత్తులలో గోమాంసభక్షణ చెప్పబడినదా,' 'శబ్దము నిత్యమా', 'శివోహమ్', 'శ్రీ పద్మపాదాచార్యులు', 'వేదకాలమునాటి ముత్తైదువలు' వంటి చక్కని హైందవ విజ్ఞానాత్మకమైన వ్యాసాలు ఈ ప్రత్యేక సంచికలో ఉన్నవి. నానాటికి నైతిక విలువలు దిగజారిపోయి, మన భారతీయ సంస్కృతి గురించిన అజ్ఞానము అధికమగుచున్న యీ కాలములో 'శ్రీ శంకర కృప' వంటి ఆధ్యాత్మిక పత్రికల ఆవశ్యకత ఎంతో ఉన్నది. శ్రీ ఆది శంకరుల ముఖచిత్రముతో ప్రత్యేక సంచికను సర్వాంగ సుందరముగ, ప్రబోధాత్మకముగ, జిజ్ఞాసువులందరికి విజ్ఞానప్రదముగా వెలువరించిన సంపాదకులు శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వర రావు గారు అభినందనార్హులు. ఈ ప్రత్యేక సంచిక వెల అందలి విషయ సంపత్తితో పోల్చినపుడు మిక్కిలి స్వల్పము—ఒక రూపాయి మాత్రమే (ప్రతులకు—మేనేజరు, శ్రీ శంకర కృప, విజయాటాకీసు సెంటరు, విజయవాడ—2).

శ్రీ వీరేశలింగం సాహిత్య రత్నాలు

'తనదేహము, తనగేహము, తనకాలము, తనధనంబు, తన విద్య జగజ్జనులకు వినియోగించినఘనుడే వీరేశలింగకవి.జనులారా!' అని చిలకమర్తి లక్ష్మీనరసింహం తన కంఠకాహళి గంభీరంగా నినదించినాడు. ఏ గతి రచియించినా సమకాలికులు మెచ్చరని ఒక ప్రాచీన కవి పరితపించినాడు. కాని యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం శ్రీ చిలకమర్తి వంటి తన సమకాలీనుల ప్రశంసలకు గూడ పాత్రమైనాడు, తెలుగుజాతిని మేల్కొల్పిన వైతాళికుడు కందుకూరి. కలాన్ని ఒక పెద్ద ఆయుధంగా, సాహిత్యాన్ని సాటిలేని బలంగా కందుకూరి తన సంఘ సంస్కరణ సమరంలో ప్రయోగించినాడు. ఆధునిక తెలుగు సారస్వతంలో అన్ని నూతన ప్రక్రియలకు ఆద్యుడు ఆయనే. ఇంతటి మహనీయుని మాటలు,ఆయన రచనల లోని మేలిముత్యాలు తెనుగు ప్రజలు సర్వదాస్మరించదగినవి. కందుకూరి సృజించిన అపారమైన విజ్ఞాన భాండాగారం నుంచికొన్ని అజరామరమైన, విశ్వజనీనమైన సూక్తులను, విశేషాలను ఏరికూర్చి కాకినాడనోని శ్రీ కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవ సంఘం వారు ఆయన 122వ జన్మదినోత్సవ కానుకగా తెనుగు వారికి ఒక చిన్న పాకెట్ సైజ్ పుస్తకాన్ని ప్రచురించి సమర్పించినారు. ఈ కృషి ప్రశంసనీయం ఇతరులకు అనుసరణీయం, ఆదర్శనీయం. ఈ చిన్న పుస్తకం వెల అర్ధరూపాయి.

షట్పది ఖండకావ్య సందోహము

శ్రీమతి పిండిప్రోలు వసంత కుమారీదేవి రచించిన వివిధ కావ్యఖండికల సంకలనం 'షట్పది' హృదయాంజలి, ప్రసవమాల, ఆరాధన యీ ఖండకావ్యసంపుటిలోని మూడు భాగాలు. షట్పది లోని యే ఖండికను రుచిచూచినప్పటికి మనోహరమైనభావాలు, రమణీయమైన పల్లవపదజాలం శ్రీమతి వసంతకుమారీదేవి సొంత సొత్తులనే అనుభూతి వెంటనే కలుగుతుంది. మచ్చుకు 'కలువకన్నె' లోని ఒక పద్యం—

> భువన హృదయాంతరాళ ప్రమోది వగుట
> అప్తులకు లోటు లేదు నీ కవని మీద
> కాని నీ శ్రీకరమ్ముల కనులు తెరచు
> కలువ కెవ్వరు లేరు నీ కన్న ప్రియులు!

ముగ్ధ మనోహరమైన భావాలతో మురిపించే కావ్యఖండికలు, ముంచెత్తివేసే భావనా లహరులు యీ సందోహంలో చాలా ఉన్నవి. బారసాల జరుగని ఒక ఖండికలో—

> వలపుగుండెలు నీకిచ్చి నిలిచినాను
> కాని నీ కటాక్షమ్ములో కరిగిపోయి
> తేటలూరు పథాలలో తేలిపోవు
> హాయి నే భరియింప లేనోయి దేవ!

షట్పదిలోని రెండవభాగం 'ప్రసవమాల'లో వసంత విలాసంతోపాటు అక్కడక్కడ వాసంత విలాపంగూడ విన్పిస్తుంది. ఆకులను, పూవులను వస్తువుగా గ్రహించి, వాటికి ఎన్నో అనుభూతులను ఆపాదించి రమ్యావలోకనం చేయడం వసంత కుమారీదేవి లేఖినికి అలవాటేమో అన్పిస్తుంది. 'చంపకము'లో చూడండి,

చిన్నదానవె యైనను కన్నవారి
కీర్తి నిల్పెడి పేర్మిమార్ధ్రమూర్తివీవు
ఆకులో నాకు వైతివి అయినగాని
పట్టియిచ్చునులే నిన్ను పరిమళమ్ము

కుసుమపేశలమైన మనోజ్ఞమైన యిటువంటి ఊహాచిత్రాలు రసప్లావితమై 'షట్పది'లో చాలా కన్పిస్తున్నవి. కొన్నిచోట్ల విన్పించిన మాటలే విన్పించడం కన్పించిన దృశ్యాలే కన్పించడం, అవే భావాలు మళ్ళీ మళ్ళీ రావడం వంటి అనౌచిత్యాలు, ఈ చర్విత చర్వణంవంటి పునరావృత దోషాలు లేనట్లయితే 'షట్పది' చక్కని కావ్యంగా రసజ్ఞులనుంచి అభినందలను అందుకుంటుంది. (వెల రెండురూపాయలు, సాహితీ సమితి, బ్రాడీపేట, గుంటూరు).

దేవులపల్లి ప్రభాకర్

మధురాంజలి

రచయిత: విప్పగుంట రాజగోపాలరావు. మూల్యము: భక్తి ప్రపత్తులు. ప్రతులకు శ్రీ నీలిశెట్టి చెంచయ్య, కనిగిరి, నెల్లూరుజిల్లా.

'మధురాంజలి' అనే యీ చిన్న కృతి శతక సాహిత్యపు రీతికి చెందినట్టిది. మొత్తం 108 పద్యములు వున్నవి. "మర్తాండ లింగేశ్వరా", "సర్వలోకేశ్వరా" అనేరెండు మకుటములు పద్యములలో వాడబడినవి. శతకమంతా ఈశ్వర సంబంధమైన భక్తి భావంతోనే నడిచింది. శతక కవులకు తప్పనిసరిగా వుండవలసిన ధారాశుద్ధి యీ రచయితకు పుష్కలంగావుంది. "స్థాణుండు కెవ్వడేన్ హేమార్యమునన్ వసించునె పురారీ" వంటి చమత్కులు కూడా అక్కడక్కడ వున్నవి. భావగర్భితమైన రచయిత శైలికి ఒక ఉదాహరణ :

"హరివాద్యధ్వని గర్జగా దివిజదృ
గ్వ్యాళి పారముల్ చంచలా
స్ఫురణల్గా, భవదీయ భక్తచయ స
మ్మోదాశ్రుధారాపరం
పరవర్షంపగ నీదు తాండవ కలా
పక్రీడ వర్తిల్లె ......"

"జ్యావల్లీధ్వని గర్జనంబుగ సురల్
సారంగ యూధంబుగా
ఆ విల్లింద్ర శరాసనంబుగ సరో
జాక్షుండు మేఘంబుగా
తా విద్యుల్లతభంగి"
పోతన్నగారి సత్యభామ యుద్ధం చేసిన పద్యం మనందరికీ పరిచితమేగదా.

కందుకూరి వీరేశలింగం 122వ జయంతి స్మారక సంచిక

తెనుగు దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి ఆది పురుషుడుగా పరిగణింపబడుతున్న వీరేశలింగం పంతులుగారిని గురించి ఎంతగా ప్రచారంచేసినా అది తక్కువే అవుతుంది. ఆ మహా పురుషుని 122వ జన్మ దినోత్సవం సందర్భంగా ప్రచురించిన సావనీర్‌లో ప్రసిద్ధులు రాసిన ఆంగ్ల, ఆంధ్ర వ్యాసాలు, కవితలు వున్నాయి. తెనుగు విభాగంలో "యుగపురుషుడు వీరేశలింగం" అనే పేరుతో శ్రీ అక్కిరాజు వాసుదేవరావుగారి వ్యాసమూ, పంతులుగారి ఆంధ్రకవుల చరిత్రను గురించి డా. దివాకర్ల వెంకటావధానిగారు రాసిన వ్యాసమూ, "కారణ జన్ముడు వీరేశలింగం" అని డా. అక్కిరాజు రమాపతిరావు గారు రాసిన వ్యాసమూ, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ప్రసంగ పాఠమూ పేర్కొనదగినవి. ఇంకా శ్రీ శ్రీ, జాషువా, జె. బాపురెడ్డి సోమసుందర్, జ్ఞానానంద కవి ప్రభృతుల కవితలు, శ్రీయుతులు ఎ. బి. నాగేశ్వరరావు, కొవ్విడి లింగరాజు, శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి ప్రభృతుల వ్యాసాలు వున్నాయి. వీరేశలింగంగారి వ్యక్తిత్వాన్నీ, బహుముఖ ప్రజ్ఞావిశేషాలనూ స్థానీపులాంకగా తెలుసుకోడానికి యీ సంచిక సామన్య పాఠకులకు చక్కగా వుపయోగపడుతుంది.

తూర్పు గోదావరి జిల్లా పరిషత్ పదేండ్ల ప్రగతి

1959 నుండి 1969 వరకు తూర్పు గోదవరి జిల్లాలో సాధించబడిన ప్రగతి విజయాలగు వివరిస్తూ జిల్లా పరిషత్తు ఆధ్వర్యాన యీ సంచిక ప్రకటించబడింది. ఇందులో గోదావరి మండలంలో తెలుగువారి చరిత్ర, నూరేండ్ల స్థానిక స్వపరిపాలనా విశేషాలు మొదలగు అంశాలు కూడాచేర్చారు. యువికాస కమ్యూనిటీప్రాజెక్టులు, వ్యవసాయం, విద్య, వైద్యం మొదలగు వివిధ రంగాలలో జరిగిన అభివృద్ధి విపులంగా చర్చించ బడింది. మహాభారతం లాగా యీ సంచికను పదునెనిమిది పర్వాలుగా విభజించడం చాలబాగున్నది. ప్రతిజిల్లాపరిత్తు వారు యిటువంటి ప్రత్యేక సంచికలు ప్రకటిస్తే ప్రజలకు ఎంతో మేలుచేకూర్చినవారు అవుతారు. వెల రూ 10లు.

—చైతన్య

జిల్లాల్లో

పొట్లపర్తి గ్రామంలో సురక్షిత మంచినీటి పథకం

ఆంధ్రప్రదేశ్ హోంశాఖామాత్యులు శ్రీ జె వెంగళరావు ఇటీవల కమలాపురం పంచాయతీ సమితిలోని పొట్లదుర్తి గ్రామంలో సురక్షిత మంచినీటి టాంకుకు శంఖుస్థాపన చేశారు

బహిరంగ సభకు జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ ఆర్. సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు

పూలకుంటలో గాంధీ జయంతి

కదిరి పడమర పంచాయతీ సమితి పూల కుంటలో గాంధీ జయంతి వేడుకగా జరుపబడింది

హరిజనవాడలో వీధుల పారిశుధ్యము, వివిధ పోటీలు నిర్వహింపబడినవి సాయంకాలం ఏర్పాటు చేయబడిన సభకు సమితి అధ్యక్షులు శ్రీ యస్ వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు హరిజనులకు చీరలు, దోవతులు పంచిపెట్టారు. యం యల్ ఎ శ్రీ కె రామచంద్రారెడ్డి వివిధ పోటీలలో గెలుపొందిన హరిజనులకు బహుమతులు పంచిపెట్టారు

కైకలూరులో గాంధీ జయంతి


గాంధీజయంతి, సామాజికాభివృద్ధి వారోత్సవాల సందర్భంగా కృష్ణాజిల్లా కైకలూరు సమితి ఆధ్వర్యమున ఏర్పాటు చేసిన సభలో మాజీశాసన సభ్యులు శ్రీ కల్మెల అప్పారావు ప్రసంగించారు

సమితి విస్తరణాధికార్లు, సిబ్బంది, కైకలూరు సర్పంచ్ జనాబ్ షేకుసమ్యుల్లా సాహెబ్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు తదితర సిబ్బంది, యితర పురప్రముఖులు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు నుండి గాంధీ విగ్రహము వరకు గల మెయిన్‌రోడ్డును శుభ్రపరిచి, శ్రమదానంతో 120 గజాల మురుగుకాల్వ త్రవ్వారు.

దానగూడెం హరిజనవాడలో ఉత్తమ పిల్లలను, యిండ్లను ఎన్నికచేసి బహుమతులు పంచియిచ్చారు.

విద్యుచ్ఛక్తి సబ్ స్టేషనుకు శంకుస్థాపన

మహబూబునగర్‌జిల్లా, మద్దూరు సమితిలోని కోస్గిలో విద్యుచ్ఛక్తి సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీ రాణీ రత్నమ్మ దేశముఖ్ శంకుస్థాపనచేశారు.



రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ అక్టోబరు 6 వ తేదీన శ్రీశైలం ఆలయాన్ని సందర్శించారు

లైన్‌ఛార్జి, క్వార్టర్స్‌తో సహా సబ్‌స్టేషన్ నిర్మాణానికి రు. 6 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా. 1970 డిసెంబరు నాటికి లైను, 1971 మార్చినాటికి క్వార్టర్స్ నిర్మాణం పూర్తి అవుతుందని ఆశించబడుతున్నది

గుంటూరులో ట్యూబెక్టమీ శిబిరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, గృహనిర్మాణ, మునిసిపల్ పరిపాలనశాఖ ప్రత్యేక కార్యదర్శి, శ్రీడి ఆర్.సుందరం యిటీవల గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో టుబెక్టమీ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు ఆ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, జనాభా పెరుగుదలను అరికట్టే విషయంలో లక్ష్య సాధనకు కుటుంబనియంత్రణ విభాగం సిబ్బంది సేవాభావంతో తీవ్రంగా కృషిచేయాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరు శ్రీ ఎం. వెంకటరత్నం ప్రసంగిస్తూ, అర్హమైన దంపతులను దృష్టిలో ఉంచుకొని ఆచరణ సాధ్యమైన లక్ష్యాలను నిర్ణయించాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు

తెగులు నివారణకు శిక్షణ

చిత్తూరుజిల్లా కలెక్టరు శ్రీ బి. వి రామారావు తెగులు నివారణ విషయంలో రైతులకు తగిన శిక్షణ ఇవ్వడానికి ఇటీవల 5 రోజుల వరకు ఏర్పాటైన శిక్షణ శిబిరానికి ప్రారంభోత్సవం జరుపుతూ, రైతులు కష్టపడి 30 శాతం అధికంగా ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసినందుకు వారిని అభినందించారు పంటల తెగులు నివారణ విషయంలో ఆధునిక పద్ధతులను నేర్చుకోవాలని కలెక్టరు రైతులకు చెప్పారు.



ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అక్టోబరు 6 వ తేదీన రాజమండ్రి సమీపంలో లాలా చెరువు వద్ద సహకార మిల్లుకు ప్రారంభోత్సవం చేశారు

కోటంక గ్రామానికి విద్యుచ్ఛక్తి

హోం శాఖామంత్రి శ్రీ జె. వెంగళరావు, యిటీవల కోడేరు పంచాయతీ సమితిలోని కోటంక గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవంచేస్తూ విద్యుచ్ఛక్తిని సద్వినియోగం చేసుకొని ఆహారోత్పత్తిని అధికం చేయాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.

లఘు పరిశ్రమల శాఖామంత్రి శ్రీ జి. సి. వెంకన్న ప్రసంగిస్తూ రాయలసీమ అభివృద్ధికి కొన్ని పథకాలను అమలు జరపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు.



ముఖ్యమంత్రి అక్టోబరు 5 న ఏలూరులోని సెంట్ థెరిసాస్ కళాశాలలో సైన్సు లేబరేటరీకి ప్రారంభోత్సవం చేశారు.


పంచాయతీరాజ్ సిబ్బందికి మంత్రి ఉద్బోధ

పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి, సెప్టెంబరు 14వ తేదీన ఆదిలాబాదు జిల్లా పరిషత్తు హాలులో జరిగిన అధికార, అనధికారుల సమావేశంలో ప్రసంగిస్తూ ఉత్సాహం, సహకార దృక్పథంతో కలిసికట్టుగా కృషిచేస్తూ పంచాయతీరాజ్ వ్యవస్థను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. క్లిష్టపరిస్థితులు తప్పక ఉంటాయనీ అయితే కార్యదీక్షతో వాటిని అధిగమించాలనీ ఆయన అన్నారు

మంచినీటి బావుల త్రవ్వకానికి ఎంత మొత్తమైనా యివ్వబడుతుందని మంత్రి అన్నారు

జీడిమామిడి పెంపకానికి మంత్రి ప్రారంభోత్సవం

అటవీశాఖా మంత్రి, శ్రీ సాగి సూర్యనారాయణ రాజు యిటీవల మందసాలో విశ్రాంతి గృహానికీ, కాశిబుగ్గలో



ముఖ్యమంత్రి అక్టోబరు 7 న విజయవాడలో 'విజయకృషా' సూపర్ బజారుకు ప్రారంభోత్సవం చేశారు.

మాజీ జిల్లా అటవీశాఖాధికారి శ్రీ పి వి రమణ అధ్వర్యంలో నిర్వహించబడుతున్న 420 ఎకరాల జీడిమామిడి తోటకు ప్రారంభోత్సవం చేశారు.

మందసాలో గిరిజనుల సమావేశంలో మంత్రి ప్రసంగిస్తూ గిరిజనుల సంక్షేమం నిమిత్తం ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ సంక్షేమ పథకాల అమలులో సహకరించాలని గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. సంఘ వ్యతిరేక శక్తుల దుర్బోధలకు లోనుకారాదని ఆయన ఉద్బోధించారు. సేద్యయోగ్యమైన కొన్ని అటవీభూములను గిరిజనులకు కేటాయిస్తారని మంత్రి అన్నారు.

బూర్గుంపహాడులో వరదబాధిత సహాయ కార్యక్రమాలు

ఖమ్మం జిల్లా, బూర్గుంపహాడు తాలూకాలో వరదలకు గురి అయిన గ్రామాలలో 802 యిండ్లు నీటిలో మునిగిపోయాయి. బాధితులకు రు 25ల చొప్పున మంజూరు చేశారు పూర్తిగా కూలిపోయిన 27 యిండ్లవారికి రు 50ల చొప్పున సహాయం అందజేశారు. వరదలకు గురిఅయిన గ్రామాలలో 46 క్వింటాళ్ల బియ్యం పంపిణీచేశారు. సహాయ కార్యక్రమాలకు రు 1550 మంజూరు చేశారు ఆరు చెరువుల మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలను నీటిపారుదల శాఖకు పంపారు.

యువకులకు మంత్రి ఉద్బోధ

గృహ నిర్మాణ శాఖామంత్రి శ్రీ సి రాజ నరసింహ మెదకు జిల్లాలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, యువకులు ముందుకువచ్చి అభివృద్ధి కార్యకలాపాలలో పాల్గొనడం చాలా హర్షదాయకమని, ఇది దేశప్రగతికి శుభ సూచకమని అన్నారు ఈ సభకు జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ పి. నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు.

యువకులు తమశక్తి సామర్థ్యాలను సమాజ సంక్షేమానికై సక్రమ పద్ధతిలో వినియోగించినట్లయితే వారు ఎన్నో ఘన కార్యాలు సాధించగలరనీ, జిల్లా అభివృద్ధికై వారు సాయశక్తులా కృషిచేయగలరని ఆయన చెప్పారు. మంజీరా జలాలు వినియోగించడానికి ఒక ఇర్రిగేషన్ పథకం మంజూరైనదనీ, ముందుముందు జిల్లాలో నీటిపారుదల సౌకర్యాలు అభివృద్ధి కాగలవనీ ఆయన అన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు త్వరలో బస్సునడిపించడానికి ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థవారు అంగీకరించారని ఆయన వెల్లడించారు.



పంచాయతీరాజ్ మంత్రి శ్రీ తోటరామస్వామి అక్టోబరు 3 న విశాఖ జిల్లా నెల్లిమర్లలో ప్రాథమిక ఆరోగ్య భవనానికి శంకుస్థాపన చేశారు



ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అక్టోబరు 5 న పశ్చిమగోదావరి జిల్లా, భీమడోలులో తుఫాను బాధితుల పునరావాస కాలనీకి శంకుస్థాపన చేశారు

యాత్రాకేంద్రంగా సూర్యలంక అభివృద్ధి

మహిళా సంక్షేమం, యాత్రిక శాఖల మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ, బాపట్లలోప్రసంగిస్తూ యాత్రాకేంద్రంగా సూర్యలంకను అభివృద్ధి పరచడానికి మంచి అవకాశం ఉందని అన్నారు.

బాపట్లలో తనకు జరిగిన పౌరసన్మానానికి సమాధానమిస్తూ మంత్రి పై విధంగా అభిప్రాయపడినారు.

సూర్యలంక తీరంపై త్వరలోనే యాత్రికుల విశ్రాంతి భవనాన్ని నిర్మిస్తారని మంత్రి అన్నారు సూర్యలంకను సుందర పట్నంగా తీర్చిదిద్దడానికి ప్రాముఖ్యత నివ్వాలని మునిసిపాలిటీ పెద్దలకు ఆమె విజ్ఞప్తిచేశారు. జాతీయ సమైక్యత, ప్రాంతీయ అవగాహనకు వీలుగా ప్రజలు యాత్రలు నిర్వహించాలని కూడా ఆమె విజ్ఞప్తిచేశారు.

చీరాలలో పౌరసన్మానానికి మంత్రి సమాధానమిస్తూ ఓడరేవును సముద్రతీర యాత్రాకేంద్రంగా అభివృద్ధిపరచే విషయాన్ని పరిశీలించే నిమిత్తం ట్రావెల్ ఏజంట్ల బృందాన్ని అక్కడికి పంపుతామని ఆమె వెల్లడించారు. ఓడరేవులో యాత్రికుల హోటల్‌ను నిర్మించడానికి ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ కేంద్రప్రభుత్వం సహాయం లభించేవిధంగా చూస్తామని ఆమె హామీ యిచ్చారు విదేశీ యాత్రల పెంపుదలకు నాలుగవ ప్రణాళిక కాలంలో దేశంలో 4 విమానాశ్రయాలను నిర్మిస్తారని మంత్రి అన్నారు.

ట్యుబెక్టమీ శిబిరానికి మంత్రి ప్రారంభోత్సవం

ఆరోగ్య శాఖామంత్రి శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ, సెప్టెంబరు 15న మహబూబ్‌నగర్ ట్యుబెక్టమీ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 1950 నుండి జాతీయ స్థాయిలో కుటుంబనియంత్రణ కార్యక్రమం అమలు జరపబడుతూ ఉన్నప్పటికీ యీనాడు యీ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నదని అన్నారు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె కె రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు.

కృష్ణా జిల్లాలో కుటుంబనియంత్రణ పక్షోత్సవానికి ప్రారంభోత్సవం


కృష్ణాజిల్లా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ పి వి రంగారెడ్డి, మచిలీపట్నంలో కుటుంబ నియంత్రణ పక్షోత్సవానికి ప్రారంభోత్సవం చేస్తూ యింతవరకు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు పట్టణ ప్రాంతాలకే పరిమితమైనాయనీ, గ్రామాలలో నివసిస్తున్న బడుగు వర్గాల పేద కుటుంబాలు తమ సంతానాన్ని పరిమితం చేసుకోవాల్సిన అవసరం చాలా ఉందనీ అభిప్రాయ పడ్డారు గ్రామాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని కుటుంబ నియంత్రణ కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

గుంటూరులో మహిళా సంక్షేమ మంత్రికి సన్మానం


మహిళా సంక్షేమం, యాత్రికశాఖల మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ, గుంటూరులో తమకు జరిగిన పౌరసన్మానానికి సమాధానమిస్తూ ఒక వైపు పట్టణ సర్వతోముఖాభివృద్ధికీ, మరో వైపు పట్టణానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ సుందరంగా తీర్చి దిద్దడానికీ కౌన్సిలర్లు కృషిచేయాల్సిఉంటుందని అన్నారు. మునిసిపల్ కౌన్సిలర్ల బృందాన్ని ఢిల్లీకి పంపి అక్కడ సాధించిన అభివృద్ధిని పరిశీలింపజేయాలని మునిసిపాలిటీ అధ్యక్షునికి ఆమె విజ్ఞప్తి చేశారు.

విడిగా మహిళా సంక్షేమశాఖ ఉన్న ఏకైకరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అనీ, ప్రజల సహకారం లభించినచో యీ రంగంలో ఎంతో పని జరగాల్సి ఉందనీ ఆమె అభిప్రాయపడినారు. రాష్ట్రంలో యాత్రావ్యవహారాలను గూర్చి ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ యాత్రలకు విదేశీమారకం అవసరమని, అంతర్రాష్ట్రీయ యాత్రలకు ప్రజల సహకారం అవసరమని మంత్రి అన్నారు

మునిసిపాలిటీ అధ్యక్షుడు శ్రీ చేబ్రోలు హనుమయ్య, మంత్రికి సన్మానపత్రం సమర్పిస్తూ గుంటూరులో యాత్రికుల హోటల్ నిర్మించాలని విజ్ఞప్తిచేశారు.



మహిళా సంక్షేమ, యాత్రికశాఖా మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ అక్టోబరు 2 న హైదరాబాదు జిల్లాపరిషత్తు హాల్లో సమాజ అభివృద్ధి వారోత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు



చేనేత, సహకార ఫ్యాక్టరీల శాఖామంత్రి శ్రీ అనగాని భగవంతరావు సెప్టెంబరు 10న తిరుపతిలో, పునర్వ్యవస్థీకృత రాష్ట్ర చేనేత సలహామండలి సమావేశంలో ప్రసంగించారు

నాగార్జునసాగర్ వద్ద యాత్రికులకు ఇతోధిక సౌకర్యాలు

మహిళా సంక్షేమం, యాత్రా విషయాల శాఖామంత్రి శ్రీమతి రోడామిస్త్రీ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ప్రాంతంలో జంబో జెట్టులు, ఇతర పెద్ద విమానాలు దిగడానికి వీలుగా విమానాశ్రయం నిర్మించడానికి తగిన వసతి సౌకర్యాలు కల్పించడానికై కృషి చేయడం జరుగుతున్నదని చెప్పారు అన్ని వర్గాల యాత్రికులకు తగినట్లుగా ఇక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లయితే అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిన నాగార్జునసాగరుకు అసంఖ్యాకంగా విదేశీ యాత్రికులు రాగలరని ఆమె ఆశాభావం వెల్లడించారు.

ఆర్థిక సౌకర్యంలేదని భావిస్తూ ఉన్నట్లయితే, ఏ రంగంలో కూడ మనం అభివృద్ధి సాధించలేము. కార్యసాధనకు సంకల్పం వున్నట్లయితే తలపెట్టిన పనిని సాధించవచ్చని ఆమె అన్నారు.

నల్లపాడు పంచాయతీ సమితికి ప్రారంభోత్సవం

గుంటూరు కలెక్టరు శ్రీ యం. వెంకటరత్నం సెప్టెంబరు 17 తేదీన జిల్లాలోని నల్లపాడు పంచాయతీ సమితికి ప్రారంభోత్సవం జరుపుతూ, అభివృద్ధి కార్యకలాపాలకు ఆర్థిక పోషణం చేకూర్చడానికి పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక వనరులను పెంపొందించాలని ఉద్బోధించారు

ఈ సందర్భంలో జరిగిన సభకు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు ఆయన ప్రసంగిస్తూ, సమితి అభివృద్ధికై సర్పంచ్‌లు సమితి అధ్యక్షునితో సహకరించ వలసిందని సలహా ఇచ్చారు




మహిళా సంక్షేమశాఖామంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ సెప్టెంబరు 14 న గుంటూరులో మహిళా కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు

జర్నలిస్టులు ప్రాజెక్టుల సందర్శనకు మంత్రి హర్షం

రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖా మంత్రి, శ్రీమతి రోడా మిస్త్రీ, ఇటీవల గుంటూరులో ప్రెస్‌క్లబ్‌లో ప్రసంగిస్తూ పత్రికా విలేఖరుల అంతర్జిల్లా పర్యటనల ఏర్పాటును గూర్చి తాము పరిశీలిస్తామని హామీయిస్తూ, దీనివల్ల అభివృద్ధి కార్యక్రమాలకు మంచి ప్రచారం లభిస్తుందని అన్నారు సదవగాహన సత్సంబంధాలకు రాష్ట్ర వ్యాప్తి పర్యటనలు దోహదం కలిగిస్తాయని మంత్రి అన్నారు

వెసక్టమీ శిబిరానికి మంత్రి ప్రారంభోత్సవం

రాష్ట్ర మార్కెటింగ్ వ్యవసాయ పరిశ్రమల శాఖామంత్రి శ్రీ రామ చంద్రరావు కళ్యాణి, సెప్టెంబరు 15 వ తేదీన అచ్చంపేట పంచాయతీ సమితిలోని అమారాబాదులో వెసక్టమీ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు




మార్కెటింగ్ శాఖా మంత్రి శ్రీ రామచంద్రరావుకల్యాణి అక్టోబరు 8న మహబూబ్‌నగర్‌లో ఒక సమావేశంలో ప్రసంగించారు

అచ్చంపేటలో మహిళామండలి భవనానికికూడా మంత్రి ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సంక్షేమ కార్యక్రమాలలో మహిళలు సహకరిస్తున్నందుకు వారిని అభినందించారు

దేశ సేవకై మహిళలకు పిలుపు


మహిళా సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ, సెప్టెంబరు 18 న గుంటూరులో బాలికల పాలిటెక్నిక్ విద్యార్థినుల సంఘానికి ప్రారంభోత్సవం చేస్తూ, ఆర్కిటెక్చర్ కోర్సులను తీసుకోవాలని బాలికలను ఉద్బోధించారు మంచి గృహిణులుగాను, తల్లులుగాను, కోడళ్ళుగాను ప్రముఖ పాత్ర నిర్వహించాలని మహిళలకు ఆమె పిలుపునిచ్చారు.



పౌర సరఫరాల మంత్రి శ్రీ ఆనం సంజీవరెడ్డి అక్టోబరు 2 న నెల్లూరులో కుటుంబనియంత్రణ శిబిరాన్ని సందర్శించారు.

కార్మికుల యిండ్ల కాలనీకి కేంద్ర మంత్రి శంకుస్థాపన

కేంద్ర కార్మిక, పునరావాస శాఖల మంత్రి శ్రీ డి. సంజీవయ్య సెప్టెంబరు 20 న నెల్లూరులో సహకార నూలు మిల్లు కార్మికుల యిండ్ల కాలనీకి శంకుస్థాపన చేశారు



కేంద్ర కార్మిక పునరావాస శాఖామంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య సెప్టెంబరు 20 న నెల్లూరులో జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ కాలనీకి శంకుస్థాపన చేశారు.

నెల్లూరు జర్నలిస్టుల యిండ్ల కాలనీకి, సాంఘిక సంక్షేమ శాఖ రు 20,000 ల ఖర్చుతో హరిజన కాలనీలో నిర్మించిన మంచి నీటి బావులకు కూడా మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

సహకార నూలు మిల్లులో జరిగిన సభకు రాష్ట్ర చేనేత పరిశ్రమ శాఖా మంత్రి శ్రీ అనగాని భగవంత రావు అధ్యక్షత వహించారు. కేంద్రమంత్రి, జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు.

కీ.శే. ఎ. సి. సుబ్బారెడ్డికి మంత్రి నివాళులు

కీ శే ఎ. సి. సుబ్బా రెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా నెల్లూరులో జరిగిన బహిరంగ సభలో కేంద్ర కార్మికశాఖా మంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రసంగిస్తూ, కీ.శే ఎ సి సుబ్బారెడ్డి తమ జీవితకాలంలో ప్రజలకు చేసిన సేవకు జోహార్లు అర్పించారు శ్రీ సుబ్బారెడ్డి తమ ప్రజా సేవతో ప్రజల మనస్సులలో శాశ్వత స్థానాన్ని పొందారని ఆయన అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ సంఘం అధ్యక్షుడు శ్రీ పి. నరసా రెడ్డి యీ సభకు అధ్యక్షతవహించారు.

కేంద్రమంత్రి, కీ శే. సుబ్బారెడ్డి సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదానం కార్యక్రమాన్నికూడా ఆయన తిలకించారు.



జంటనగరాల వరదబాధితుల సహాయార్థం వసూలు చేసిన దుప్పట్లు, వస్త్రాలను సెప్టెంబరు 27 న కాకినాడలో జిల్లా కలెక్టరు రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రికి అందజేశారు

పేదరికాన్ని బట్టి ఉద్యోగాలివ్వాలి
కార్మికమంత్రి అభిభాషణ

కార్మికశాఖా మంత్రి శ్రీ జి సంజీవరెడ్డి ఇటీవల నెల్లూరులో మాట్లాడుతూ నిరుద్యోగ విషయం ప్రస్తావించి, పేదరికాన్ని ఆధారంగా తీసుకొని, రిజిస్టరైన నిరుద్యోగుల సీనియారిటీని బట్టి వారికి ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజీలు ఉపాధికల్పించే విషయమై ప్రభుత్వం పరిశీలిస్తున్నదని చెప్పారు. కుటుంబాల జీవనం అభ్యర్థుల పైననే ఆధారపడివున్న సందర్భములలో, వారికి ఉపాధి కల్పించే విషయమై ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజీలు కృషిచేస్తాయి.



కడపజిల్లా పులివెందలలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6 వరకు జరిగిన గనుల రక్షణ వారోత్సవం సందర్భంగా ఆం. ప్ర. గనుల కార్పొరేషన్‌కు సంబంధించిన డా. శర్మ ప్రసంగించారు.

ట్యూబెక్టమీ శిబిరానికి ప్రారంభోత్సవం

ఇబ్రహీంపట్నం పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ అనంత రెడ్డి సెప్టెంబరు 21 వ తేదీన ఇబ్రహీంపట్నంలో రెండవ ట్యూబెక్టమీ శిబిరానికి ప్రారంభోత్సవం జరిపారు.

పారిశ్రామిక ఉత్పత్తి ఉద్యమ వారోత్సవాలకు ప్రారంభోత్సవం

పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టరు శ్రీ నరేంద్రలూథర్ సెప్టెంబరు 21 న నిజామాబాదు జిల్లా పరిషత్తు హాలులో పారిశ్రామిక ఉత్పత్తి ఉద్యమ వారోత్సవాలకు ప్రారంభోత్సవం



పాల్వంచలోని గిరిజన పాఠశాల విద్యార్థులకు ఖమ్మంజిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టరు సతీమణి శ్రీమతి లక్ష్మిగౌడ్ అక్టోబరు 5 న బట్టలు పంపిణీ చేశారు.

జరుపుతూ ప్రపంచమార్కెటుకు తీసిపోకుండా మంచి ప్రమాణాలు గల వస్తువులను ఉత్పత్తి చేయవలసిందని పరిశ్రమదారులకు వినతిచేశారు జిల్లా కలెక్టరు శ్రీ డి. శంకరగురుస్వామి ఈ సభకు అధ్యక్షత వహించారు

యాచారం ఆసుపత్రిలో 25 మంచాల ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వ పథకం క్రింద 25 మంచములు గల వార్డును స్థాపించడానికి ఇబ్రహీంపట్నం పంచాయతీ సమితిలోని యాచారం ఆసుపత్రి ఎన్నిక చేయబడిందని హైదరాబాదు జిల్లా ప్రధానవైద్య శాఖాధికారి డా ఎ తిమ్మాజీరావు వెల్లడిచేశారు అయితే ఆ గ్రామ ప్రజలు దీని నిర్మాణానికి ఉచితంగా భూమిని ఇవ్వవలసి వుంటుందని ఆయన చెప్పారు


రామగుండంలో ప్రేలుడు పదార్థాల ఉత్పత్తి

రామగుండంలో ప్రేలుడు పదార్థాల కర్మాగారాన్ని స్థాపించే విషయమై, స్థలాన్ని పరిశీలించేందుకు భారత ప్రభుత్వం ఆర్డినెన్సు ఫ్యాక్టరీ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి చెందిన ముగ్గురు సభ్యులతో కూడిన సంఘం సెప్టెంబరు నెలలో కరీంనగరం సందర్శించింది.

ఈ సంఘ సభ్యులు. డి. ఆర్. ఓ శ్రీ యస్. వెంకట్రామయ్య, పెద్దపల్లి ఆర్ డి ఓ శ్రీ శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ డైరెక్టరు, కరీంనగర్ జిల్లా అసిస్టెంటు డైరెక్టరు కలసి రామగుండం వెళ్ళి ఫాక్టరీ కొరకు గోదావరి ఖనివద్ద ప్రత్యేకించ బడిన 2,800 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు నీటిసరఫరా జరిగే గోదావరి నది స్థలం కూడా ఈ జట్టు పరిశీలించింది దీనికి రామగుండం రైల్వేస్టేషను సుమారు 2 మైళ్ళ దూరంలో వుంది

యువకులకు మంత్రి ఉద్బోధ

రాష్ట్ర రెవిన్యూ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి సెప్టెంబరు 22 న చంద్రగిరి పంచాయతీ సమితిలోని పుదిపట్ల గ్రామంలో ఏర్పాటైన బహిరంగసభలో ప్రసంగిస్తూ భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎదుర్కొనడానికి యువకులు సంసిద్ధులై వుండాలనీ, గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలను పత్రికల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావాలనీ ఉద్బోధించారు



కరీంనగర్ జిల్లాకలెక్టరు శ్రీ ఎస్ వి సుబ్రహ్మణ్యన్ సెప్టెంబరు 21 న రూ. 70 వేల తో నిర్మించిన బాలభవన్‌కు ప్రారంభోత్సవం చేశారు.

శిశు సంక్షేమ గృహానికి శంకుస్థాపన

మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరు శ్రీమతి శ్రీరాజ్యంసిన్హా యిటీవల సంగారెడ్డిలో శిశు సంక్షేమ గృహానికి శంకుస్థాపన చేస్తూ ఇట్టి సంస్థలో నివసిస్తున్న బాలబాలికలపట్ల ప్రజలు సానుభూతి, ప్రేమాభిమానాలు ప్రదర్శించి, ఈ పిల్లలు తాముకూడా సమాజంలో భాగస్వాములుగా ఉన్నామనే భావన వారిలో కలిగేట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు జిల్లా కలెక్టరు శ్రీ యస్. చక్రవర్తి అధ్యక్షత వహించారు

మెదక్‌లో గృహనిర్మాణ పథకాలకు రూ. 15 లక్షల మంజూరీ

గృహనిర్మాణ శాఖామంత్రి శ్రీ సి. రాజనరసింహ ఇటీవల సిద్ది పేటలో జరిగిన బహిరంగ సభలో తమకు సమర్పించిన పౌర సన్మానానికి సమాధానమిస్తూ, విశాల దృక్పథంతో కష్టించి పనిచేసినట్లైతే, ప్రజలలోని వెనుకబడిన తనాన్ని తొలగించవచ్చుని చెప్పారు.

భూములులేని వారికి భారీయెత్తున భూములు పంచిపెట్టే కార్యక్రమాన్ని మొట్టమొదట చేపట్టిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. ఒక్క మెదకు జిల్లాలోనే 45,000 ఎకరాలు పంచిపెట్టబడినాయి. మిగిలిన 5,000 ఎకరాల భూమి కూడా త్వరలోనే పంచిపెట్టబడుతుంది. ఈ భూములను సాగుచేయడానికిగాను అవసరమైన పరపతి సౌకర్యాలు కూడా కల్పించబడుతున్నాయని మంత్రి చెప్పారు.

మహబూబునగరం తెగులు ప్రాంతంగా ప్రకటన

మహబూబునగరం జిల్లాలో వరిపంటకు 5,000 ఎకరాలలో గాల్ ప్లై అనే తెగులు వచ్చింది. తనుక 1961 సం॥ ఆంధ్రప్రదేశ్ తెగులు నివారణ చట్టం క్రింద మహబూబ్‌నగరం, కల్వకుర్తి, ఆత్మకూరు, వనపర్తి తాలుకాలు తెగులు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ తెగులును అదుపులో పెట్టడానికి రసాయనిక పదార్థాల వినియోగానికయ్యే ఖర్చులో 75 శాతం సబ్సిడీగా లభిస్తుంది.

ఈ తెగులును నివారించేందుకు ఎండ్రిన్, పారాథియన్, డిమెక్రాన్ మందులు ప్రయోగించాలని సూచనచేయబడింది. ఒక్కొక్క ఎకరానికి సరిపడే రూ.16 ల ఖరీదుచేసే రసాయనిక మందులు రైతులకు రూ. 4 లకే ఇవ్వబడుతాయి. అవసరమైన రసాయనిక మందులు, మొక్కల రక్షణ పరికరాలు మున్నగునవి తెగులు ప్రబలినచోట్ల కీలక ప్రాంతాలలో సిద్ధంగా వుంచబడినాయి.

కొత్తగూడెం గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరా

కొత్తగూడెం పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ సి. హెచ్. కాశయ్య ఇటీవల ఎర్రగుంట గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం జరిపారు.

కొత్తగూడెం సమితిలో ఇంతవరకు మొత్తం 7 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరిగింది.

కుటుంబ నియంత్రణ భవనానికి శంకుస్థాపన

ఉప ముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు ఇటీవల గుంటూరు జిల్లాలోని నల్లపాడులో కుటుంబనియంత్రణ భవనానికి శంకుస్థాపన చేస్తూ కుటుంబనియంత్రణ పద్ధతులవల్ల ప్రజలలోగల భయాందోళనలను, అపోహలను తొలగించడానికి ఈ పద్ధతుల విషయమై పరిశోధన చేయాలని చెప్పారు.

ప్రాంతీయ కుటుంబనియంత్రణ శిక్షణ కేంద్ర భవనం రూ. 10 లక్షల ఖర్చుతో నిర్మించబడుతున్నది.

మన రాష్ట్రంలో గత సంవత్సరం రెండు లక్షల మందికి ఆపరేషనులు చేయడం జరిగింది. ఈ సంవత్సరం మూడు లక్షల మందికి ఆపరేషనులు చేయాలని లక్ష్యంగా నిర్ణయించబడింది. మీద ప్రజలకు కుటుంబనియంత్రణ పద్ధతులను వివరించి చెప్పి, వారు ఈ పద్ధతులను పాటించేట్లు చేయాలి. పరిమిత కుటుంబాన్ని గురించి గాంధీజీ కూడా ప్రజలను ఉద్బోధించారు. అయితే ఇందుకు బ్రహ్మచర్యం పాటించాలని ఆయన చెప్పారు–అని ఉపముఖ్యమంత్రి అన్నారు.

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. నాగేశ్వరరావు శంకుస్థాపనోత్సవానికి అధ్యక్షత వహించారు.

ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టరు అతిథులకు స్వాగతం చెప్పారు.

పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల సహాయం

రాష్ట్ర లఘుపరిశ్రమల శాఖా మంత్రి, శ్రీ జి. సి. వెంకన్న యిటీవల గుంటూరులో ప్రసంగిస్తూ 1969–70 సంవత్సరంలో గుంటూరులో 167 కొత్త పరిశ్రమలను స్థాపించడానికి జాతీయం చేయబడిన బ్యాంకులు రు. 1.5 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందజేశాయని అన్నారు.

గుంటూరులో మయూరీ పరిశ్రమలకు మంత్రి ప్రారంభోత్సవం చేస్తూ యీ విషయం వెల్లడించారు. ఈ సంవత్సరం గుంటూరు జిల్లాలో కొత్త పరిశ్రమలను ప్రారంభించడానికి రు. 150 లక్షలు సహాయంగా అందజేస్తారని ఆయన అన్నారు.

హరిజన దినోత్సవం-వస్త్ర దానం

మదనపల్లి అసిస్టెంట్ కలెక్టరు శ్రీ ఎన్. కె. పచౌరి, మదనపల్లి పంచాయితీ సమితిలోని గొల్లపల్లిలో హరిజన దినోత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన హరిజనులకు దుస్తులు పంపిణీచేశారు.

శ్రీకాకుళంలో సమాజవికాస వారోత్సవాలు

జిల్లా కలక్టరు శ్రీ బి. ఎన్. యుంగందర్, శ్రీకాకుళంలో జాతీయ సమాజవికాస వారోత్సవాలను ప్రారంభిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనే దృక్పథాన్ని ప్రజలలో కల్పించడానికి యీ కార్యక్రమాల అమలులో గణనీయమైన ఫలితాలను సాధించడానికి యీ వారోత్సవాలు ఉపయోగపడ్డాయని అన్నారు.

సమాజవికాస లక్ష్యాల సాధనకు, ప్రజలు తమవంతు పాత్రను నిర్వహించాలని కలెక్టరు ఉద్బోధించారు.

లక్ష్యసాధనకు ఉత్తమమార్గాలను అనుసరించాలి

బా–బాపూజీ జిల్లా సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో

గాంధీ, కస్తూర్బా భవనంలో అక్టోబరు 2వ తేదిన 101వ గాంధీ జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

ఈ సంస్థ ఏర్పాటుకు రు. 65,000ల ఖర్చుతో కీ. శే. డా. పట్టాభి సీతారామయ్య గృహాన్ని యీ సంఘం కొనుగోలుచేసింది.

జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ పి. కోటేశ్వరరావు ఉత్సవానికి అధ్యక్షత వహించారు. పార్లమెంటు సభ్యుడు శ్రీ కె. పి. మల్లికార్జునుడు ప్రసంగిస్తూ లక్ష్యసాధనకు ఉత్తమ మార్గాలను అనుసరించడంలో గాంధీజీ ఎక్కువ ప్రాధాన్యం యిచ్చేవారని అన్నారు.

స్వాతంత్ర్య యోధుడు శ్రీ కొడాలి అంజనేయులు ప్రసంగిస్తూ గాంధీజీ జీవితంలోని ఆసక్తి కలిగించే కొన్ని సంఘటనలను వివరించారు.

చిత్తూరుజిల్లాలో 58 గ్రామాలకు విద్యుచ్ఛక్తి

చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, చంద్రగిరి, మదనపల్లి మూడు డివిజనులలో రాయలసీమ ప్రణాళిక అభివృద్ధి మండలి గ్రాంట్లతో 1970-71 లో 58 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని ప్రతిపాదించారు.

గిరిజన గ్రామపంచాయతీలో నూటికి నూరుశాతం పన్నుల వసూళ్ళు

తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం పంచాయతీ సమితిలోని రంప గిరిజన గ్రామపచాయతీలో నూటికి నూరు పాళ్ళు పన్నులు వసూలు చేశారు.

పౌర విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ పంచాయతీ సిబ్బందితో సహకరిస్తున్నందుకు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ డి. రాజు, గిరిజనులను అభినందించారు.

పారిశ్రామిక చర్చాగోష్ఠికి ప్రారంభోత్సవం

లఘు పరిశ్రమల శాఖామంత్రి శ్రీ జి. సి. వెంకన్న ప్రొద్దుటూరులో గత సెప్టెంబరు 27 న పారిశ్రామిక చర్చాగోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తూ, రాయలసీమ పారిశ్రామికంగా, వ్యావసాయకంగా వెనుకబడి వున్నదనీ, ఈ ప్రాంతంలో ప్రజల తలసరి ఆదాయం చాల తక్కువగా వున్నదనీ చెప్పారు. ఈ ప్రాంతంలో కరువును శాశ్వతంగా నిర్మూలించి, ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రాయలసీమ కొరకు ప్రత్యేకంగా ఒక సాంకేతిక విభాగం మంజూరైనదనీ, దీనికొరకు రూ. 10 లక్షలు కేటాయించడం జరిగిందనీ, మంత్రి వెల్లడి చేశారు. ఈ సాంకేతిక విభాగంవల్ల పరిశ్రమలు నెలకొల్పదలచినవారికి సాంకేతిక సహాయం లభిస్తుందని ఆయన అన్నారు.

అంతకుముందు కడపజిల్లా కలెక్టరు శ్రీ యస్. వి. గిరి అతిథులకు స్వాగతం చెప్పారు.

పరిశ్రమల అడిషనల్ డైరెక్టరు శ్రీ నరేంద్ర లూథర్ ఈ సందర్భంలో ప్రచురించబడిన ప్రత్యేక సంచికను విడుదల చేశారు.

మా రచయితలు

శ్రీ రావిపాటి మహానంద, ఎం.ఎల్.ఎ. దరశి ఒంగోలు జిల్లా.

శ్రీ టి. ఎ. పద్మనాభరావు, దండువారి వీధి, నెల్లూరు.

శ్రీ ఎన్. ఎన్. రావు, పాత గుంటూరు, గుంటూరు.

శ్రీ ఎన్. కామరాజు పంతులు, కామర్స్ లెక్చరర్ రీజినల్ కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, భోపాల్.

శ్రీ బి. విద్యాసాగర్, చిక్కడపల్లి, హైదరాబాదు.

శ్రీ ఎస్. హనుమత్ప్రసాద్, ఇంటర్మీడియెట్ విద్యార్థి, విజయవాడ.

శ్రీ యర్రోజు శ్రీనివాసరావు, ట్రాన్స్‌లేటర్ టు గవర్నమెంటు, అనువాదకశాఖ, హైదరాబాదు.

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, డిప్యూటీ డైరెక్టర్, విద్యాశాఖ, హైదరాబాదు.


శ్రీ కె. విశ్వేశ్వరరావు, ఆర్థికగణాంకశాఖ, హైదరాబాదు.

శ్రీ కందూరి నారాయణమూర్తి, గౌలిగుడా, హైదరాబాదు.

సర్వశ్రీ సున్నా అచ్యుతరావు, వేమకోటి సీతారామశాస్త్రి, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.

శ్రీ వి. ధనంజయరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగరు, హైదరాబాదు.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS AND TOURISM, ANDHRA PRADESH, HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.



Reg. No. H.